Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం; తిథి: శుద్ధ విదియ తె.5.29 వరకు, అనంతరం తదియ; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 7.38 వరకు, అనంతరం శతభిషం; అమృతకాలం: రా.2.25 నుండి 4.15వరకు; వర్జ్యం: మ.3.35 నుండి 5:21వరకు; దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

సంపుటి:57 • సంచిక:292 • బుధవారం 6 ఫిబ్రవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

ఊళ్లకు నిధుల వరద



కేంద్రంతో సమానంగా దండిగా డబ్బులు

- ఉపాధి పనులతో సంపద సృష్టి
- గ్రామ పంచాయతీల చేతుల మీదుగానే నరేగా పనులు
- అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు తప్పనిసరి
- హరిత హారానికి ప్రథమ ప్రాధాన్యత
- మొక్కల రక్షణ బాధ్యత పంచాయతీలదే
- పనులపై ఆకస్మిక తనిఖీలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పంచాయతీరాజ్ నూతన చట్టం అమల్లోకి వచ్చాక గ్రామాల అభివృద్ధికి నిధుల వరద పారనుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల వాటా పెంచనుంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (నరేగా) నిధులను సంపూర్ణంగా వినియోగించుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హరితహారం, వైకుంఠ ధామాలు (స్మశాన వాటికలు) నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో పంచాయతీరాజ్ -గ్రామీణాభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకుని గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. నరేగా పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంత మొత్తంలో నిధులు కేటాయిస్తుందో, అంతే

5వ పేజీలో...

కిసాన్ సమ్మాన్‌కు తొలి నివేదిక

వసుధా మిశ్రాకు జిల్లాలవారీ జాబితాలు

వారం, పది రోజుల్లో రాష్ట్ర రైతుల ఖాతాల్లో కుటుంబానికి రూ.2 వేల నగదు జమ



రాష్ట్రంలో లబ్ధిదారులు 47.08 లక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తంగా కోట్లాది మంది చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలన్న దృఢ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం అమలుకు అందరికన్నా ముందుగా తెలంగాణ ముందడుగు వేసింది. సీఎం కేసీఆర్ ముందుచూపు ఆలోచనతో సమగ్ర కుటుంబ సర్వే, భూ రికార్డుల ప్రక్షాళన, అనంతరం రైతుబంధు పెట్టుబడి మద్దతు పథకం అమలుకు నిర్వహించిన సర్వేల ఫలితంగా రాష్ట్రంలో నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. రైతుబంధు పథకం అమల్లో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా రైతులకు ఎకరానికి రూ.4వేల చొప్పున పెట్టుబడి ఇచ్చినందున వారి బ్యాంకు ఖాతాల వివరాలతో స్పష్టమైన సమాచారం ఉంది. దీంతో కేంద్రం అడిగిందే తడవుగా తెలంగాణ ప్రభుత్వం ప్ర ప్రథమంగా కిసాన్ సమ్మాన్ అమలుకు నివేదిక అందజేసింది. నిబంధనల ప్రకారం ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగి ఉన్న రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు కావడంతో ఆ ప్రకారం 47.08 లక్షల మంది రైతుల వివరాలను కేంద్రానికి సమర్పించింది.

మంగళవారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి వసుదా మిశ్రా రాష్ట్రానికి వచ్చారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, వ్యవసాయ

9వ పేజీలో...



9

తెలంగాణ ప్రాజెక్టులేవీ ఆపలేదు

రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా పనులు కనిపిస్తాయి

తెలంగాణలో 55 ఏళ్లలో జరగని అభివృద్ధి ప్రధాని మోడీ చేశారు: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

స్కూల్ అసిస్టెంట్లుగా తెలుగు పండిట్‌లు

పీఈటీ పోస్టులూ అప్‌గ్రేడేషన్

8,800 మంది భాషా పండితులు, 2వేల మంది పీఈటీలకు లబ్ధి

3



కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్

కష్టాల్లో కోల్‌కతా సీపీ

సీపీని షిల్లాంగ్‌లో ప్రశ్నించండి

అరెస్ట్ మాత్రం చేయొద్దు

సీబీఐ, కోల్‌కతా పోలీసులకు సుప్రీం ఆదేశం


తీర్పుపై మమత హర్షం

దీక్ష విరమణ

రాజీవ్‌పై వేటుకు సిద్ధమైన కేంద్ర హోంశాఖ

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బెంగాల్ ప్రభుత్వానికి లేఖ

11



8

లోకాయుక్త, ఉపలోకాయుక్త

భర్తీ ఎప్పుడు..?

తెలంగాణ జీవధారకు భారీ నిధులు

బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యతకు ముఖ్యమంత్రి నిర్ణయం

ఈ ఏడాదే బీడు భూముల్లోకి జలసిరులు



18న ప్రాజెక్టును సందర్శించనున్న కేంద్ర ఆర్థిక సంఘం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టుకు వరుసగా నాలుగో ఏడాది కూడా భారీ నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. గత మూడేళ్ళుగా సాగునీటిరంగానికి రూ.25వేల కోట్లచొప్పున కేటాయి స్తూ వస్తున్న సీఎం ఈ ఏడాది ఈనిధులను మరింత పెంచనున్నారు. ఇందులో భాగంగానే దేశంలోనే సాగునీటి ప్రాజెక్టుల్లో రారాజుగా పేరు తెచ్చుకున్న కాళేశ్వరం ఎత్తిపోతలకు భారీ నిధుల కేటాయింపు జరగనుంది. ఇటీవల పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ రూ.7785కోట్ల రుణం ప్రాజెక్టుకు మంజూరుచేయగా, మొత్తం ప్రాజెక్టుకు రూ.20వేల కోట్ల రుణం ఇచ్చింది. ఇక బ్యాంకుల కన్సార్టియం మరో రూ.20వేల కోట్లను కేటాయించింది. గత ఏడాది బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం రూ.5,386కోట్లు కేటాయించింది. ఈఏడాది ప్రాజెక్టును పూర్తిచేసి నీరందించాలని భావిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ ఆర్థికసంస్థల ద్వారా కేటాయించిన నిధులకు తోడు బడ్జెట్‌లోనూ కేటాయింపులు పెంచాలని నిర్ణయించారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.50వేల కోట్ల దాకా వెచ్చించగా, ఈఏడాది బడ్జెట్‌లో రూ.10వేల కోట్ల దాకా కేటాయించే అవకాశముందని అధికారవర్గాలు చెబుతున్నాయి. సీఎం కేసీఆర్ ప్రణాళిక ఫలించడంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల

2వ పేజీలో...



తెలుగు విద్యార్థుల న్యాయపోరాటం

మిషిగన్ ఫెడరల్ కోర్టులో వాదనలు

8 మంది విద్యార్థుల హాజరు

తెలిసే తప్పు చేశారు

బోగస్ వర్సిటీల్లో తరగతులు జరగవని, బోధనా సిబ్బంది ఉండరని తెలిసే చేరిన విద్యార్థులు

అమెరికా విదేశాంగశాఖ వాదన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బోగస్ విశ్వవిద్యాలయంలో చేరి కేసులను ఎదుర్కొంటున్న తెలుగు విద్యార్థుల కేసుల విచారణ ప్రారంభమైంది. తెలుగు విద్యార్థుల తరఫున అమెరికాకు చెందిన న్యాయవాది ఎడ్వర్డ్ బజుకా వాదిస్తున్నారు. అమెరికాలోని మిషిగన్ ఫెడరల్ కోర్టులో భారత కాలమాన ప్రకారం బుధవారం ఉదయం డిటెన్షన్‌లో ఉన్న ఎనిమిది మంది తెలుగు విద్యార్థుల ట్రయల్ (విచారణ) ప్రారంభమైంది. థియోడోర్ లివిస్ యునైటెడ్ స్టేట్స్ మిషిగన్ ఫెడరల్ కోర్టు హౌస్‌లో ఫార్మింగ్టన్ యూనివర్సిటీ విద్యార్థులను విచారించారు. అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ (ఆట తెలంగాణ) తరఫున ఫెడరల్ కోర్టులో అటార్నీని ఏర్పాటు చేసి విచారణను ప్రారంభించారు. తొలిరోజు బుధవారం ఎడ్వర్డ్ బజుకా వాదనలు వినిపించారు. ట్రయల్ వివరాలు అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధి వెంకట్ మంతెన

10వ పేజీలో...



8

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో జయరాం భార్య పద్మశ్రీ

ఏపీ పోలీసులపై నమ్మకం లేదు

శిఖా చౌదరిపై దర్యాప్తు చేయండి

జయరాం హత్యపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆయన భార్య పద్మశ్రీ ఫిర్యాదు

కన్యాదానం చెయ్యనంటే.. చెయ్యను..



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని నగరం కోల్‌కతాకు సమీపంలోని ఓగ్రామంలో వింత ఆచారంతో కూడిన వివాహం జరిగింది. సహజ సంప్రదాయానికి విరుద్ధంగా అక్కడ మహిళలదే ఆధిపత్యం. పురుష పురోహితులకు బదులు మహిళా పురోహితులే వేదమంత్రాలు చదివేస్తారు. వధూవరులకు వివాహ తంతు పూర్తి చేస్తారు. వినడానికి కాస్త వింతగా అనిపించినా, అక్కడ ఈ సంప్రదాయం కొన్నేళ్లుగా కొనసాగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. తాజాగా జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో వధువు తండ్రి నిర్ణయం అందరినీ ఆలోచనలో పడేసింది. కన్యాదానం తంతుకు మహిళా పురోహితులు వధువు తండ్రిని వేదికపైకి పిలిచారు. అల్లుడి కాళ్లు కడిగి కన్యాదానం చేయాలని కోరారు. ఇందుకు వధువు తండ్రి అభ్యంతరం చెప్పారు. ఇలాంటి సంప్రదాయాన్ని ఒప్పుకోనంటే ఒప్పుకోనని మొండికేశారు. ఇదేమయ్యా.. అని ప్రశ్నించగా అతను చెప్పిన సమాధానం వారిని ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంతకీ ఆయనేమన్నాడంటే..దానం చెయ్యడానికి నా కూతురు వస్తువు... కాదు.. పెళ్లి బంధం ఇద్దరు వ్యక్తుల అన్యోన్యతకు బంధంగా ఉండాలే తప్ప.. దానధర్మాల ప్రస్తావన ఉండొద్దన్న తన ఉద్దేశాన్ని నిర్మొహమాటంగా చెప్పేశాడు. ఈ జవాబుకు అందరూ ఫిదా అయ్యారు. జరిగిన సన్నివేశాన్ని వధువు సామాజిక మాధ్యంలో పోస్ట చేసింది. అంతే..గంటల వ్యవధిలో లక్షల సంఖ్యలో లైక్‌లు వచ్చాయి.. వేలాది మంది ఆయన్ను అభినందిస్తూ తిరిగి కామెంట్లు చేశారు.

సమాఖ్య స్ఫూర్తి స్ఫురించేలా..!

- తెలంగాణ సర్కార్ ఆలోచన
- 15వ ఆర్థిక సంఘానికి కీలక నివేదికలు
- పలు అంశాలపై అభ్యంతరాలు
- ఉత్తరాది, దక్షిణాది తేడాలపై నిలదీత ధోరణి
- జాతీయ స్థాయిలో చర్చించేలా కసరత్తు
- కీలక రిపోర్టులు రెడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమాఖ్య స్ఫూర్తిని జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేస్తూనే కేంద్రం నుంచి అధిక నిధులు పొందేలా ఆర్థిక సంఘంపై ఒత్తిడి తెచ్చేలా తెలంగాణ రాష్ట్ర సర్కార్ నివేదికలు రూపొందిస్తోంది. 2020నుంచి 2025 వరకు వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేందుకు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నించేలా కసరత్తు చేస్తోంది. 2014నుంచి 2017వరకు దక్షిణాది రాష్ట్రాలనుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్లిన ప్రతీ రూపాయిలో తిరిగి కేంద్రం కేవలం 52 పైసలే విదుల్చుతోందని తెలంగాణ ప్రభుత్వం ఎత్తిచూపనుంది. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం కేంద్రానికి వచ్చే రూపాయికి బదులుగా రూ. 3.25లను ఇవ్వడంపై మండిపడనుంది. 14వ ఆర్థిక సంఘం సూచించినట్లుగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా 32నుండి 42 శాతం పెంచినట్లుగా చెప్పుకున్నప్పటికీ ఇతర పన్నుల్లో వాటా భారీగా తగ్గి ఓవరాల్ కేంద్ర సాయం తగ్గుతూ వస్తోంది.

గ్రాంట్‌లు, కేంద్ర పథకాలకు సాయం నానాటికీ తగ్గుతోంది. మొత్తంగా 4 శాతం తగ్గి 48శాతానికే పరిమితం కావడాన్ని తెలంగాణ తీవ్రంగా నిరసిస్తోంది. ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని కమిషన్ ఈనెల 18నుండి మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్న తరుణంలో ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ కమిషన్ కు రాష్ట్రంనుంచి తమ ప్రాధాన్యాలు, అవసరాలు తెలుపుతూ నివేదికలను తెలంగాణ సర్కార్ అందించనుంది. గడచిన 14వ ఆర్థిక సంఘం ఐదేళ్లలో లక్ష కోట్లు తెలంగాణకు ఇవ్వాలని సిఫార్సు చేసింది. పన్నుల ద్వారా రూ. 96,217కోట్లు స్థానిక గ్రాంట్‌లు రూ. 9449 కోట్లుగా అంచనా వేసింది. అయితే తాజాగా వచ్చే ఐదేళ్లకు నిధులనిచ్చేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్న 15వ ఆర్థిక సంఘానికి ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్న నివేదికల తయారీలో తెలంగాణ ప్రభుత్వం తన అనుకూ లతలు, ప్రతికూలతలను మదింపు చేస్తోంది.

14వ ఆర్థిక సంఘం నిర్లక్ష్యంతో తెలంగాణకు అన్యాయం చేసిందని, తాజా 15వ ఆర్థిక సంఘానికి అటువంటి అవకాశం ఇవ్వకుండా గ్రామీణ ప్రాంతాలు, సమగ్ర రాష్ట్ర వివరాలు, పరిస్థితులు, ప్రజల జీవన ప్రమాణాలు వంటి వాటి ఆధారంగా నిధుల కేటాయింపు జరిగేలా నివేదికలను రూపొందిస్తోంది. అయితే 15వ ఆర్థిక సంఘం విధివిధానాలు రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యానికి ముప్పుగా పరిణమించాయనే ఆందోళన నెలకొంది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలు తామిచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా టర్మ్స్ అండ్ రిఫరెన్స్‌లో కొన్ని అంశాలు ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం ఎత్తిచూపనుంది. గ్రాంట్లలో కోతకు కారణమవు తోందని ఆరోపిస్తోంది. రాష్ట్రాలను సంప్రదించకుండా కేటాయింపులు మారుస్తున్నారనే అంశాన్ని తప్పుపట్ట నుంది. మధ్యాహ్న భోజన పథకంలో 75:25 శాతంగా ఉన్న వాటాను 60:40శాతంగా మార్చడంపై తెలంగాణ ప్రభుత్వం గుర్రుగా ఉంది. మరోవైపు రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో కేంద్ర పథకాల అమలుతో ముడిపెట్టడం పలు రాష్ట్రాలకు ఇబ్బందిగా మారింది. నాన్ బీజేపీ పాలిత రాష్ట్రాలు దీంతో భారీగా నష్టపోవాల్సి వస్తున్నది. ఇదేవిధంగా జనాకర్షక పథకాలు (పాపులిస్టిక్ స్కీమ్స్) పెంచితే కోత పెడతామని ఉన్న నిబంధనను ఎత్తివేయాలని కోరనుంది. అదేవిధంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు, విభజన హామీలకు నిధులను కోరుతూ ప్రతిపాదనలు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

కలప స్మగ్లింగ్‌పై మరింత కఠినం

- అత్యంత తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్న సీఎం కేసీఆర్
- అటవీ దొంగలపై పీడీ యాక్ట్ కేసులు
- సహకరించని ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- తక్షణమే 200 మంది అధికారుల బదిలీ.. అనేక మందికి ఛార్జ్ మెమోలు
- అటవీ వ్యవస్థ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అటవీ దొంగల అంతుచూడాలన్న పట్టుదలతో చర్యలు ప్రారంభించిన సీఎం కేసీఆర్ ఆ దిశగా మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కలప స్మగ్లింగ్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా అటవీ అధికారులే కారణమన్న వాస్తవం బయటకు పొక్కడంతో వారిపైనా చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల బహిర్గత మైన కొన్ని సంఘటనల్లో అధికారుల పాత్ర ఉందని తేలడంతో ఇప్పటి వరకు 11 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. అదే క్రమంలో 160 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. తాజాగా అటవీ శాఖలో ఉన్నతాధికారుల కు సైతం స్థానచలనం కల్పించాలని నిర్ణయించారు. తక్షణమే 200 మంది అధికారులను బదిలీ చేయాల్సిందిగా ఆ శాఖ ముఖ్య కార్యదర్శికి సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. కలప స్మగ్లింగ్‌పైనే ఆధారపడి జీవిస్తున్న పరిసర గ్రామాల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, వారే స్వచ్ఛందంగా అడవుల సంరక్షణకు నడుం బిగించేలా సంసిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్దేశించారు. అడవుల జిల్లాల్లో నిబద్ధత కలిగిన, కఠినంగా వ్యవహరించే అధికారు లను నియమించాలని స్పష్టంచేశారు. ఇప్పటి వరకు కలప అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించిన ఆరు జిల్లాల్లో తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. అడవుల సంరక్షణ విషయంలో, అటవీ భూముల్లో చెట్ల పెంపకంపై చిత్తశుద్ధి చూపించే అధికారులను నియమిస్తున్నారు. జంగిల్ బచావో - జంగిల్ బడావో నినాదంతో అటవీ సంరక్షణ, పునరుద్ధరణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ శాఖకు సంబంధించి అధికారులు జిల్లాల్లో పర్యటించాలని, అడవులపై పర్యవేక్షణ పెంచాల ని సీఎం స్పష్టంచేశారు. స్మగ్లింగ్‌కు సహకరిస్తున్న వారిని ఎప్పటి కప్పుడు గుర్తిస్తూ కఠిన చర్యలు తీసుకోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరిం చిన వారికి మెమోలు ఇవ్వడం, అవసరమైతే విధుల నుంచి తప్పించడం లాంటి చర్యలుంటాయని అటవీశాఖ స్పష్టంచేసింది.

బదిలీల ఫైలుపై సీఎం సంతకం

కలప అక్రమ రవాణా జరుగుతున్న జిల్లాల్లో తక్షణ బదిలీలకు సంబంధించి అటవీశాఖ పంపిన ప్రతిపాదన ఫైలుపై మంగళవారం సీఎం కేసీఆర్ సంతకం చేశారు. చీఫ్ కన్జర్వేటర్ మొదలుకొని బీట్ ఆఫీసర్ వరకు 200 మంది ఈ జాబితాలో ఉన్నారు. జిల్లా అటవీ అధికారులుగా పనిచేస్తున్నవారు, చీఫ్ కన్జర్వేటర్, కన్జర్వేటర్, డీఎఫ్‌వో స్థాయి కలిగిన 21 మందికి వారి వారి పదవుల నుంచి తప్పించారు. ఈ బదిలీల్లో ఉన్న కొంతమంది పేర్లను అటవీ శాఖ ప్రకటించింది. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్‌కే సిన్హాకు అచ్చంపేట అటవీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ హోదాలో పనిచేస్తున్న శార్వానంద్, వినోద్ కుమార్‌లకు మెదక్, కవ్వాల్ పర్యవేక్షణ బాధ్యతలు ఇచ్చారు.

కొన్ని డివిజన్లకు కొత్త డీఎఫ్‌వోలు

మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, పాల్వంచ, మంచిర్యాల, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, నిజామాబాద్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్‌నగర్, ఇచ్చోడ అటవీ డివిజన్లకు కొత్త డీఎఫ్‌వోలను నియమించారు. మరో 19 మంది రేంజ్ అధికారులకు స్థానచలనం కల్పించారు. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, అజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, కరీంనగర్, కొత్తగూడెం, కెరమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లి అటవీ రేంజ్ ప్రాంతాలకు కొత్త రేంజ్ అధికారులను నియమించారు. అలాగే ఫారెస్టర్లు, బీట్ ఆఫీసర్లు కలిపి మరో 160 మందిని ఒకేసారి బదిలీ చేశారు.



కొందరిపై సస్పెన్షన్ వేటు

కలప అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అటవీ అధికారులను గుర్తించి కొందరిని సస్పెండ్ చేశారు. ఇప్పటి వరకు 11 మందిపై సస్పెన్స్ వేటు పడినట్లు అటవీశాఖ మంగళవారం ప్రకటించింది. అలాగే అడవులను రక్షించే విషయంలో చిత్తశుద్ధి లోపించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, స్మగ్లర్లకు సహకరించడం లాంటి కారణాలతో మరికొంత మందికి మెమోలు అందజేసింది. సస్పెండైన వారిలో ఫారెస్టు డెవలప్‌మెంట్ అధికారి స్థాయి నుంచి గార్డుల వరకు అందరూ ఉన్నారు. మెమోలు అందుకున్న వారు సకాలంలో స్పందించి వివరణ ఇవ్వకున్నా, ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకున్నా సస్పెన్షన్ వేటు తప్పదని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

దేశం ముందు సమగ్ర ఆర్థిక నమూనా

నెలాఖరులో హస్తినకు కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈనెలాఖరులో సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్ళే అవకాశముందని, దేశంలో సమూల మార్పు జరగాలంటే ఫెడరల్ వ్యవస్థ రావాలని కోరుకుంటున్న సీఎం పలువురు నిపుణులు, మేధావులతో మరోసారి భేటీ అవుతారని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన పూర్తిచేసి జాతీయ రాజకీయాలపై సీరియస్‌గా దృష్టి సారించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. సీఎం ఆదేశాల మేరకు ఢిల్లీలో టీఆర్ఎస్ భవన్ నిర్మాణానికి ఎంపీలు పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. స్థల కేటాయింపు పూర్తయితే ఈ నెలాఖరులో లేదా మార్చిలో భూమిపూజ చేసే అవకాశముంది. 1200చదరపుగజాల స్థలంలో ఢిల్లీలో భవనం నిర్మించనుండగా, ఇందుకు సంబంధించిన భవన నిర్మాణ మ్యాపులను సైతం సీఎం పరిశీలించినట్లు చెబుతున్నారు.

తెలంగాణ జీవధారకు భారీ నిధులు

(మొదటిపేజీ తరువాయి)

కొరతలేదని, అనేక సంస్థలు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఫలితంగా పనులు అనుకున్నదానికంటే వేగంగా జరుగుతున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇక కాళేశ్వరం నిధులకు సంబంధించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 18నుండి రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర ఆర్థికసంఘం ప్రాజెక్టు పనులను పరిశీలించనుంది. మానవనిర్మిత అద్భుతంగా ఈ సాగునీటి ప్రాజెక్టు చరిత్రలో నిలిచిపోతుందన్న చర్చ సాగుతోంది.

వానాకాలంలో నీళ్ళు

ప్రాజెక్టును పూర్తిచేసి వానాకాలానికల్లా నీళ్ళిచ్చేందుకు ఇంజనీర్లు పనులు పరుగులు పెట్టిస్తున్నారు. జనవరి 1, 2 తేదీల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్వయంగా ప్రాజెక్టును పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కన్నేపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నీటిని తరలించే గ్రావిటి కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేయాలని సీఎం అప్పటికప్పుడు ఆదేశించి, నిధులు విడుదల చేయాలని సీఎస్‌కు సూచించారు. ఆ ఆదేశాలతో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపడం, అందుకు అనుమతులు జారీచేయడం చకచకా జరిగిపోయాయి. కాళేశ్వరంతో కొత్తగా 18 లక్షల ఎకరాలకు నీళ్ళివ్వడంతో పాటు అంతే మొత్తంలో పాత ఆయకట్టును స్థిరీకరించనున్నారు.

మేడిగడ్డ అయినా.. కాకున్నా..

మేడిగడ్డ బ్యారేజీ మట్టిపని పూర్తయింది. 54.44 లక్షల క్యూబిక్ మీటర్లకుగానూ మొత్తం పనిపూర్తిచేశారు. 17.89 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనిలో మరో 4 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేయాల్సి ఉంది. సైడ్‌బండ్స్, రివిట్‌మెంట్ పనుల్లోనూ వేగం పెంచారు. ప్రాజెక్టు ఎడమవైపు బండ్ రివిట్‌మెంట్ పనుల్లో నిత్యం 250 మంది పని చేస్తుండగా, కుడివైపున 120 మంది కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఏప్రిల్ 15 నాటికి మేడిగడ్డ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అన్నారం బ్యారేజీ ఎర్త్ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. 4వేల క్యూబిక్ మీటర్ల బండ్ పనులు మాత్రంపే మిగిలి ఉన్నాయి. మరో వారం రోజుల్లో ఈ పనులను పూర్తిచేయాలని ఇంజనీర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. వంతెనపై మొత్తం 66 స్లాబ్‌లు వేశారు. 66 గేట్లు బిగించి, అన్నింటిని లిఫ్ట్ చేయడానికి సిద్ధంచేశారు. 11.95 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేయాల్సి ఉండగా, ఇప్పటికే 11.88 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది.

వచ్చే నెలకల్లా సుందిళ్ళ ఎర్త్‌వర్క్ పనులు, సుందిళ్ళ బ్యారేజీ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఎర్త్ వర్క్‌లో సైడ్‌బండ్స్ పనులు లక్ష క్యూబిక్ మీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పను లను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు 3 షిఫ్టుల్లో పనులు చేయిస్తున్నారు. వచ్చేనెలకల్లా ఈ పనులు పూర్తిచేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ బ్యారేజీకి మొత్తం 74 గేట్లను బిగించగా, అన్నింటి లిఫ్ట్‌చేసి వరదలు వచ్చినపుడు నీళ్ళు వదలడానికి సిద్ధంగా ఉంచారు. వంతెన పై 74 స్లాబ్‌లకుగానూ 61 స్లాబ్‌లు వేశారు. సుందిళ్ళ పంపుహౌస్ (గోలివాడ) పనులు ఏప్రిల్ చివరికల్లా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీ మొత్తం పూర్తయి అందుబాటులోకి వచ్చినా.. రాకున్నా ప్రత్యామ్నాయాలు కూడా సిద్ధం చేసి ఎట్టిపరిస్థితుల్లోనూ నీళ్ళివ్వాల్సిందేనని సీఎం ఆదేశించగా, అందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోంది.

వేగంగా కన్నేపల్లి లైనింగ్

కన్నేపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు 13.4 కిలోమీటర్ల గ్రావిటి ఎర్త్ పనులు చివరికొచ్చాయి. కాలువ సిమెంట్ లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. సీఎం తన పర్యటన సందర్భంగా ఈ కాలువ వెంట ప్రయాణించి పలు సూచనలు చేశారు. 2.45 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సి ఉండగా, లక్షక్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. సీఎం పర్యటనకు ముందురోజు 900 మంది కార్మికులతో పనులు చేయించగా, ఇప్పుడు కార్మికుల సంఖ్యను 2,500కు పెంచారు. నిత్యం 4,500క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా మరో ప్యాచింగ్ ప్యాడ్ తెప్పించి పనుల్లో వేగం పెంచారు. కార్మికుల సంఖ్యను మరో 500 పెంచి రోజుకు 6వేల క్యూబిక్ మీటర్ల పని చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాలువపై 30 స్ట్రక్చర్లకుగానూ 22 నిర్మాణాలు పూర్తిచేశారు. కన్నేపల్లి పంపుహౌస్‌లో సివిల్ పనులు మార్చికల్లా పూర్తిచేసేందుకు పనులు జరుగుతున్నాయి. 11 మోటార్లు, పంపులకుగానూ 6 మోటార్లు బిగించారు. ఈనెల చివరకు మూడు, ఏప్రిల్ 15లోపు మరో రెండు పంపులను బిగించి వెట్ రన్ చేపట్టనున్నారు. సిఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసభర్వాల్‌ను ప్రతిరోజూ పనుల పురోగతి వివరాలు తనకు అందించాలని ఆదేశించగా, నీటిపారుదలరంగ నిపుణులతోనూ చర్చిస్తున్నారు. గత మూడేళ్ళలో రికార్డు సమయంలో అనుమతులు తెచ్చుకుని, పట్టాలెక్కిన ప్రాజెక్టు వాయువేగంతో పూర్తవుతోంది. సీఎం దూరదృష్టికి, చిత్తశుద్ధికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని జాతీయ నిపుణులు అనేకమార్లు అభినందనల జల్లు కురిపించారు.



అన్ని శాఖలు నివేదికలివ్వాలి

- 15వ ఆర్థిక సంఘానికి సమగ్ర రిపోర్టులు
- ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పర్యటనకు రానున్న 15వ ఆర్థిక సంఘాని కి సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాఖల వారీగా ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ఆర్థిక సంఘానికి నివేదికలను సమర్పించేందుకు అన్ని శాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌కె సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం ఈనెల 18నుంచి 20వరకు రాష్ట్రంలో పర్యటి స్తుందన్నారు. తమ పర్యటనలో 18న గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, వ్యాపార, వాణిజ్య రంగాలతో సమావేశం కానున్నారు. 19న సీఎం కేసీఆర్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఉంటుందని చెప్పారు. 20న ఆర్థిక నిపుణులతో సమావేశం తర్వాత క్షేత్రస్థాయి పర్యటనకు వెళతారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, టీఎస్ ఐపాస్, కేసీఆర్ కిట్, కేజీ టూ పీజీ తదితర ప్రాధాన్యత అంశాలపై నివేదికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ మార్గ దర్శకాలను వివరించడంతోపాటు ప్రత్యేక అవసరాలను నివేదికలో పొందుపర్చా లన్నారు.

కోడ్ కూయకముందే..!

రైతులకు ఇచ్చేయండి..

- మార్చి మొదటివారంలోగా నగదు బదిలీ
- రాష్ట్రాలకు కేంద్ర వ్యవసాయశాఖ లేఖలు

న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన రైతులకు నేరుగా నగదు బదిలీ పథకాన్ని లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లోకి రాకముందే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. నగదు బదిలీని అమలు చేయడానికి కసరత్తు వేగం వంతం చేసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతోనే దేశంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుంది. అలాంటప్పుడు రైతులకు నగదు బదిలీ పథకం అమలు చేయడం సాధ్యం కాదని మోడీ ప్రభుత్వం ఆలోచిస్తోంది. మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు ఏడాదికి ఆరు వేల రూపాయల సాయాన్ని 3 విడతలుగా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేసే పథకాన్ని ప్రకటించింది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు భూరికార్డుల ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖలోని సీనియర్ అధికారి ఒకరు లబ్ధిదారుల జాబితా కోసం రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు సమాచారం. లబ్ధిదారుల జాబితా తయారు చేయడంలో ఆలస్యమైతే.. ఈ పథకం ద్వారా తొలి విడత 2 వేల సాయాన్ని చాలా మంది రైతులకు అందకుండా పోయే ప్రమాదముంది. తొలివిడత సాయం అందుకోని రైతులను రెండో విడతలో చేర్చడం కష్టమని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. రెండో విడత మే నెలలో ఉండే అవకాశముందని, అప్పుడు ఎన్నికలు పతాక స్థాయికి చేరుకుంటాయని అంటున్నారు. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో వస్తుండడంతో నగదు లబ్ధి కలిగించే పథకాల అమలు సాధ్యం కాదని తెలుస్తోంది.

భూ రికార్డులు సవ్యంగా ఉన్నాయా?

కొన్ని రాష్ట్రాల్లో భూ రికార్డులను సరిగ్గా నిర్వహిస్తున్నారని, మరికొన్ని రాష్ట్రాలు ఈ విషయంలో తప్పుల తడకలు చేస్తున్నాయని వ్యవసాయ అధికారి ఒకరు తెలిపారు. రైతుల గురించి సరైన జాబితాలు రాష్ట్రాల వద్ద సరిగా లేవని తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కిసాన్ సమ్మాన్ పథకానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, ఒడిశా కాలియా పథకాలే ప్రేరణ అని భావిస్తున్నారు. అయితే ఒడిశా కాలియా పథకంలో కౌలు రైతులు, చేపల పెంపకం, పశుపోషణలో నిమగ్నమైన రైతులను ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం పరిధిలోకి తీసుకొని రాలేదు.

ఒడిశా పథకంతోనే మేలు!

ఒడిశా రైతుకు ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా లాభం కలిగితే మంచిదేనని బిజు జనతాదళ్ రైతు విభాగం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ప్రసన్న ఆచార్య చెప్పారు. అయితే కౌలు రైతులు, ఇతర వ్యవసాయ కార్యకలాపాల్లో జీవనోపాధి పొందుతున్న వారు ఈ పథకం పరిధిలోకి రావడం లేదని, కానీ కాలియా పథకం అందరికీ న్యాయం చేస్తోందన్నారు. 92 శాతం రైతాంగానికి ఏడాదికి పది వేల సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అయితే కౌలు రైతులకు మేలు చేయకూడదని కేంద్ర ప్రభుత్వం భావించడం లేదని, కానీ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకంలో వారిని చేర్చకపోవడానికి ప్రధాన కారణం.. వారికి సంబంధించిన గణాంకాలు కేంద్ర ప్రభుత్వం వద్ద లేకపోవడమేనని వ్యవసాయ మంత్రిత్వశాఖలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



ప్రియురాలి అడ్రస్ చెప్పండి

బాలి: రష్యాకు చెందిన 23 ఏళ్ల అర్సెనీ ఫ్రొలోవ్ తన స్నేహితులతో కలిసి బాలి పర్యటనకు వెళ్లాడు.అలింగ్-అలింగ్ జలపాతాన్ని సందర్శిస్తున్న సమయంలో ఓ యువతిని చూశాడు. మనసు పారేసుకున్నాడు. కానీ , ఫోన్ నంబర్ తెలుసుకోలేకపోయాడు. యువతి జాడ కోసం ఫేస్‌బుక్‌ను ఆశ్రయించాడు. కారణం ఏంటో తెలియదు.. ఆమె బాగానచ్చింది. ఆమే నాజీవితం అనుకుంటున్నాను.ఆస్ట్రేలియాకు చెందిన వ్యక్తి. హాలీడే ట్రిప్ కోసం ఇక్కడకు వచ్చిందని తెలుసు. కానీ పేరు వివరాలు తెలియవు. జలపాతం వద్ద నిన్న ఆమెను చూసిన స్నేహితులు ఎవరైనా ఉంటే దయచేసి సమాచారం అందించండి. ఇప్పటికే ఆమెకు పెళ్లైతే ఆ విషయాన్ని నాకు చెప్పండి. నా సమయాన్ని ఆమె కోసం వృధా చేసుకోను అని వినమ్రంగా పోస్టు చేశాడు.

నక్షత్ర చేపకు కష్టకాలం

సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడంలో కీలక పాత్రపోషిస్తున్న స్టార్‌ఫిష్‌లు ఇటీవల పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయని పరిశోధకులు గుర్తించారు. దశాబ్ద కాలంగాదాదాపు 20 జాతుల స్టార్‌ఫిష్‌లు అంతరించాయి. 2013లో అంటువ్యాధుల కారణంగా మృత్యువాత పడుతున్నాయని గుర్తించారు. అయితే ఒక స్టార్‌ఫిష్ నుంచి మరో స్టార్‌ఫిష్‌కు వ్యాధి ఎలా సోకుతుందనే విషయం అంతు చిక్కడం లేదని కొర్నెల్ యూనివర్సిటీ బయాలజి స్ట్రేవ్ హార్వేల్ చెప్పారు. సన్‌ఫ్లవర్ స్టార్‌ఫిష్ కనుమరుగవ్వడంపై తాము అధ్యయనం చేశామన్నారు. స్టార్‌ఫిష్‌ల సంఖ్య 80 నుంచి 100 వరరూ తగ్గిపోయినట్లు అధ్యయనంలో తేలిందన్నారు. స్టార్‌ఫిష్‌లకు సోకిన వ్యాధి, సముద్ర జలాలు వేడెక్కడం ఈ రెండు అంశాలను జతచేసి అధ్యయనం చేశామని ఆమె వివరించారు.



పాత నీరు పోవాలి కొత్త నీరు రావాలి

- సమూల ప్రక్షాళనే శరణ్యం
- లోక్‌సభ టికెట్లు కొత్త వారికివ్వాలి
- వర్కింగ్ ప్రెసిడెంట్లు నలుగురు అక్కర్లేదు
- రాహుల్ గాంధీకి టీపీసీసీ నేతల సూచనలు
- అభ్యర్థులను ముందే ప్రకటిస్తాం
- పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కండి: రాహుల్



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తే తప్ప అధికార తెరాసాను ధీటుగా ఎదుర్కోలేమని తక్షణమే పార్టీలో మార్పులు, చేర్పులు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కోరారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నా వారిని నడిపించే నాయకత్వం రాష్ట్రంలో లేదని, ఇందువల్లే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనామని మంగళవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీతో జరిగిన సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మించి పోయింది లేదని పార్టీ నాయకత్వంలో కొత్త నీరు తీసుకురా వాలని, త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో నూ యువ రక్తాన్ని నింపి వారిని అభ్యర్థులుగా ఎంపిక చేయాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలుస్తోంది. జాతీ య పార్టీలా వ్యవహారించకుండా రాష్ట్రంలో ప్రాంతీ య పార్టీ మాదిరిగానే వ్యవహారించి ప్రజల్లోకి వెళ్లితే ఊహించని ఫలితాలు వస్తాయని మం థని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వివరించినట్లుగా తెలుస్తోం ది. టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిండెట్స్ పదవుల్లో నలుగురిని నియమించడం వల్ల పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కు వగా జరుగుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. తాను పార్టీలో సీనియర్ నాయకుడినే కాకుండా ఎమ్మెల్యే అయినప్పటికి ప్రధాన కార్యదర్శి పదవి వరకు కూడా ఎదగలేకపోయినట్లు వాపోయినట్లు సమాచారం.

పార్టీ నాయకత్వంలో మార్పులు జరిగితేనే భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఐక్యంగా పని చేస్తామని చెప్పా రు. దీంతో రాహుల్‌గాంధీ స్పందిస్తూ వీటన్నింటిపై త్వ రలో ఒకనిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు కాంగ్రె స్ వర్గాలు చెబుతున్నాయి. ప్రజా కూటమిలో భాగంగా టీడీపీతో పొత్తు వల్ల నష్టమే జరిగిందని ఎమ్మెల్సీ పొంగులేటి వివరించారు. ఖమ్మం లోక్‌సభ నుంచి పో టి చేయాలని రాహుల్‌ను కోరగా.. ఆయన నవ్వి ఊరు కున్నట్లుగా తెలిసింది. తెలంగాణ జనసమితి, సీపీఐ పార్టీలతో పొత్తుల వల్ల పెద్దగా ఒరిగిందేమి లేదని మరో ఇద్దరు ఎమ్మెల్యేలు రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ పార్టీలతో పొత్తుల వల్ల సమయం వృధానే తప్ప లాభం జరగలేదని రాహుల్‌కు చెప్పినట్లుగా సమాచారం.

అభ్యర్థులను ముందే ప్రకటిస్తాం

'లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను ముందే ప్రకటిస్తాం. పార్టీ అభ్యర్థుల విజయం కోసం మీరు సిద్ధం కండి. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోపాలను గుర్తు చేసుకుని.. పార్లమెంట్ ఎన్నికలకు వ్యూహాలతో ముందుకు వెళ్లాలి. పొత్తులు అనేవి జాతీయ, స్థానిక అంశాలను బట్టి నిర్ణయాలు ఉంటాయి' అంటూ ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ తెలంగాణ కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే వ్యూహాంపై మంగళవారం ఢిల్లీలోని వార్ రూంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో రాహుల్‌గాంధీ సమావేశం అయ్యారు. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు వివరించారు.

అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించడం ఒక కారణమైతే.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఆకర్షణీయమైన సంక్షేమ పథకాలు కూడా కాంగ్రెస్‌కు నష్టం చేశాయని వివరించారు. వీటితో పాటు ఈవీఎంల ట్యాంపరింగ్ తో కూడా కాంగ్రెస్ పార్టీ భారీ నష్టాన్ని చవి చూసిందని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఎన్నికల సమయంలో సభలు ఎక్కువగానే నిర్వహించి నప్పటికి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి తీసుకుపోవడం లో విఫలమయ్యామనే విషయాన్ని పలువురు ఎమ్మెల్యేలు రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకుపోయారు. పెన్షన్లు, రైతు బంధు పథకం కూడా కాంగ్రెస్‌కు నష్టం చేసిందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కచ్చితంగా విజయం సాధించే నియోజక వర్గాల్లో ఒక్కో ఓటుకు రూ. 5 నుంచి 7 వేల వరకు అధికార టీఆర్ఎస్ డబ్బు పంపిణి చేసిందని ఆయన వివరించినట్లుగా తెలిసింది.

బడ్జెట్ రూ. 2లక్షల కోట్లు?

- తుది దశకు కసరత్తు...
- ఓటాన్‌కు గ్రీన్ సిగ్నల్
- ఆర్థిక లోటు లేకుండా జాగ్రత్తలు
- ఆర్థిక పరిస్థితిలో మరింత మెరుగుదల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కూర్పు ఊపందుకుంది. ఈ నెల రెండో వారంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ పద్దులు శాఖల వారీ గా సిద్దంగా ఉండగా, దేశంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ఆదాయాలను, కేంద్ర సాయాలను ప్రభుత్వం సమీక్షించుకుం టున్నది. కీలకమైన రాబడులైన జీఎస్టీతోపాటు పెట్రోల్, మద్యం ఉత్పత్తులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా, ఇసుక, ఇతర రాబడులనూ క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో సవరించిన అంచనాల చేరికకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రూ.1,74,453 కోట్ల బడ్జెట్‌లో జనవరి చివరినాటికి రూ. లక్ష న్నర కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించింది. ఇక వ్యయాల విషయానికి వస్తే రూ. లక్ష కోట్ల మేర ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇక మిగిలిన రెండు మాసాల ఆదాయాలను అదే అంచనాలతో లెక్కలోకి తీసుకుంటే మొత్తం రాబడి రూ.1.60 లక్షల కోట్లకు చేరే అవకాశాలు న్నాయి. ఇప్పటివరకున్న లోటును అధిగమించేలా ఆర్థిక శాఖ నిల్వలు పెంచుకుంటోంది. రాష్ట్రంలో సొంత వనరుల రాబడిలో 29 శాతం వృద్ధిరేటు నేపథ్యంలో ఖజానాకు ఆదాయం పుంజుకున్నది. కేంద్రం నుంచి రావాల్సిన పరిహారం జాప్యం కావడంతో మొత్తం ఆదాయంపై ప్రభావం పడి అంచనాలు తప్పుతున్నాయి. మరో వైపు ద్రవ్యలోటును అధిగమించేందుకు ఉన్న ఏకైక మార్గమైన రుణాల సేకరణ భారీగా చేసున్న ప్రభుత్వం వడ్డీల చెల్లింపులకు భారీ మొత్తం వెచ్చిస్తోంది.

తగ్గిన కేంద్ర సాయం


2016-17 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం సీఎస్ఎస్ పథకాలతోపాటు, అప్పుల పరిమితి (ఎఫ్‌బీఆర్‌బిఎం) చట్టాన్ని మరింతగా పెంచింది. దీంతో మిగులు బడ్జెట్‌లో మొదటినుంచే ప్రారంభ నిల్వ భారీగా ఉండటంతో మిగులు నిధులను ప్రతిఫలించింది. రెవెన్యూ మిగులుతోపాటు 14వ ఆర్థిక సంఘం సూచించిన మూడు నిబంధనలను తెలంగాణ రాష్ట్రం అమలు చేసింది. ఫలితంగా అదనపు అప్పులకు ఆస్కారం ఏర్పడింది. 2018-19లోనూ అదే ఒరవడి కొనసాగింది. వచ్చే ఆర్థిక యేడాది 2019-20లోనూ మిగులు రాష్ట్రంగానే నిల్వనుంది. ఈ ఏడాది కూడా మిగులుతో మరింత పటిష్టమైన ఆర్థిక స్థితిని తెలంగాణ రాష్ట్రం సొంతం చేసుకునే అవకాశమైతే ప్రస్తుతం కనిపిస్తోంది.

పెరుగుదలలో రాబడులు

ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న వివిధ వ్యూహాలతో ఖజానాకు భారీ ఆదాయాలు సమృద్ధిగా చేరుతున్నాయి. మొత్తంగా సొంత వనరుల రాబడి 29 శాతానికి పైగా వృద్ధి రేటు నమోదు చేసుకుంది. పన్నుల ఆదాయాల్లో కూడా 16శాతానికి పైగా వృద్ధి నమోదు చేసుకుంటోంది. పథకాలకు వెచ్చించే ఖర్చును గతంలో ప్రణాళిక వ్యయం కింద చూపుతుండగా, తాజాగా వాటిని వివిధ పద్దుల కింద పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో నడుస్తున్న పథకాలు, విదేశీ నిధుల కింద అమలవుతున్న పథకాలు, నాబార్డు, అప్పులు ఉప శీర్షికతో పేర్కొంటారు.

ఇరు రాష్ట్రాలకు ఎన్టీపీసీ నోటీసులు

9లోపు బకాయిలు చెల్లించకుంటే పవర్ కట్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: విద్యుత్ బకాయిలు చెల్లించకుంటే సరఫరా నిలిపివేస్తామని ఎన్టీపీసీ ఆయా రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు నోటీసుల జారీ చేసింది. ఈనెల 9లోపు బకాయిలు చెల్లించాలని లేదంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించింది. ఎన్టీపీసీకి ఆయా రాష్ట్రాలనుంచి రూ.7859 కోట్ల మేరకు బకాయి లు రావాల్సివుంది. అందులో తెలంగాణ రాష్ట్రం కూడా రూ.1300కోట్ల మేరకు బ కాయి ఉంది.అయితే తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండి ప్రభాకార్ రావు ఎన్టీపీసీ నోటిసుపై వెంటనే బదులిచ్చారు. తాము బకాయిలు చెల్లించేందుకు కొంత సమ యం కావాలని కోరారు. తొందరపడి నోటీసులు ఇవ్వవద్దన్నారు.దీంతో ఎన్టీపీసి తెలంగాణ విద్యుత్ సంస్థకు ఇచ్చిన నోటీసులను విత్‌డ్రా చేసుకుంది. ఇక మిగిలిన రాష్ట్రాల్లో అత్యధిక భాగం బకాయిలు మూడు రాష్ట్రాలనుంచే రావాల్సి వుందని ఎన్టీపీసి కంపెనీ ఎగ్జి క్యుటివ్ తెలిపారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ తర్వాత స్థానం లో ఉంది. కేంద్ర విద్యుత్ శాఖ పోర్టల్‌లో పేర్కొన్న మేరకు ఎన్టీపీసీకే కాకుండా ఇతర విద్యుత్ సరఫ రా కంపెనీలకు కూడా ఉత్తరప్రదేశ్ రూ.6127కోట్లు, రాజస్థాన్ రూ.2404కోట్లు, పంజాబ్ రూ.1041కోట్లు బకాయిలు చెల్లించాల్సివుంది.

ఏపీలో ఆర్టీసీ చర్చలు సఫలం

- నేటి సమ్మె విరమణ
- 25 % ఫిట్‌మెంట్‌కు ఓకే



అమరావతి, ఆంధ్రప్రభ : చర్చలు సఫలం కావడంతో బుధవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీలో తలపెట్టిన సమ్మెను ఐకాస విరమించింది. వేతన సవరణ, ఇతర 18 డిమాండ్ల సాధనకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గతంలోనే యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చి, ఈనెల 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రక టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లో యాజమాన్యంతో మంగళవారం జరిగిన చర్చల్లో పురోగతి కనిపించడం తో సమ్మెను విరమించుకున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు. ఆర్టీసీ ఐకాస నేతలతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. కార్మికులకు తాత్కాలికంగా 25 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. భవిష్యత్‌లో ఎన్జీవోలతో సమానంగా ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు మంత్రి హామి ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఐకాస నేతలు తెలిపారు. దీని వల్ల ప్రభుత్వంపై రూ. 750 కోట్ల భారం పడుతుంది. ఇప్పటికే సంస్థ నష్టాల్లో ఉన్న సంగతి తెలిసిందే. యాజమాన్యం పొదుపు చర్యల వల్ల నష్టాలను తగ్గిస్తూ వస్తున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో నష్టాలను తగ్గించుకోలేపోతున్న సంగతి విధితమే. ఆర్టీసీలో 62 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేటును 80 శాతానికి చేర్చడంతో సంస్థ కొంత ఇబ్బందుల నుంచి బయటపడిందని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పాత బకాయిలను 2020 నాటికి చెల్లించాలని కార్మికులు కోరారని,దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. సంస్థ నష్టాల్లో ఉన్నా కూడా ప్రజలపై భారం మోపలేదన్నారు. ఈ చర్చల్లో సంస్థ వీసీ,ఎండీ సురేంద్రబాబు, ఇయు,కార్మిక పరిషత్ సహా 9 కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్

- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం
- 8800 భాషా పండితులు.. 2000 పీఈటీలకు లబ్ధి
- కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మంగళవారం సంతకం చేశారు. దీంతో రాష్ట్రంలోని భాషా పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్నాయి. సీఎం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ తెలుగు భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామిని నిలబెట్టుకున్నట్టు అయింది. పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో ఇకపై తెలంగాణలో గ్రేడ్-2 పండిట్ పోస్టులు ఉండవు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని 8800 భాషా పండితులకు 2000 మంది పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్నాయి. సీఎం తీసుకున్న నిర్ణయం పట్ల పీఆర్‌టీయు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి.

సీఎంకు కృతజ్ఞతలు చెప్పిన పీఆర్‌టీయు ఎమ్మెల్సీలు

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే జారీ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పీఆర్‌టీయు ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్, పాతూరి సుధాకర్‌రెడ్డి మంగళవారం ప్రగతి భవన్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యంతర ఉత్తర్వుల వచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి డిప్యూటీ ఈవో, ఎంఈవో, గెజిటెడ్ హెడ్మాష్టర్, డైట్ లెక్చరర్స్, జేఎల్, స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు ఇవ్వాలని కోరినట్టు ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సీఎం అంగీకరించారని అందుకు కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. సీఎం నిర్ణయంతో రాష్ట్రంలో ఉన్న 8800 భాషాపండితులు, 2000 పీఈటీల పోస్టులు అప్‌గ్రేడేషన్ కానున్నాయని తెలిపారు.

ఇకపై భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్లు లభించనున్నాయని తెలిపారు. రూ. 398 వేతనంపై పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇచ్చే ఫైల్‌ను కూడా ఆమోదించాలని ఎమ్మెల్సీలు కోరారని పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు తెలిపారు.

భాషాపండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు టీపీటీయు రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా పండితులకు సీఎం కేసీఆర్ సరైన న్యాయం చేశారని తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్వీ సత్యనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ పదోన్నతులపై కసరత్తు

- సర్వీస్ నిబంధనల రూపకల్పనకు చర్యలు ప్రారంభించిన పాఠశాల విద్యా శాఖ
- పదోన్నతుల వివరాలపై డీఈవోలకు లేఖలు
- సీఎం కేసీఆర్‌కు హెడ్మాష్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయుల పదోన్నతులపై పాఠశాల విద్య శాఖ కసరత్తు ప్రారంభించింది. ఏకీకృత సర్వీస్ నిబంధనలపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందోనని అధికారులు ఎదురు చూస్తున్నారు. అయితే సర్వీస్ నిబంధనలు రూపొందిస్తే వెంటనే పదోన్నతులు ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి జిల్లాల వారీగా పదోన్నతుల వివరాలను ఇవ్వాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారుల(డీఈవో)కు పాఠశాల విద్యా శాఖ లేఖలు రాయడానికి సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది. ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు రూపొందించ డానికి కనీసం 15 రోజుల సమయం పడుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. సర్వీస్ నిబంధనల రూపకల్పనలో భాగంగా ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను కూడా తీసుకునే అవకాశం ఉంటుందని సంఘాల నేతలు చెబుతున్నారు. సర్వీస్ రూల్స్ రూపొందించి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది.తరువాత నిబంధనల మేరకు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడానికి వీలవుతుంది. ప్రభుత్వం సర్వీస్ రూల్స్‌కు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని కోరితే అందుకు సంబంధించిన సిఫారసులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పాఠశాల విద్యా శాఖ సమర్పించనుంది. సిఫారసులను రూపొందించే క్రమంలోనే ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలను సేకరించే అవకాశం ఉంది. మార్చి 25లోపులోనే ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండు ఎన్నికల నోటిఫికేషన్లు జారీ అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉండే అవకాశం ఉంటుంది.

ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి, ప్రమోషన్లు ఇవ్వాలి

సుప్రీం స్టే దరిమిలా వెంటనే ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాష్టర్స్ అసోసియేషన్ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ లేఖ రాసింది. నూతన జిల్లాలు, జోనల్ విధానానికి అనుగుణంగా స్థానికతను నిర్ణయించాలని.. వారికి సొంత జిల్లాను ఎంపిక చేసుకోవడానికి ఆప్షన్ కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి రాజభాను చంద్రప్రకాష్ కోరారు. విద్యా శాఖలోని వివిధ పోస్టులను జిల్లా, జోనల్, మల్టీ జోనల్ స్థాయి పోస్టులుగా నిర్ణయించాలన్నారు.

పారిశ్రామిక, సామాజికవేత్త కె.వి. విష్ణురాజు జనసేనలోకి

- సొంత విద్యా సంస్థల్లో నిరుపేదలకు ఉచిత బోధన
- ఫౌండేషన్ ద్వారా పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
- పవన్ కల్యాణ్ ఆలోచనలతో భావ సారూప్యత
- జనసేన సలహా మండలి ఛైర్మన్‌గా నియామకం

భీమవరం, ప్రభన్యూస్: విష్ణు విద్యాసంస్థల అధినేత, ప్రముఖ పారిశ్రామిక, సామాజికవేత్త కలిదిండి వెంకట విష్ణురాజు మంగళవారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమగోదావరితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ విష్ణురాజుకు మంచి పేరుప్రఖ్యాతులున్నాయి. విద్యాసంస్థల ద్వారా పలువురు పేదలకు ఉచిత విద్యాబోధనతో పాటు ఉపకార వేతనాల పంపిణీ, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, గ్రామాల దత్తత, మంచినీటి ఉచితసరఫరా వంటి పథకాల్తో ఆయన సేవా తత్పరత కొనసాగుతోంది. నాలుగుమాసాల క్రితం పశ్చిమలో పర్యటించిన పవన్‌కళ్యాణ్ భీమవరంలోని విష్ణు విద్యాసంస్థల్లో విద్యార్థుల్తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అదే సందర్భంలో ఆయన కొద్దిసేపు విష్ణురాజుతో మాట్లాడారు. ఇరువురి ఆలోచనాధోరణుల మధ్య భావసారూప్యత పవన్‌కు స్పష్టమైంది. సమాజ అభివృద్ధి కోసం విష్ణురాజు పడుతున్న తపనను పవన్ గుర్తించారు. అటువంటి విద్యాధికులు, మేధావులు రాజకీయాలకు దూరంగా ఉండిపోవడం సరికాదంటూ ఆనాడే పవన్ విష్ణురాజుతో పేర్కొన్నారు. జనసేనలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. పవన్ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన విష్ణురాజు ఆ పార్టీలో చేరారు. పార్టీ అవసరాలకనుగుణంగా ఏ బాధ్యత నిర్వర్తించేందుకైనా తన సంసిద్ధత వ్యక్తం చేశారు. పవన్ ఆలోచనా విధానాలు తనను ఆకర్షించాయని ఈ సందర్భంగా విష్ణురాజు స్పష్టం చేశారు. పవన్ వంటి నాయకుడి వల్లే రాజకీయాల్లో మార్పులు సాధ్యమన్నారు. పారదర్శక పాలన పవన్ వల్లే సాధ్యపడుతుందన్నారు. ఆలోచనాపరులంతా జనసేనకు మద్దతియాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

విష్ణురాజు జనసేనలో చేరడం పశ్చిమ రాజకీయాల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఆయన నేరుగా ఓ పార్టీలో చేరతారని ఇంతవరకు ఎవరూ ఊహించలేదు. రాజకీయాలకు ఆయన దూరంగా ఉండేవారు. తన విద్య, వ్యాపార విషయాలు మినహా మిగిలిన అంశాల్లో తలదూర్చేవారుకాదు. భీమవరం పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఆయన తరచూ పర్యటనలు చేసేవారు. అక్కడ మౌలిక సదుపాయాల మెరుగుకు తన ఫౌండేషన్ ద్వారా సహాయాలందించేవారు. విష్ణురాజు చేరికతో ప్రధాన పార్టీలు తెలుగుదేశం, వైకాపాలు రెండూ ఉలిక్కిపడ్డాయి. జిల్లాలోని దాదాపు 15నియోజకవర్గాల్లోనూ విష్ణురాజు ప్రభావముంటుందని అంచనాలేస్తున్నారు. జిల్లాలో జనసేన మరింత పుంజుకోవాడనికి విష్ణురాజు చేరిక ఉపకరిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, అంజనీ ఫోర్ట్‌ల్యాండ్ వంటి 17సంస్థలకు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్ ఎమ్ఎస్ పూర్తి చేసిన ఆయన సిమెంట్, పాలిమర్స్, సిరామిక్ పరిశ్రమలకు సంబంధించి పలు పరిశోధనలు చేశారు. సొంతంగా అంజనీ ఫోర్ట్‌ల్యాండ్ సిమెంట్స్ సంస్థను నెలకొల్పారు. తాత పద్మభూషణ్ బివి రాజు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు.

సలహా మండలి ఛైర్మన్‌గా

జనసేన సలహా మండలి ఛైర్మన్‌గా విష్ణురాజును పవన్‌కళ్యాణ్ నియమించారు. ఇందులో ఏడుగురు సభ్యులుంటారని పవన్ చెప్పారు. విద్యావేత్తలు, మేధావులు, సామాజికవేత్తల్తో ఈ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందానికి విష్ణురాజు నాయకత్వం వహిస్తారని ప్రకటించారు.



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 6 ఫిబ్రవరి 2019

చట్టానిదే విజయం!


శారదా చిట్ ఫండ్ కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారుల ఎదుట హాజరై, సహకరించాలని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే సందర్భంలో ఆయనను అరెస్టు చేయవద్దంటూ సీబీఐని ఆదేశించింది. ఈ కారణంగా అటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, ఇటు కేంద్ర ప్రభుత్వమూ విజయం తమదేనంటూ ఎవరి మటుకు వారు ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి గోటితో పోయే దానికి గొడ్డలికి పని కల్పించినట్టు సీబీఐ అధికారులూ, రాజీవ్ కుమార్ వ్యవహరించడం వల్లనే ఇంత రాద్ధాంతం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఎవరికీ అనుకూలమూ కాదు, ప్రతికూలమూ కాదు. చట్టం తన పనితాను చేసుకుని పోయిన చందంగా ఉన్నాయి. రాజీవ్ కుమార్‌ని సీబీఐ అధికారులు అరెస్టు చేయకుండా ఆపగలిగామన్నది మమతా బెనర్జీ ఉద్దేశ్యం కావచ్చు. రాజీవ్ కుమార్ నివాసానికి ఆదివారం సీబీఐ అధికారులు వెళ్ళింది ఆయనను అరెస్టు చేయడానికి కాదు, ప్రశ్నించడానికి. 40 మంది సిబిఐ అధికారులూ, సిబ్బంది ఒకేసారి వెళ్ళడం వల్ల అరెస్టు చేసి తీసుకుని వెళ్ళడానికేమోనని పశ్చిమబెంగాల్ పోలీసులు అనుమానించి, సిబిఐ బృందాన్ని అడ్డుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ విధి నిర్వహణకు ఆటంకం కలిగించారంటూ బెంగాల్ పోలీసులపై కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సూటిగా స్పందించలేదు. కేసు దర్యాప్తునకు సహకరించమని మాత్రమే రాజీవ్ కుమార్‌ని ఆదేశించింది.

అభియోగాలకు గురైనవారు తమపై దర్యాప్తును ఆపించేందుకు కోర్టులను ఆశ్రయించడం సర్వసాధారణం. కోల్‌కతాలో సీబీఐ అధికారులను పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్న తీరు ఎంతమాత్రం ప్రజాస్వామ్యయుతంగా లేదు. చట్టం అమలుకు సహకరించాల్సిన ముఖ్యమంత్రి సీబీఐని అడ్డుకోవడానికి తానే దీక్షకు ఉపక్రమించడం ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. తనకు సీబీఐ మీద కోపం లేదనీ, తన పోరాటం అంతా సీబీఐని దుర్వినియోగం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ పైనేనని మమత స్పష్టం చేస్తున్నారు. మోడీని రాజకీయంగా ఎదుర్కోవడానికి ఆమె ఇతర మార్గాలను అనుసరిస్తున్నారు. మోడీని గుజరాత్‌కి పంపే వరకూ విశ్రమించనని శపథం చేశారు. రాజకీయ ప్రత్యర్థిగా ఆమె చేసే ప్రకటనల పట్ల ఎవరికీ అభ్యంతరం లేదు. తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చేందుకు వచ్చిన సీబీఐ అధికారులను అడ్డుకోవడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నట్టు కాదా. ఇలాంటి ఆందోళనలు ఇతరులకు ఎలాంటి సంకేతాలు ఇస్తాయో బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న మమతకు తెలియంది కాదు. ఆమె స్వతహాగా ఆవేశపరురాలు. దీర్ఘ కాలం ప్రతిపక్ష నాయకురాలిగా పోరాటాలకు అలవాటు పడిన ఆమె ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం, హక్కుల కోసం ఆమె కేంద్రంతో పోరాడటంలో తప్పు లేదు. అదే సందర్భంలో కేంద్ర సంస్థలు పనిచేసుకుని పోవడానికి అడ్డంకులు సృష్టించకుండా ఉండటం ముఖ్యమంత్రిగా ఆమె బాధ్యత. ఆ బాధ్యతను ఆమె విస్మరించారు. అలాగే, పోలీసు కమిషనర్ హోదాలో రాజీవ్ కుమార్ మమత దీక్ష వేదికను పాలు పంచుకోవడాన్ని కేంద్ర హోం శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. చట్టప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. తెగే వరకూ లాగడమంటే ఇదే. ఇరువర్గాలూ పంతాలూ, పట్టుదలలకు పోవడం వల్ల వ్యవస్థపై జనానికి నమ్మకం సడలుతోంది. పెద్ద పదవులలో ఉన్న వారే చట్టాన్ని గౌరవించకపోతే, సామాన్యులు ఉల్లంఘిస్తే వారిని దండించే హక్కు ప్రభుత్వంలోని పెద్దలకు ఎక్కడ ఉంటుందన్న ప్రశ్న తలెత్తుతోంది. సిబీఐ నోటీసులు జారీ చేయకుండా యుద్ధానికి వచ్చినట్టు కోల్‌కతా వచ్చిందంటూ మమత ఆరోపిస్తున్నారు రాజీవ్ కుమార్‌కి పలు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కోల్‌కతా రావల్సి వచ్చిందని సీబీఐ అధికారులు అంటున్నారు. పోలీసుల సమన్లను సామాన్యుడు ఉల్లంఘిస్తే రాష్ట్ర పోలీసులు ఊరుకోరు. కేంద్ర దర్యాప్తు సంస్థ సమన్లను పోలీసు ఉన్నతాధికారి ఉల్లంఘిస్తే ఉపేక్షించడం న్యాయమా అన్న ప్రశ్న తలెత్తుతోంది. పోలీసు అధికారి అయినంత మాత్రాన ఆయన చట్టానికి అతీతుడా అన్న ప్రశ్న కూడా ఉదయిస్తోంది. ఏ విధంగా చూసినా ఈ వ్యవహారంలో బెంగాల్ పోలీసులూ, సీబీఐ అధికారులూ అతిని ప్రదర్శించడం వల్లనే ఇంత రచ్చ జరిగింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జి జోక్యం చేసుకోకుండా ఉంటే, పరిస్థితి వేరుగా ఉండేది. చట్ట ప్రకారం సీబీఐ ముందుకు వెళ్లేది. మమత జోక్యం వల్ల దీనికి రాజకీయ రంగు వచ్చింది. చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా శిక్షార్హులే కానీ, ఆధునిక కాలంలో రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని చట్టం నుంచి తప్పించుకునే యత్నాలకు అందరూ ఒడిగడుతున్నారు. రాజకీయాల్లో ఉంటే తప్పులు చేసినా, ఎదుటి వారికి రాజకీయ దురుద్దేశ్యాలను ఆపాదించి బయటపడవచ్చునని అనుకుంటున్నారు. అలాగే, కేంద్రం కూడా సీబీఐని స్వతంత్రంగా పనిచేసుకోనివ్వకుండా తరచూ జోక్యం చేసుకోవడం వల్ల సీబీఐ విశ్వసనీయత దెబ్బతింది. సిబీఐ చట్ట ప్రకారం ముందుకు వెళ్ళినా, రాజకీయ ఒత్తిళ్ళకు లోనై తమను ప్రశ్నించేందుకు ముందుకు వస్తోందంటూ రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ చిట్‌ఫండ్ వ్యవహారంపై సిబీఐ దర్యాప్తును మమత అడ్డుకోవడానికి కారణం తమ పార్టీ ఎంపీల ప్రమేయం ఉండటం వల్లనే. తమపార్టీ ఎంపీల పై వచ్చిన అభియోగాలను నివృత్తి చేసుకోవల్సిన అవసరం ఆమెకు లేదా? సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించినా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సిట్ దర్యాప్తు జరిపించామని అనడం ఏపాటి న్యాయం? సర్వోన్నత న్యాయస్థానాన్ని గౌరవించడం ఇలాగేనా?


చరిత్రలో - ఈరోజు

స్వేచ్ఛా న్యాయవాది!



6, ఫిబ్రవరి, 1931న స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ న్యాయవాది మోతీలాల్ నెహ్రూ మరణించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కి రెండు సార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన మోతీలాల్ నెహ్రూ ఢిల్లీలోని కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. కేంబ్రిడ్జ్‌లో బారిస్టర్ పట్టాను 1883లో అందుకున్న మోతీలాల్ అలహాబాద్ కేంద్రంగా న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. న్యాయవాదిగా విజయంతోపాటు విపరీతంగా ధనాన్ని ఆర్జించి, అలహాబాద్‌లోని సివిల్‌లైన్స్‌లో భారీ భవంతి కొనుగోలు చేసి దానికి ఆనంద భవన్ అని పేరు పెట్టారు. ఆ తరువాతి రోజుల్లో ఇదే ఆనంద భవన్ సాతంత్ర్యోద్యకారుల కేంద్రంగా మారడం విశేషం. 1919లో ది ఇండిపెండెంట్ అనే దినపత్రికను ప్రారంభించారు. జలియన్‌వాలాబాగ్ ఉదంతంతో బ్రిటీషర్లపై విశ్వాసం సన్నగిల్లి.. గాంధీ మార్గంలోకి నడిచారు. స్వదేశీ భావనపై మహాత్మాగాంధీ మోతీలాల్ నెహ్రూలో అవగాహన పెంచారు. జలియన్‌వాలా బాగ్ ఘటనపై చిత్తరంజన్ దాస్, మహాత్మాగాంధీతో కూడుకున్న విచారణా సంఘంలో మోతీలాల్ కూడా సభ్యుడిగా ఉండడం విశేషం. 1919లోనే మోతీలాల్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడయ్యారు. 1922లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్న మహాత్మాగాంధీని మోతీలాల్ నెహ్రూ బాహాటంగానే విమర్శించారు. 1923లో దేశబంధు చిత్తరంజన్ దాస్‌తో కలిసి మోతీలాల్ నెహ్రూ స్వరాజ్ పార్టీని ఏర్పాటు చేశారు. సెంట్రల్ లెజిస్లేచర్ అసెంబ్లీలో విపక్షనాయకుడిగా వ్యవహరించిన మోతీలాల్ నెహ్రూ.. 1928లో తిరిగి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీకి రెండోమారు అధ్యక్షుడయ్యారు. తన కుమారుడు జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయ ప్రవేశంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని 1929లో అప్పచెప్పారు. మోతీలాల్ నిర్ణయాన్ని గాంధీ సైతం ఆమోదించడం విశేషం. సత్యాగ్రహ ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించిన మోతీలాల్ నెహ్రూ ఆరోగ్యం క్షీణించడంతో విడుదలయ్యారు. దేశంలో నెహ్రూ-గాంధీ కుటుంబానికి ఆద్యుడిగా మోతీలాల్ నెహ్రూ చరిత్రలో నిలిచిపోయారు.

దేశ విభజన వద్దన్న 'గాంధీ'?




దేశ విభజనను వ్యతిరేకించి, లౌకిక వాదాన్ని బలంగా నమ్మిన సరిహద్దు గాంధీగా మహాత్ముడితో పిలవబడ్డ ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్ పెషావర్ వ్యాలీలో 6, ఫిబ్రవరి, 1890లో జన్మించారు. ముస్లింలకు, హిందువులకు వేర్వేరు దేశాలన్న భావనను వ్యతిరేకించినా.. అహింసా విధానంలో గఫూర్‌ఖాన్ సంపూర్ణంగా గాంధీ మార్గాన్నే అనుసరించారు. 1930లో మహాత్మాగాంధీకి సలహాదారుగా వ్యవహరించిన ఖాన్, 1947లో పాకిస్థాన్ ఆవిర్భావం వరకు ఆయన వెన్నంటే ఉన్నారు. మతంతో పాటు మానవత్వాన్ని ప్రేమించే ఖాన్‌ను ఏ మ్యాన్ ఆఫ్ గాడ్ అని, ఏ సిటిజన్ ఆఫ్ వరల్డ్ అని పిలిచేవారు. పేదరికం పోవాలంటే అది చదువుతోనే సాధ్యమని నమ్మిన ఖాన్ 1910లోనే మసీదు పాఠశాలను ప్రారంభించారు. ఖాన్ స్థాపించిన పాఠశాలను బ్రిటీష్ ప్రభుత్వం 1915లో నిషేధించింది. దీంతో గాంధీ మార్గంలోకి వచ్చిన ఖాన్. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్నారు. దేశ విభజన జరిగాక పాకిస్థాన్‌లో పఠాన్ల హక్కుల కోసం పోరాటం సాగించారు. గఫూర్‌ఖాన్‌ను పాకిస్థాన్ భారతదేశ అనుకూలుడిగా ముద్ర వేసి పలుమార్లు జైలు పాలు చేసింది. ఆ తరువాత వైద్యం కోసం ఇంగ్లాండ్ వెళ్లారు. అక్కడి వైద్యులు అమెరికా వెళ్లమని ఇచ్చిన సలహాను పెడచెవిన పెట్టి ఆఫ్ఘనిస్తాన్ వెళ్లారు. అక్కడ జుల్ఫికర్ అలి భుట్టో ప్రభుత్వం గఫూర్ ఖాన్‌ను అరెస్ట్ చేసింది. ఆ తరువాత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. 1985లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ శత వార్షికోత్సవాల్లో పాల్గొనడానికి భారత్ వచ్చారు. 1967లో అబ్దుల్ గఫూర్ ఖాన్‌కి జవహర్‌లాల్ నెహ్రూ పురస్కారం లభించింది. 1987లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న అందుకున్నారు. భారత రత్న అవార్డును పొందిన మొట్ట మొదటి విదేశీయుడుగా కూడా గఫూర్ ఖాన్ రికార్డు సృష్టించారు. 97యేళ్ల వయసులో జనవరి 20, 1988న పెషావర్‌లో సరిహద్దు గాంధీ తుదిశ్వాస విడిచారు.

ఎదగాలంటే సింగపూరే!




1819, ఫిబ్రవరి, 6వ తేదీన డచ్ ఈస్ట్ ఇండియాకి లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరించిన సర్ థామస్ బింగ్లే స్టామ్‌ఫోర్డ్ రాఫెల్స్ సింగపూర్‌ను, బ్రిటీష్ మలయాను ఏర్పాటు చేశారు. డచ్ పాలకుల చేతుల్లోంచి జావా దీవులను విముక్తి చేసి బ్రిటీష్ రాజ్యంలో కలిపిన రాఫెల్స్ ది హిస్టరీ ఆఫ్ జావా పుస్తకాన్ని కూడా రచించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సింగపూర్ జపాన్ చేతుల్లోకి వెళ్లింది. ఆ తరువాత 1963లో బ్రిటీష్ వారి నుంచి సాతంత్ర్యం పొందింది. తొలినాళ్లలో మలేసియాలో భాగంగా ఉన్న సింగపూర్ సైద్ధాంతిక విభేదాలతో విడివడి 1965లో స్వతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది. తొలినాళ్లలో సహజ వనరులు లేక నానా అవస్థలు పడ్డ సింగపూర్ ఆ తరువాత యావత్ ప్రపంచం తలెత్తుకొని చూసేలా అభివృద్ధి చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశం హోదాను ఒకే తరంలో అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి ఆ దేశాధ్యక్షుడు లీ కౌన్ కీలకపాత్ర పోషించారు. ఆర్థిక రంగంలో ఆసియా టైగర్‌గా సింగపూర్ నిలిచింది. ఇప్పుడు విద్య, వినోదం, ఆర్థిక రంగం, వైద్య సంరక్షణ, మానవ వనరులు, లాజిస్టిక్స్, వాణిజ్యం, రవాణ, తయారీ పరిశ్రమ, సాంకేతిక పరిజ్ఞానం రంగాల్లో సింగపూర్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగింది. ఈ నగర రాజ్యం కీర్తి కిరీటంలో ఎన్నో బిరుదుల ఒద్దికగా ఒదిగిపోయాయి. సాంకేతికతకు సంసిద్ధంగా ఉన్న దేశంగా, పెట్టుబడులకు అత్యంత అనువైన దేశంగా, వరల్డ్ స్మార్ట్ సిటీ కంట్రీగా, ప్రపంచ సురక్షిత దేశంగా, మూడో అతి పెద్ద విదేశీ మారక మార్కెట్‌గా, మూడో అతి పెద్ద ఆయిల్ రిఫైనరీ, రెండో అతి ఎక్కువ రద్దీగా ఉండే కంటైనర్ రేవు ఉన్న దేశంగా ఎన్నో ప్రత్యేకతలను సింగపూర్ సొంతం చేసుకుంది.

ఆమెకి ఆస్తి ఉంటేనే ఓటు హక్కు



ఇప్పుడంటే పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ అయితే ఉంది. కానీ, భారత దేశానికి ప్రజాస్వామ్యాన్ని పరిచయం చేసిన బ్రిటీష్ వారు మాత్రం ఆమెకి ఓటు హక్కునే అంత తేలిగ్గా కల్పించలేదు. 1918 వరకు బ్రిటీష్ మహిళలకు ఓటు హక్కే లేదు. 6వ తేదీ, ఫిబ్రవరి, 1918న బ్రిటన్ పార్లమెంటు ప్రజా ప్రతినిధ్య చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం బ్రిటీష్ మహిళలకు ఓటు హక్కు ఇచ్చారు. అయితే ఓటు హక్కు పొందడానికి మహిళల వయసు కనీసం ముప్పై సంవత్సరాలు ఉండాలని నిబంధన పొందుపరిచారు. ముప్పై సంవత్సరాలే కాకుండా ఓటేసే మహిళలకు కనీస ఆస్తి అంటూ ఉండాలనే నిబంధన సైతం పొందుపరిచారు. అయిదు పౌండ్ల విలువ చేసే స్థలం కానీ, ఇళ్లు కానీ ఉంటేనే బ్రిటన్ మహిళలకు ఆ రోజుల్లో ఓటు హక్కు వస్తుంది. పురుషులకు మాత్రం 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఈ చట్టం ఫలితంగా ఒక కోటి ఇరవై లక్షలా తొంభై వేల మందికి ఓటు హక్కు వచ్చింది. మహిళా ఓటర్లు 85 లక్షల మంది నమోదయ్యారు. 1928లో కానీ మహిళలకు సమాన ఓటు హక్కు బ్రిటన్‌లో దఖలు కాలేదు. 1928 చట్టంలో ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా 21 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళా ఓటు హక్కుకు అర్హత కలిగి ఉండేలా నిబంధనలను సవరించారు. దీంతో బ్రిటన్ ఓటరు జాబితాలో అదనంగా మరో యాభై లక్షల మంది మహిళా ఓటర్లు చేరారు.

గుజరాత్ నమూనా ఏదీ?



అయిదేళ్ల పాలనలో తాను హామీ ఇచ్చిన గుజరాత్ నమూనాను ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా అమలుచేయగలిగారా? ఆయన చెబుతున్న గుజరాత్ నమూనా ఏమిటి? అసలది గుజరాత్‌లో ఎంతవరకు విజయం సాధించింది? లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అందరిలోనూ తొలుస్తున్న ప్రశ్నలివి.

సాధారణంగా రాజకీయ నాయకులకు, బడా వ్యాపారవేత్తలకు సత్సంబంధాలుంటాయి. ప్రధాని మోడీ ఈ విషయంలో అందరికన్నా ముందుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆయన జాతీయ రాజకీయ రంగ ప్రవేశం చేయగానే గుజరాత్ అభివృద్ధి నమూనా అనే అందమైన దృశ్యాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఇది సహజంగానే అందరికీ ఆసక్తి కలిగించే అంశం. మొదటినుంచి వ్యాపారం అంటే గుజరాత్ అనేంతగా గుజరాతీయులకు, వ్యాపారానికి అవినాభావ సంబంధం ఉన్న నేపథ్యంలో ప్రధాని మోడీ అందరినీ సునాయాసనంగా నమ్మించగలిగారు. వాస్తవానికి నరేంద్ర మోడి గుజరాత్ పగ్గాలు చేపట్టకముందే గుజరాత్ ఆర్థికంగా చాలా ముందంజలో ఉండేది. ఎంతో అభివృద్ధి చెందిన తూర్పు ఆసియాకి ఏమాత్రం తీసిపోకుండా అప్పట్లోనే గుజరాత్‌లో వినూత్న ప్రయోగాలు చేపట్టారు. అయితే అప్పట్లో రాజకీయ వాతావరణం భిన్నంగా ఉండేది. అప్పటి ప్రాంతీయ రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థకు మంచి సంబంధాలుండేవి. పరస్పరం కలిసి పనిచేసేవారు. 2000 సంవత్సరంలో మోడి ప్రవేశపెట్టిన ఆర్థిక విధానం ఆ స్నేహపూరిత వ్యాపార వాతావరణానికి కొత్త రూపం తెచ్చింది. 2001 నుంచి 2014 వరకు గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న మోడి గుజరాత్ మోడల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి దాన్నొక మెగా ఈవెంట్‌గా ప్రపంచం దృష్టిలో నిలిపారు. అయితే కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలు మాత్రమే దీనితో లబ్ది పొందాయన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. ప్రభుత్వానికి(మోడీకి), పెద్ద వ్యాపార సంస్థలకు రాష్ట్రప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు మాత్రం పెరిగాయి. అలా పెద్ద సంస్థలతో ప్రభుత్వ స్నేహం వలన ఆర్థిక వ్యవస్థకే కాదు సమాజానికి కూడా మంచి జరగలేదు. ఎందుకంటే చిన్న కంపెనీలతో పోలిస్తే పెద్ద కంపెనీలలో ఉద్యోగులు తక్కువమంది ఉంటారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో కేవలం పెద్ద కంపెనీలకు పెద్ద పీట వేయడం వలన ఉపయోగం లేదన్నది గుజరాత్ మోడల్ ద్వారా రుజువైంది. బిజెపి చేతిలోకి రాష్ట్రం వెళ్లకముందు, 1980లలో అంతకుముందు ముఖ్యమంత్రులు సామాజిక స్థితిగతులు, పరిస్థితులకు తగినట్లుగా సామాజిక విధానాలకు తగినట్లుగా ఉదారవాద నిర్ణయాలు తీసుకునేవారు. రిజర్వేషన్ల ఆధారంగా ప్రభుత్వం నుంచి సానుకూల ప్రతిస్పందనలుండేవి. ఏవిధమైన వివక్షలు ఉండేవి కావు. తర్వాత 90లలో కొత్త పాలసీ తీసుకువచ్చారు. కొత్తగా పెట్టిన పరిశ్రమలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలివ్వాలి. అంతేకాదు. ఉన్న ఉద్యోగాలలో 50 శాతం పోస్టులు మేనేజర్లు, సూపర్‌వైజర్లుగా స్థానికులకే ఇవ్వాలి. వెనకబడిన ప్రాంతాలలో తప్పనిసరిగా ఉపాధి అందేలా చూడటం ఆ పాలసీ లక్ష్యం. అలా ఉన్న గుజరాత్ ఉద్యోగ వ్యవస్థలో, 2003 లో మోడి ఆధ్వర్యంలో పారిశ్రామిక విధానం అమలు జరిగినప్పుడు అంతకుముందు ఉన్న సానుకూల పరిస్థితులు తారుమారయ్యాయి. వాస్తవానికి మోడీ మోడల్ ఉద్దేశ్యం ఏంటంటే, బయటి వ్యక్తుల నుంచి రాష్ట్రంలోకి పెట్టుబడులు రావాలి. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి. అటువంటి వాతావరణం రాష్ట్రంలో ఏర్పడాలి. కాని వాస్తవంలో మార్కెట్ సానుకూల వాతావరణానికి బదులు వ్యాపార సానుకూల వాతావరణం ఏర్పడింది. పరిశ్రమలు పెట్టాలనుకున్నవారికి కష్టకాలం ఎదురైంది. వారు మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు భూములు కొనుక్కోవలసి వచ్చింది. మార్కెట్ అనుకూల ఆర్థిక వ్యవస్థ లేదు కాబట్టి రాష్ట్రంలో నూతన ప్రయోగాలు జరగలేదు. ఎక్కువ పరిశ్రమలు రాలేదు. అనుకూలమైన మార్కెట్ పరిస్థితులుంటేనే సామాన్య ప్రజల అభివృద్ధి జరుగుతుంది. ఇంకోవైపు బడా కంపెనీల వ్యాపారం బాగా పెరిగింది. వ్యాపారానుకూల వాతావరణం ఉండటంతో రాజకీయనాయకులు రంగప్రవేశం చేశారు. తమ అనుయాయులతో కంపెనీలు ఏర్పాటు చేయించారు. గుజరాత్‌లో ఒకప్పుడు అంబానీ లాటి పెద్ద వ్యాపారులతోపాటు చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు ఊతం దొరికేది. అవి అభివృద్ధి చెందడానికి బలమైన, సానుకూల వాతావరణం ఉండేది. కాని తర్వాత పరిస్థితులు తారుమారయ్యాయి.

మోడీ మంచి వ్యాపారవేత్త అయిన ముఖ్యమంత్రిగా ఎంతోమందిని ఆకర్షించారు. ఏడాది విడిచి ఏడాది వైబ్రెంట్ గుజరాత్ పేరుతో అప్పట్లో మోడీ ప్రభుత్వం యావత్‌దేశాన్ని ఆకర్షించేది. ఆ సదస్సులకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు వేదికల మీద మోడీని ప్రశంసలతో ముంచెత్తేవారు. ముఖేష్, అనిల్ అంబానీలు, శశి రుయా, గౌతమ్ అదాని, ఇంకా చాలామంది ఆ జాబితాలో ఉంటారు. కాని ప్రశంసలు అందుకన్నరీతిలో మోడీ విదేశీ పెట్టుబడులను మనదేశానికి తేలేకపోయారు. 2000 నుంచి 2012 వరకు గుజరాత్‌కు కేవలం 4.5 శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఇంకోపక్క గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, 99 ఏళ్ల కోసం భూములను ఇండస్ట్రియల్ యూనిట్లకు లీజుకు ఇచ్చి సెజ్‌లను ఆరంభించింది. అది 21,308 హెక్టార్లకు పెరిగింది. మెగా ప్రాజెక్టుల మీద దృష్టి కేంద్రీకరించిన గుజరాత్ మోడల్ కేవలం పెద్ద కంపెనీల మీద మాత్రమే ఆధారపడింది. దానివలన అభివృద్ధి రేటు పెరిగింది కాని ఉద్యోగాలు మాత్రం ఎక్కువగా సృష్టించలేకపోయింది. అభివృద్ధిలో 1990లోనే గుజరాత్ దేశంలో అన్ని రాష్ట్రాలకంటే అగ్రపథాన ఉన్న గుజరాత్ ఇప్పుడు మనదేశ పారిశ్రామిక ఉత్పత్తిలో కేవలం 20 శాతం, టెక్స్‌టైల్ ఉత్పత్తిలో 24 శాతం, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తి 35 శాతం, పెట్రోకెమికల్ ఉత్పత్తిలో 51 శాతం, ఎగుమతుల్లో 22 శాతం నడుస్తోంది.

పెద్ద కంపెనీలు పెట్టుబడులు భారీగా పెడతాయి. కాని దానికి తగ్గట్టు ఉద్యోగాలు ఉన్నాయా అంటే అది ప్రశ్నార్థకం. ఉదాహరణకు పెట్రోకెమికల్ ఇండస్ట్రీ ఇంకా కెమికల్ ఇండస్ట్రీలు మంచి పనితీరు చూపిస్తాయి. వరుసగా 34 శాతం, 15 శాతం ఉత్పత్తి చూపాయి. కాని అవి ఎంతమాత్రం ఉద్యోగాలు సృష్టించే పరిశ్రమలు కావు. ఉత్పత్తి రంగం మాత్రమే ఎక్కువమందికి పనిచూపించగలవు. వేతనాల విషయంలో కూడా గుజరాత్ బాగా వెనకబడిపోయింది. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే చిన్న పరిశ్రమల్లో కార్మికవర్గం నాలుగింతలు ఎక్కువగా ఉంటుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తగ్గిపోవడానికి, పరిశ్రమల ఆర్థిక సమస్యలకు పాక్షిక కారణం జిల్లాస్థాయి కోఆపరేటివ్ బ్యాంకుల పతనం. చిన్నవాటికి అంత విలువ ఇవ్వక్కరలేదనే ఉద్దేశ్యంతో బిజెపి ప్రభుత్వం కోఆపరేటివ్ బ్యాంకులకు సహాయం చెయ్యలేదు. అంతేకాదు. దాని వెనక రాజకీయ కారణమూ ఉంది. గుజరాత్‌లో కో ఆపరేటివ్ బ్యాంకులను స్థాపించింది కాంగ్రెస్ కాబట్టి నిర్లక్ష్యవైఖరి అవలంబించారు.

రాష్ట్ర బిజెపికి అనుగుణంగా జాబ్ రేట్ పెరగడంలేదనేదే కాకుండా నాణ్యమైన ఉద్యోగాల సృష్టికూడా జరగట్లేదని జాబ్ మార్కెట్ పరిస్థితి చూస్తే అర్థం అవుతుంది. ఉదాహరణగా మళ్లీ నానో ప్లాంట్ ఉద్యోగుల విషయమే తీసుకుంటే మొత్తం 2200 మంది ఉద్యోగుల్లో కేవలం 430 మాత్రమే పర్మనెంట్ వర్కర్లు. వారి జీతం 2016 లో 12,500 ఉంది. అంటే అనధికార కార్మికులు నెలకు 3,300 రూపాయల కంటే తక్కువ సంపాదిస్తున్నారు. గుజరాత్‌లో 2000 సంవత్సరం మొదట్లో ఉధృతంగా మార్పులు వచ్చాయి. రాష్ట్రానికి మరింతమంది పెట్టుబడిదారులను తేవడానికి, తనని తాను వికాస పురుషుడిగా చెప్పుకోవడానికి, ముఖ్యంగా గుజరాత్ ఒక్కటే దేశంలో అభివృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రంగా అనడానికి నరేంద్రమోడి తాపత్రయపడ్డారు. మోడి చూపిన మేజిక్‌ఫిగర్ చూసి అందరూ అంతా నిజమనుకున్నారు. మోడీ నమూనా వలన గుజరాత్ ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి, పర్యావరణానికి మంచి జరుగుతుందనే ఊహలుండేవి. కాని చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పణంగా పెట్టి ముందుగా పెద్ద పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. గుజరాత్‌కి ఏదైనా మంచి జరిగింది అంటే అది 1980లలోనే. తర్వాత కాదు. చివరగా గుజరాత్ ప్రభుత్వం చేసిన ఇంకో పని, పెద్ద పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణకు, పరిశ్రమలు అనుసరించవలసిన నియమాల ఒత్తిడికి లోను కానక్కరలేదనే భరోసా ఇవ్వడం. 2015 లో పటేల్‌లు ప్రభుత్వ కోటాలో తమకు ఉద్యోగాలు రావాలని గొడవచేశారు. అంత భారీగా జరిగిన ప్రదర్శనలు చూస్తే మంచి ఉద్యోగాల అవసరం యువతకు ఎంత ఉందో అర్థం అవుతుంది. దాని తర్వాతనే 2017 లో స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలలో బిజెపి ఓడిపోయింది. రైతులు, వృత్తి కళాకారులు, చిన్న పరిశ్రమల వారి వ్యతిరేకత ఆ రకంగా వ్యక్తమైంది. మొత్తం మీద ఇది ఆర్థిక, సామాజిక, రాజకీయాంశాలతో ముడిపడిన అంశం. సామాన్యుడు తన నిత్య జీవనభుక్తి గురించి మాత్రమే ఆలోచించే నేపథ్యంలో మోడీ మోడల్ ఎన్నికల రాజకీయాల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందన్నది ప్రశ్న!

-శ్రీదేవి కవికొండల

పెట్టుబడి సాయం రైతుకి ఉపశమనం

వ్యవసాయరంగానికి భారత ఆర్థిక వ్యవస్థలో ఈనాటికి ప్రముఖ స్థానం ఉంది. ఇటీవలి కాలంలో రైతులు అనేక కష్టనష్టాలకు గురౌతున్నారు. వ్యవసాయ వ్యయం భారీగా పెరిగింది. పెట్టుబడికి తగిన రాబడి రాకపోవడం వలన, అతివృష్టి అనావృష్టి వల్ల, సకాలంలో ఎరువులు క్రిమిసంహారక మందులు లభించక, సరైన సమయంలో అవసరమైన రుణం లభించక రైతులు అనేక కష్టనష్టాలకు గురౌతున్నారు. కొన్ని సందర్భాలలో అప్పుల బాధలు పడలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో దేశవ్యాప్తంగా రైతులు 18 సార్లు రోడ్డున పడి ఆందోళనలకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తెలంగాణా రాష్ట్రా లకు చెందిన 184 రైతు సంఘాలు దేశవ్యాప్త నిరసనలకు దిగడంతో రైతన్నల ఆగ్రహ జ్వాలలు ఢిల్లీ పీఠాన్ని తాకాయి. ఇటీవల హిందీ బెల్ట్ లోని మూడు రాష్ట్రా ల్లో బిజెపి పరాజయానికి కొంతమేర అన్నదాతల ఆగ్రహం కారణమని నిర్ణయానికొచ్చిన కేంద్ర ప్రభుత్వం వారిని మంచి చేసుకోవడం కోసం అనేక రకాల పథకాలపై అధ్యయనం చేసి చివరకు తెలంగాణ, ఒడిశా రాష్ట్రా లు అమలు చేస్తున్న పెట్టుబడి సాయమే మంచిదన్న నిర్ణయానికి రావడం జరిగింది.

2019 - 20 తాత్కాలిక బడ్జెట్‌లో రైతుల సంక్షేమం కోసం కొత్త పథకం ప్రతిపాదించారు. విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, కూలీలు వంటి పెట్టుబడి వ్యయాలు సమకూర్చుకునేందుకు పేద రైతులకు ఆదాయ మద్దతు కల్పించాల్సిన అవసరం నెలకొన్న పరిస్థితుల్లో ప్రధానమంత్రి కిసాన్ నిధి పేరిట ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. రైతులు అప్పుల బారిన పడకుండా పరిహరించడం రుణదాతలు వలలో చిక్కుకోకుండా చూడడం ఈ పథకం ఉద్దేశం. చిన్న, మధ్య తరహా రైతులకు ఆర్థిక సహాయం అందచేయడమే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆశయం. ఈ పథకం ప్రకారం చిన్న, సన్నకారు రైతులకు లాభం చేకూరుతుంది. ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూకమతాలను కలిగి ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం ప్రకారం ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులకూ ప్రతి సంవత్సరం రూ.6000/-ల ఆర్థికసాయం మూడు దఫాలుగా చెల్లించడం జరుగుతుంది. ఈ నగదును నేరుగా కేంద్ర ప్రభుత్వం రైతులకు బదిలీ చేస్తుంది. 2018 డిసెంబర్ నుండి ఇది అమలులోకి వస్తుంది. కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేయడం వలన కేంద్ర ప్రభుత్వంపై సంవత్సరానికి 75 వేల కోట్ల మేర భారం పడుతుంది. 2018 - 19 ఆర్థిక సంవత్సరానికి 20 వేల కోట్లు, 2019- 20 ఆర్థిక సంవత్సరానికి 75 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

తెలంగాణాలో 47.08 లక్షల మంది రైతులకు లాభం:

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద తెలంగాణా రాష్ట్రంలో 47.08 లక్షలమంది సన్న చిన్నకారు రైతులు రూ.2,824 కోట్ల పెట్టుబడి సాయం పొందనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడి పథకం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని 90 శాతం మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణాలో మొత్తం రైతుల సంఖ్య 57.24 లక్షలు కాగా అందులో ఐదు ఎకరాలలోపు భూ కమతాలను కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతుల సంఖ్య 47.08 లక్షలు. అంటే సుమారు 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులలో అత్యధికంగా ఎకరం లోపు భూమి ఉన్నవారు 14.86 లక్షలమంది. తెలంగాణా రాష్ట్రంలో 1040 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సన్న, చిన్నకారు రైతుల అధీనం లో 95.59 లక్షలు అంటే 68.5 శాతం ఉంది.


తొలిసారిగా తెలంగాణాలో:

భారతదేశంలో కష్టాలలో ఉన్న రైతులకూ ఆర్థిక సహాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుగా గుర్తించింది. తెలంగాణా రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారిగా రైతులకు ఆర్థికంగా సహాయం చేయడం కోసం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా లాలపల్లి - ఇందిరానగర్ గ్రామంలో 2018 మే 10న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ఎకరానికి 4 వేల రూపాయల చొప్పున ఖరీఫ్, రబీ సీజన్‌లలో 8 వేల రూపాయలను పెట్టుబడి సాయంకింద చెక్కుల రూపంలో రైతులకు పంపిణీ చేశారు. అయితే తెలంగాణా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం జమచేసింది. తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు పథకం అమలు కోసం సుమారు 58 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదార్ పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఈ పథకం కింద లబ్ది పొందడానికి అర్హుడు. తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి తేడా ఉంది. రైతు బంధు పథకం అమలుకోసం తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 15 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. కేంద్రం రైతులకు ఆర్థికసాయం కింద ఇచ్చేది దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రా లకు కలిపి 75 వేల కోట్ల రూపాయలు. తెలంగాణా రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు పథకం వైపు ఇతర రాష్ట్రా లు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే ఇదే తరహా పథకాన్ని ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు కొన్ని మార్పులతో ప్రవేశపెట్టాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశాలు ఏమైనప్పటికీ తెలంగాణ రైతులకు మాత్రం రెండు కోణాల్లో లబ్ది చేకూరనుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌తో ప్రకటించినా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న రైతు బంధు పథకాల ద్వారా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంది. (5) ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిఉన్న ప్రతి రైతుకూ ప్రతి ఏటా రూ.6 వేల చొప్పున నగదు లభిస్తుంది. మనదేశంలో మొత్తం 26 కోట్ల 30 లక్షల మంది రైతులు ఉన్నారు. 2016 - 17 నాబార్డ్ ఆర్థిక సర్వే ప్రకారం ఒక్కో రైతు కుటుంబంపై రూ.1.04 లక్షల అప్పు భారం ఉంది. దేశం మొత్తంమీద సగం కంటే ఎక్కువ మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయినట్లు నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్ఓ) ప్రకటించింది. అనేక సందర్భాలలో రైతులు పండించిన పంటలకు డిమాండ్ లేకపోవడం వలన రైతులకు ఆశించిన ధర లభించడంలేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లి పండించిన రైతులు ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. అవసరమైనన్ని గోదాములు, శీతల గిడ్డంగులు లేకపోవడంతో పంట ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వచేసుకునే అవకాశం లేదు.

-డాక్టర్ పి.మోహన్ రావు, 9949595509

కవి సామ్రాట్ నోరి నరసింహ శాస్త్రి

నేడు 120వ జయంతి



తెలుగులో కవి సామ్రాట్‌లు ఇద్దరే ఉన్నారు. నోరి నరసింహశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ. నోరి నరసింహశాస్త్రి 1900 సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన గుంటూరులో పండిత వంశంలో జన్మించారు. ఆయన బీఏ బిఎల్ పట్టా పొంది రేపల్లెలో న్యాయవాదిగా ప్రసిద్ధి చెందారు. ఆయన తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, కన్నడ భాషల్లో పండితుడు. కథలు, నవలలు, నాటికలు, పద్యకావ్యాలు రాశారు. ఆ రోజుల్లో భారతి పత్రికలో సాహితీ వ్యాసాలు అనేకం రాశారు. ఆయన రాసిన చారిత్రక నవలల్లో రుద్రమదేవి, మల్లారెడ్డి, నారాయణ భట్టు, కవిసా ర్వభౌముడు, కవి ద్వయం ముఖ్యమై నవి. ఆయన రచనలు ఇతర భాషల్లోకి కూడా అనువదింపబడ్డాయి. ఆయన రాసిన గ్రంథాల్లో వాఘీరా (అజంతా గుహల గురించి), సర్పశాస్త్రం, కవిద్వయం (పోతన శ్రీనాధుడు) దేవీ భాగవతం, భాగవతావతరణం వంటివి కూడా ప్రసిద్ధమైనవి. ఆంధ్రప్రదేశ్, కేంద్ర సాహిత్య అకాడమీ శాస్త్రిగారి రచనలను శ్లాఘిస్తూ బహుమతులను అందజేశాయి. 1978 జనవరి 3వ తేదీన ఆయన కాలధర్మం చెందారు. ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య శాస్త్రి నోరి నరసింహ శాస్త్రి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించారు.. ఆర్ష, సంస్కృతీ సంప్రదాయాల గురించి విశేషంగా ప్రచారం చేస్తున్నారు. ఏటా నరసింహశాస్త్రి గారి జయంతిని నిర్వహించి ఏటా ఒక్కొక్క పండితుణ్ణి సన్మానిస్తున్నామన్నారు. ఇంతవరకూ నోరి నరసింహశాస్త్రి ట్రస్టు పురస్కారాలను అందుకున్న వారిలో రావూరి భరద్వాజ, ముదిగొండ శివప్రసాద్, కపిలవాయి లింగమూర్తి, ధారా రామనాథ శాస్త్రి, అనుమాండ్ల భూమయ్య, రవ్వాశ్రీహరి, అక్కిరాజు రమాపతిరావు, గొల్లపూడి మారుతీరావు, వెలగా వెంకటప్పయ్య, రావి గౌరీ నాగేశ్వరీదేవి, ఓగేటి ఇందిరాదేవి, ఎంవిఆర్ శాస్త్రి, కసిరెడ్డి వెంకటరెడ్డి, పోతుకూచి సాంబశివరావు, గరిమెళ్ళ సోమయాజులు, మంగళగిరి ప్రమీలా దేవి, చింతల పాటి నరసింహ దీక్షిత శర్మ కోడూరు భాస్కరరెడ్డి, ప్రభృతులు ఉన్నారు.నరసింహ శాస్త్రి గారి 120వ జయంతి సందర్భంగా 2019 సంవత్సరానికి శ్రీ పాదుక కొల్లూరు అవతార శర్మగారికి నరసింహశాస్త్రి గారి పురస్కారాన్ని అందజేస్తారు. ప్రోత్సాహక పురస్కారాన్ని రాంభట్ల వేంకటరాయ శర్మగారికి అందజేస్తారు. బుధవారం (6.2.19) సాయంత్రం హైదరాబాద్ త్యాగరాజ గానసభలో రిటైర్డ్ జస్టిస్ ఎ రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగే పురస్కారాలను అందజేస్తామని నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు.

కుప్పకూలిన ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్..

ముంబై: పుణెలోని ఇందపూర్ సమీపంలో కార్వేర్ ఏవియేషన్‌కు సంబంధించిన ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదవశాత్తు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ట్రైనీ పైలట్ గాయపడ్డాడు. ఇవాళ మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిర్‌క్రాఫ్ట్ టేకాఫ్ కాగా, కొద్దిసేపటికే అది కుప్పకూ లిపోయింది. స్థానికులు గాయపడిన పైలట్‌ను ఆస్పత్రికి తరలించారు. పైలట్ సిద్ధార్థ్‌కు చేతికి తీవ్ర గాయమైనట్లు వైద్యులు తెలిపారు. ఇక ప్రమాద స్థలికి చేరుకున్న కార్వేర్ ఏవియేషన్ అధికారులు.. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఊర్లకు నిధుల వరద

(మొదటిపేజీ తరువాయి)

మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపయోగించాలన్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరపాలని, హరితహారం పనులకు తొలిప్రాధాన్యం, స్మశాన వాటికల నిర్మాణాలకు రెండో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి ఉపయోగించాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలకు ఖచ్చితంగా బీటీ రోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలన్నారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో మొక్కలు నాటి రక్షించాలన్నారు. గుంతలు తవ్వడానికి, నీరు పోయడానికి ఇతరత్రా పనులకు నరేగా నిధులు వాడాలన్నారు. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలు పెట్టడం, వాటిని సంరక్షించడం వంటి బాధ్యతలు గ్రామపంచాయతీలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఖచ్చితంగా ఆరునెలల్లో వైకుంఠ ధామాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ భూమి లేకుంటే గ్రామపంచాయతీలు తమ నిధులతో స్థలాలు సమకూర్చాలని సూచించారు. దాతల నుంచి కూడా సేకరించుకోవచ్చన్నారు. వైకుంఠ ధామాలు నరేగా నిధులతోనే నిర్మించాలని తెలిపారు. మూడు వేలలోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో గ్రామానికి ఒకటి చొప్పున, మూడువేలకు పైగా జనాభా ఉన్న 1300గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14012 గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం గ్రామపంచాయతీల బాధ్యత అని గుర్తు చేశారు. శిథిలాలు తొలగించాలని, పాడుపడిన బావులను పూడ్చివేయాలన్నారు. కూలిన ఇండ్ల శిథిలాలు తొలగించాలన్నారు. రాష్ట్రంలో అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. కొత్తగా 859 గ్రామాలకు రహదారులు నిర్మించాలని, వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నరేగాతోపాటుగా వివిధ రకాలుగా సమకూరిన నిధులతో గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కావద్దని, ప్రతిపైసా సద్వినియోగం కావాలని అన్నారు. పనులు నామమాత్రంగా చేసి నిధులు కాజేసే పద్ధతి పోవాలన్నారు. దీనికోసం ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు 20 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్కె జోషి, ఎంపిలు బి.వినోద్ కుమార్, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, డి.ఎస్ రెడ్యానాయక్, బాల్క సుమన్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమీషనర్ నీతూ ప్రసాద్, డోబ్రియేల్, స్మితా సబర్వాల్, భూపాల్ రెడ్డి, ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలపై
ఆరు రాష్ట్రాల డీజీపీల సమావేశం



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆరు రాష్ట్రాల పోలీసుశాఖ డీజీపీలు, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. మంగళవారం తిరుపతిలో అంతరాష్ట్ర పోలీసు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రాల మధ్య సార్వత్రిక ఎన్నికలు, అంతరాష్ట్ర ఉగ్రవాదం, బలగాల మోహరింపు, ఇంటలిజెన్స్ సమాచారం మార్పిడి వంటి పలు అంశాలపై పూర్తి స్థాయిలో చర్చించారు. అదేవిధంగా రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు నెలకొనే నిమిత్తం ప్రత్యేక అధికారులను కూడా ఈ సమావేశంలో నియమించారు. ఎన్నికల క్రతువులో ఆరు రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం నోడల్ అధికారుల నియామకం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయా రాష్ట్రాల సరిహద్దు సంబంధిత అంశాలపై తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. పొరుగు రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సమాచార ప్రసార పరికరాల భాగస్వామ్య వినియోగం, సాయుధ బలగాల సమీకరణ, సమన్వయం వంటి అంశాలపై పలు నిర్ణయాలుతీసుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆర్పీ ఠాకూర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం సహకారంతో ఆరు రాష్ట్రాల అంతరాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ప్రధానంగా రాష్ట్రాల మధ్య తీవ్రవాదం, అక్రమ మద్యం, నగదు నియంత్రణ, అసాంఘికశక్తుల కదలికలు సరిహద్దు ప్రాంతాల తనిఖీ కేంద్రాలు, నక్సలిజంపై నిఘా వంటి సున్నితమైన అంశాలపై ఐక్య కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కీలక సమాచార మార్పిడి కోసం భాగస్వామ్య యంత్రాంగం ఏర్పాటు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట నిఘా కోసం హెలికాప్టర్లు, స్పీడ్ బోట్ల వంటి వాటిపై భాగస్వామ్య వినియోగ ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నాటక, తమిళనాడు డీజీపీలు, నీలమణిరాజు, రాజేంద్రన్, తెలంగాణ, ఏపీల హోమ్ సెక్రెటరీలు రాజీవ్ త్రివేది, అనురాధ, ఇంటలిజెన్స్ బ్యూరో జెడి చంద్రశేఖర్, ఇతర ఏడీజీలు, ఐజీపీలు, డీఐజీలు పాల్గొన్నారు.

ద.మ.రైల్వే జీఎంగా గజానన్ మాల్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే నూతన జనరల్ మేనేజర్‌గా గజానన్ మాల్యా నియమితులయ్యారు. 1972లో స్పెషల్ క్లాస్ అప్రెంటీస్‌గా రైల్వేలో ఆయన చేరారు. ఇప్పటి వరకు జమాల్‌పూర్ ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్‌గా పనిచేసిన మాల్యా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

నిజామాబాద్ వైద్య కళాశాలలో
అధ్యాపక నియామకాలకు ఇంటర్వ్యూలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో అధ్యాపకుల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆచార్య, సహఆచార్య, సహాయ ఆచార్య ఉద్యోగాల నియమాకాలకు సంబంధించి ఈనెల 12వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఆర్.ఎం. రావు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఇందిరా మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆచార్య ఉద్యోగాలు 9 ఖాళీలు, సహ ఆచార్య ఉద్యోగాలు 3 ఖాళీలు, సహాయ ఆచార్యుల ఉద్యోగాల 5 ఖాళీలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూ. డబ్ల్యూ. డబ్ల్యూ. జిఎంసిఎన్‌జెడ్‌బి. ఒఆర్‌జి వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని వారు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ స్కీం కింద
1,440 దరఖాస్తులు ఆమోదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి మొత్తా లను చెల్లించిన దరఖాస్తుదారులకు ల్యాండ్ రెగ్యులేషన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో పూర్తి ప్రయోజనం కలుగనుంది. ఎల్ఆర్ఎస్ స్కీమ్ కింద 1,440 మంది మొత్తం డబ్బును నిర్ణీత సమయంలో చెల్లించారని పురపాలక పరిపాలనశాఖ ముఖ్య కార్య దర్శి అర్వింద్ కుమార్ మంగళవారం తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ ఎస్ స్కీమ్ కింద 1,61,693 దరఖాస్తులు రాగా, ఇందులో 91,658 ఆమోదించగా, 58,052 దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. పూర్తి డబ్బు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించిన ప్రొసిడింగ్స్‌ను గత ఏడాది అక్టోబర్ 31 నాటికి ముగించినట్లు ఆయన తెలిపారు. ఇందులో కొందమంది దరఖాస్తుదారులు చివరి నిమిషంలో కూడా చెల్లించినందున వాటిని నిర్ధారించేందుకు ఆలస్యమవుతుందని అర్వింద్ కుమార్ తెలిపారు. నిర్దేశించిన గడువు ముగిసినందున కొత్త దరఖాస్తు దారులను స్వీకరించేది లేదని, అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి సమాచార లేఖలు ఇచ్చేది లేదని ఆయన స్పష్టంచేశారు.

రేటింగ్‌కు గండి!

●మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ హెచ్చరిక ●వరుసగా రెండు సంవత్సరాల పాటు ద్రవ్యలోటు పెరిగితే రేటింగ్ నెగిటివ్ ●పొంచివున్న ప్రమాద ఘంటికలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పెద్దెత్తున తాయిలాలు ప్రకటించడంతో భారత్ క్రెడిట్ రేటింగ్‌కు గండిపడుతుందని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ మంగళవారం నాడు హెచ్చరించింది. 2019-20 ఆర్థిక సంవత్సరం మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం సన్నకారు రైతులకు ఆదుకునేందుకు ఏడాదికి రూ.6,000 నగదు మద్దతు ప్రకటించడంతో పాటు మధ్య తరగతికి పెద్దమొత్తంలో పన్ను రాయితీలు ప్రకటించడంతో ద్రవ్యలోటు ఏర్పడుతుంది. వరుసగా రెండు సంవత్సరాల పాటు ద్రవ్యలోటు ఏర్పడితే భారత్ క్రెడిట్ రేటింగ్‌లో కోత పడుతుందని మూడీస్ ప్రభుత్వానికి గుర్తు చేసింది.

వచ్చే ఆర్థికసంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ 2019 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా కంటే కాస్తా ఎక్కువగా 3.6 శాతానికి ఎగబాకుతుందని చెప్పారు. అలాగే మార్చి 2020 నాటికి ఇది మరింత పెరిగి జీడీపీలో 3.6 శాతానికి ఎగబాకే అవకాశాలున్నట్లు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు పెరిగిపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో పాటు మధ్యతరగతిని ప్రసన్నం చేసుకోవడానికి పన్నుల్లో పెద్దమొత్తంలో రాయితీలు ప్రకటించడంతో ద్రవ్యలోటు పెరిగిపోతుంది. అదేసమయంలో సావరిన్ రేటింగ్ నెగెటివ్ అవుతుందని మూడీస్ వివరించి చెప్పింది.

వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోతోందని, తమ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం చేరుకోవడం అతి పెద్ద సవాలని పేర్కొంది. తమ అంచనా ప్రకారం మధ్య కాలికానికి కూడా పరిస్థితులు గాడినపడే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంది.

ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు సరిపడేంత మూలధనం సమకూర్చలేకపోవడంతో క ూడా క్రెడిట్ నెగెటివ్‌కు మారే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపింది. 2019-20 మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం సమకూర్చే అంశం ప్రస్తావించలేదని గుర్తు చేసింది. అదే విధంగా గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన అతి పెద్ద నాన్ లైఫ్ బీమాకంపెనీలను విలీనం చేస్తామని ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో దాని ఊసేలేదు. దీంతో ఈ మూడు బీమా కంపెనీల విలీనం ఉంటుందా లేదా అనేది ప్రశ్నగా మారిందని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ నోట్ వివరించింది.

మధ్యంతర బడ్జెట్‌లో రియల్‌ఎస్టేట్ రంగానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంది. దీంతో స్థిరాస్తి రంగానికి డిమాండ్ పెరుగుతుందని వెల్లడించింది.

అలాగే ప్రభుత్వరంగానికి చెందిన చమురు సహజ వాయువు కంపెనీల నుంచి పెద్దమొత్తంలో డివిడెండ్ సేకరించి అదే సమయంలో ఈ కంపెనీల నుంచి పెట్టుబడుల ఉపసంహరించాలని ప్రభుత్వం యోచిస్తోందని, దీంతో పాటు ఇంధనంతోపై సబ్సిడీలు ఇవ్వడం కూడా రేటింగ్‌కు నెగిటివ్‌కు దారి తీస్తుందని వివరించింది.

క్రెడిట్ రేటింగ్ పెరిగేందుకు దారి తీసే అంశాల విషయానికి వస్తే ప్రభుత్వం మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులపై పెద్దమొత్తంలో వ్యయం చేయడం ఒక్కటే క్రెడిట్ రేటింగ్ పెరగడానికి దారి తీస్తుందని ప్రభుత్వం మౌలికరంగంపై 2018 ఆర్థిక సంవత్సరం నుంచి 2019 ఆర్థిక సంవత్సరం వరకు మౌలికరంగంపై పెట్టుబడుల కోసం ఒక ప్రణాళికను రూపుదిద్దింది. వాటిలో ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వేలపై పెద్దమొత్తంలో వ్యయం చేయాలని నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో రైతులకు, మధ్య తరగతికి వరాల జల్లు కురిపించారు. దీంతో బ్యాంకులు, గృహాలు తనఖా పెట్టుకొని రుణాలు ఇచ్చే కంపెనీల క్రెడిట్ అనుకూలంగా ఉంటుందని మూడీస్ నివేదికలో వెల్లడించింది.

మూడీస్ రేటింగ్ క్రెడిట్ నెగెటివ్ గురించి వివరిస్తూ.. వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడంతో విఫలం అవుతోందని, దీని వల్ల సావరిన్ క్రెడిట్ రేటింగ్ నెగిటివ్‌కు చేరుతుందని హెచ్చరిస్తోంది. ఇక్కడ ద్రవ్యలోటు గురించి వివరంగా చెప్పాలంటే సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా వేసుకుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రెవెన్యూ ద్వారా సమకూరే ఆదాయం .. అదే సమయంలో ప్రభుత్వం చేసే వ్యయం. ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గి.. వ్యయం పెరిగితే బాండ్ల ద్వారా నిధులు సేకరించుకుంటుంది. దాన్నే ద్రవ్యలోటు అంటారు.. అది మన జీడీపీలో ఎంతశాతం అనేది లెక్కగడతారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలనుకున్నా.. అదీ దాటిపోయి 3.4 శాతానికి చేరుకొనే అవకాశాలున్నాయి.. అదే విధంగా 2020 నాటికి ద్రవ్యలోటును 3 శాతం లక్ష్యంగా నిర్ణయించుకున్నా.. తాజా బడ్జెట్‌లో పెద్దమొత్తంలో మోడీ సర్కార్ వరాలు కురిపించడంతో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా కంటే మరింత పెరిగి 3.6 శాతానికి చేరినా ఆశ్చర్యం లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు.

ఒక వేళ రేటింగ్ నెగెటివ్ అయితే ఏమిటనే ప్రశ్నకు ... విదేశీ ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తారు. అప్పుడు వృద్ధి రేటు నెమ్మదిస్తుంది. ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. సాధారణంగా మన ఆర్థికమంత్రులు.. గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలను మచ్చిక చేసుకొని తమ దేశ రేటింగ్ పెంచాలని కోరుతుంటాయి. కాబట్టి ప్రభుత్వాలు ఓట్ల కోసం ఉదారంగా వరాలు ప్రకటించే ముందు దేశ సావరిన్‌రేటింగ్‌ను కూడా దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందనే ఆర్థికవేత్తల అభిప్రాయం.

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

వడ్డీ రేట్లలో కోత!

● ఎస్అండ్‌పీ అంచనా

ముంబై : వరుసగా గత కొన్ని నెల నుంచి ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంటడంతో రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్ మంగళవారం నాడు పేర్కొంది. ముడిచమురు ధరలు తగ్గముఖం పట్టడంతో పరిస్థితులు అనుకూలంగా మారాయని అంచనా వేస్తోంది. మంగళవారం నుంచి రిజర్వుబ్యాంకు ఆరవ ద్వైమాసిక పరపతి సమీక్ష మొదలైంది. కొత్తగా ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంతదాస్ నేతృత్వంలో సమావేశాలు మొదలైనాయి. ఫిబ్రవరి 7వ తేదీన పరపతి సమీక్ష వివరాలు వెల్లడవుతాయి. ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్ ఆర్థికవేత్త విష్‌రుట్ రాణా .. మాట్లాడుతూ.. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పూర్తి స్తాయిలో అదుపులో ఉందని, అంచనా కంటే చాలా తక్కువగా ఉందని, ముఖ్యంగా ఆహార ఉత్పత్తి పెరగడంతో పాటు ముడిచమురు ధరలు అక్టోబర్ నుంచిచూస్తే 20 శాతం తగ్గాయి. కాబట్టి రిర్వుబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన వివరించారు. డిసెంబర్‌లో జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు జరగలేదు. అయితే ద్రవ్యోల్బణం తగ్గితే వడ్డీరేట్లతో కోత విధిస్తామని హామీ ఇచ్చింది. ఆహారం, ఇంధనం ధరలు తగ్గముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్ చివరి నాటికి 18 నెలల కనిష్టానికి 2.19 శాతానికి టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్ఠానికి 3.80 శాతానికి దిగివచ్చింది.

బ్రిటన్ బిల్‌గేట్స్...రుబేన్‌సింగ్

రూ.50 కోట్ల ఖర్చుతో రోల్స్‌రాయస్ కార్ల కొనుగోలు



లండన్: భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రుబేన్‌సింగ్ బ్రిటన్‌లో ఆయనను బిల్‌గేట్స్ ఆఫ్ బ్రిటన్‌గా సంబోధిస్తుంటారు. ఇటీవల కాలంలో ఇంటర్నెట్‌లో ఆయన అప్‌డేట్ చేసిన కొన్ని ఫోటోలు టాక్ ఆఫ్ ది టౌన్‌గా యువ తలో అలజడి సృష్టించాయి. ఇంతకు ఈ హల్‌చల్‌కు కారణం ఏమిటంటే ఆయన ఏకంగా రూ.50 కోట్లు ఖర్చు పెట్టి రోల్స్ రాయిస్ కార్లు కొనుగోలు చేయడమే.సింగ్ విషయానికి వస్తే ఆయన ఆల్‌డే పీఏ కాంటాక్ట్ సెంటర్ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో కూడా.. సింగ్ తాజా కార్ల కలెక్షన్స్‌లో రోల్స్ రాయిస్ కలెక్షన్స్ వాటిలో మూడు పాంథేమ్ లగ్జరీ సెడాన్స్, మూడు కుల్లీనాన్ లగ్జరీ ఎస్‌యూవీలు వాటి పేర్లు రుబీస్, సఫైర్స్, ఎమర్లాడ్స్. సింగ్ కార్ల కలెక్షన్స్‌లో అత్యంత ఖరీదైంది రోల్స్‌రాయిస్ ఫాంథెమ్, ఎస్‌యూవీలో కుల్లీనియన్ అత్యం త ఖరీదైంది. ఈ కార్లను ఆయా కార్ల కంపెనీలకు చెందిన సీఈవోలే సింగ్ ఇంటికి తీసుకెళ్లి డెలివరీ ఇచ్చారని మీడి యాలో కథనాలు వచ్చాయి. తాజా కార్ల కలెక్షన్స్ ఆయన వద్ద ప్రస్తుతం రోల్స్ రాయిస్ మోడల్ కార్ల సంఖ్య 20కి చేరుకుం టాయని చెబుతున్నారు. లగ్జరీ కార్లంటే సింగ్‌కు మహా పిచ్చి. సూపర్ లగ్జరీ కార్లు.. బుగ్గాటీ వేరాన్, పోర్షే 918 స్పైడర్, పాగానీ హుయారా, లాంబోర్గిని హరికేన్, ఫెరారీ ఎఫ్12 బెర్లిట్టా అనే కార్లు ప్రపంచంలో అతి కొద్ది మంది వద్ద మాత్ర మే ఉంటాయి. వాటిలో మన ఇండియన్ సింగ్ ఒక్కడు.

సత్తా చాటిన పీఎన్‌బీ



ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 7.12 శాతం వృద్ధితో రూ.246.51 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలకు కేటాయింపు గణనీయంగా తగ్గించుకుంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.230.11 కోట్లు నష్టాన్ని చూపించింది. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ బ్యాంకును సుమారు రూ.14,356 కోట్ల వరకు ముంచిన విషయం తెలిసిందే. అయితే మొత్తం ఆదాయంలో 2.64 శాతం క్షీణించి రూ.14,854.24 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.15,257.5 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. ఫ లితాలపై బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ మెహతా స్పందిస్తూ.. కంపెనీ ఫలితాలు తిరిగి గాడినపడ్డాయన్నారు. నీరవ్‌మోడీ మోసం కేసు తర్వాత బ్యాంకు నిబద్ధతతో పనిచేసి బ్యాంకును తిరిగి పట్టాలపై తేవాలనే అకుంఠ దీక్షతో పనిచేసి ఎట్టకేలకు తిరిగి లాభాలబాట పట్టించామని మెహతా అన్నారు. ఆస్తుల నాణ్యత గురించి ప్రస్తావిస్తూ.. గరిష్ఠఎన్‌పీఏ 16.33 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 12.11 శాతంగా నమోదైంది. అయితే నికర ఎన్‌పీఏ మాత్రం 8.22 శాతానికి దిగిరాగా... క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 8.90 శాతమని పీఎన్‌బీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఇక మొండిబకాయిలకు కేటాయింపుల విషయానికి వస్తే రూ.2,753.84 కోట్లు కాగా క్రితం ఏడాది రూ.4,666.68 కోట్లని తెలిపింది. క్యూ3లో మొండిబకాయిలు రూ.2,565.77 కోట్లుగా నమోదు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,996.42 కోట్లని తెలిపింది. బీఎస్‌ఈ దీని షేరు 1.98 శాతం పెరిగి రూ.74.60 వద్ద ట్రేడ్ అయ్యింది



నాడు పండ్ల వ్యాపారి.. నేడు గ్రామసర్పంచ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పండ్లు అమ్ముకునే వ్యక్తి చందాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. సీజన్ వారీగా వచ్చే పండ్లను హైదరాబాద్ తీసుకొచ్చి అమ్ముకుంటూ జీవనం సాగించే నరసింహులు దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని తోగుట మండలం చందాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. యాదవ కులానికి చెందిన నరసింహులును తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అభినందించి ఘనంగా సన్మానించారు.

15 సంవత్సరాల క్రితం తన ఊరు వదిలిపెట్టి నగరానికి పొట్టచేతబట్టుకొని వచ్చిన నరసింహులు 20 రోజులపాటు నగరంలో సీజన్‌గా వచ్చే పండ్లను అమ్ముతూ 10 రోజులపాటు తన సొంత గ్రామంలో ఉంటాడు. సర్పంచ్‌గా ఎన్నికయిన నరసింహులుకు ఊరిలో సొంత ఇల్లు లేదు.. గుంట భూమి లేదు. తండ్రి నారాయణకు బ్రహ్మచెవుడు కాగా.. తల్లి లక్ష్మి దివ్యాంగురాలని వకుళాభరణం తెలిపారు. సొంతూరు బాగు కోసం వచ్చిన సదవకాశాన్ని వినియోగించుకొని మంచి పనులు చేసి గ్రామ ప్రజల ఆకాంక్షలను నేరవేర్చాలని నరసింహులుకు సూచించారు.

'గ్రంథాలయలను ఆధునీకరించాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రంథాలయాల్లో ఆధునిక సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరక్టర్ జనరల్(విద్య) డాక్టర్ నరేంద్రసింగ్ రాథోర్ అన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని గ్రంథా లయాలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం అయిన రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల లైబ్రేరీయన్స్ నేషనల్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సదస్సును ఐసీఏఆర్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సం యుక్తంగా నిర్వహిస్తున్నాయి. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని నేర్చుకోవడం మానేసిన నాడు విద్యావంతులు సైతం నిరక్ష్య రాస్యులుగా మారిపోతారని అన్నా రు. గ్రంథాలయాలు పుస్తకాల నిల్వ కేంద్రా లుగా కాకుండా సమాచార కేంద్రా లుగా, పరిశోధన కేంద్రాలుగా, వనరుల కేంద్రాలుగా అకడమిక్ బ్లాకులుగా, టెక్నాల జీ వినియోగ కేంద్రాలుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రానిక్ యుగం లో దూరమవుతున్న పాఠకున్ని ఆకర్షించడానికి వినూత్న మార్గాలు అవలం భించాలని నరేంద్ర సింగ్ సూచించారు. గ్రంథాలయాలకు ప్రత్యేక బడ్జెట్ ఉండేందుకు ఐసీఏఆర్ కృషి చేస్తున్నట్టు వివరించారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ లైబ్రరీ పేరును నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్‌గా మారుస్తున్నట్టు ప్రకటించారు.

రాష్ట్రంలో ఫ్రీడమ్ స్కూల్ విధానం

• ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఫ్రీడమ్ స్కూల్ విధానాన్ని అమలు చేయడానికి ఆలోచిస్తున్నట్టు సాంఘికసంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో రెండు ఫ్రీడమ్ స్కూల్స్‌ను ప్రారంభించ నున్నట్టు తెలిపారు. ఉన్నత విద్యా రంగంపై రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరుగుతున్న అంతరంగిక సమావేశాలు(కాన్‌క్లేవ్)లో జరిగిన ఫ్యానల్ డిస్కషన్‌లో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఫైర్ సైడ్ ఛాట్ రౌండ్ ఫ్యానల్ డిస్కషన్‌లో ఇక్ఫాయ్ డైరక్టర్ బ్రాండింగ్ ప్రొఫెసర్ సుధాకర్ రావు ప్రవీణ్‌కుమార్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సంధించగా ప్రవీణ్‌కుమార్ సమాధానం ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడం కాకుం డా గైడ్ లాగా వ్యవహారిస్తూ విద్యార్థులే సొంతంగా నేర్చుకునే విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయులకు తామేమి తరగతిలో శిక్షణ ఇవ్వడం లేదని.. కానీ ఉపాధ్యాయులకు శిక్షణ కోసం దగ్గరలోని కమ్యూనిటీలు, గ్రామాలకు పంపించి విద్యార్థులు, తల్లిదండ్రులను అర్థం చేసుకునేలా చూస్తున్నామన్నారు. డిగ్రీలో చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరంలో కమ్యూనికేషన్ స్కిల్స్, క్యారెక్టర్, కాన్ఫిడెన్స్ అనే త్రీసీ ప్రోగ్రామ్‌ను ద్వితీయ సంవత్సరంలోని విద్యార్థులకు గణన నైపుణ్యాలను ఫైనల్ ఇయర్‌లో ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ఎంటర్ ప్రెన్యూ ర్ షిప్ అనే త్రీఈ ప్రోగ్రామ్‌ను నేర్పిస్తున్నట్టు తెలిపారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

• జాతీయ బీసీ సంక్షేమ సంఘం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆపేది లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంఘం జాతీయఅధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ జన్మదినోత్సవం మంగళవారం బీసీ భవన్‌లో జరిగింది.. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య అరుణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ రమేష్, వేల్పుల భిక్షపతి, వన్నాడి రమ్య, కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత 45 సంవత్సరాలుగా 10 వేలకు పైగా ఉద్యమాలు చేసి అనేక విజయాలు సాధించామన్నారు. ఉద్యమాల్లో భాగంగానే ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని సాధించుకున్నామన్నారు. గురుకుల పాఠశాలలను స్థాపించేలా చేశామని, లక్షలాది ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను సాధించి ఉద్యోగాలు వచ్చేలా చేశామన్నారు. ఇప్పుడున్న ప్రధాన కర్తవ్యమన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

• మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓసీలకు రిజర్వేషన్లు పెంచిన విధంగానే బీసీలకు కూడా కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచాలని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమం తరావు డిమాండ్ చేశారు. సీఎం చంద్రశేఖర్‌రావు కులాల మధ్య చిచ్చుపెట్టి.. విడదీయాలని చూస్తు న్నారని ఆయన విమర్శించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కులాల సంఘాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఉంటారని, కానీ సీఎం కేసీఆర్ మాత్రం కులాల పేరుతో సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. మున్నూరు కాపు వర్గానికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మా కుల సంఘాల్లో కేసీఆర్ రాజకీయం చేస్తే.. మేం కూడా వాళ్ల కుల సంఘంలో రాజకీయం చేస్తామని ఆయన హితవు పలికారు. లాబీయింగ్‌తో పదవులు ఎవరు తెచ్చుకున్నారో ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటామని ఆయన వివరణ ఇచ్చారు.

'వీహెచ్‌ను సస్పెండ్ చేయాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు గాంధీభవన్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో చేపట్టిన సన్మాన కార్యక్రమంలో వీహెచ్ తమను రౌడీలంటూ దూషించారని, ఆయనపై పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్న తమపై వీహెచ్ తన అనుచరులతో దాడులు చేయించారని వారు ఆరోపించారు. వీహెచ్ నుంచి తమకు ప్రాణహాని ఉందని ఎన్ఎస్‌యూఐ జాతీయ మాజీ కార్యదర్శి మోహన్, యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ తదిరులు పేర్కొన్నారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావుకు వినతిపత్రం అందజేశారు. టీపీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకుపోతానని కుమార్‌రావు హామీ ఇవ్వడంతో నిరసనను విరమించుకున్నారు.

ఈఎన్‌టీ పరీక్షలకు రెడీ

• వైద్య బృందాలు ఏర్పాటు... • 3 కోట్ల మందికి ఈఎన్‌టీ, దంత పరీక్షలు
• మందులతోపాటు శస్త్ర చికిత్సలు ఉచితం • ప్రజారోగ్యమే లక్ష్యంగా పథకాలు
• ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలతో ముందుకు సాగుతుంది. కేసీఆర్ కిట్స్, కంటి వెలుగు వంటి పథకాలు విజయవంతమవడంతో ఒక అడుగు ముందుకేసి ఈఎన్‌టీ, దంత వైద్య పరీక్షలు, డ్రగ్ సేఫ్టీ అలర్ట్ కార్డులు, స్వైన్‌ఫ్లూ, కుష్టువ్యాధులపై అహగాహన కార్యక్రమాలు చేపడుతోంది. చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ), దంత వైద్య స్క్రీనింగ్ పరీక్షలను ఈ నెలలో ప్రారంభించనున్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదివరకే అధికారులను ఆదేశించారు. కంటి వెలుగు అనంతరం నిర్వహించనున్న ఈఎన్‌టీ, దంతవైద్య స్క్రీనింగ్ పరీక్షల శిబిరాలు ఏర్పాట్లపై కసరత్తులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైద్యబృందాలను సిద్ధం చేశారు. రాష్ట్రంలో దాదాపు మూడు కోట్ల మందికి ఈఎన్‌టీ, దంత వైద్య పరీక్షలు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. వారిలో దాదాపు రెండు లక్షల మందికి వినికిడి యంత్రాలు అందజేయాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఒక్కొక్కటి మూడు వేల రూపాయల ఖరీదైన వినికిడి యంత్రాలను ఉచితంగా ఇవ్వనున్నారు. అవసరమైన శస్త్రచికిత్సలను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద చేయించనున్నారు.

ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్

చెవికి సంబంధించిన వ్యాధితో బాధపడేవారికి కాక్లియర్ ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. కొత్త సాకేంతిక పరిజ్ఞానంతో ఈ ఆపరేషన్లు ప్రైవేటు ఆసుపత్రిలో చేయించాలంటే సుమారు ఆరు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని కూడా ప్రభుత్వమే ఉచితంగా చేయించనుంది. గొంతు వ్యాధులకు సంబంధించిన క్యాన్సర్ వంటి వాటికి కూడా ఆధునిక పద్ధతుల్లో శస్త్ర చికిత్స చేయవల్సి ఉంటుంది. దంతపరీక్షలు చేయించుకున్న వారిలో కూడా సుమారు మూడు లక్షల మందికి శస్త్రచికిత్సలు అవసరమవుతాయని భావిస్తున్నారు.

ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో రాష్ట్రాన్ని వణికించిన స్వైన్‌ఫ్లూ పట్ల ప్రజలను వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపట్టింది. అన్ని జిల్లాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యబృందాలను పంపించి స్వైన్‌ఫ్లూ అనుమానితులను గుర్తించి, తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లా ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. కుష్టువ్యాధి నివారణకు సంబంధించి ఈ నెల 15 వరకు అన్ని జిల్లాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి కొండ, గిరిజన ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు విస్తృంగా చేపట్టారు. హెల్త్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులచే ర్యాలీ ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. నిరక్షరాశ్యులైన రోగులకు మేలు చేసే విధంగా డ్రగ్ అలర్ట్ సేఫ్టీ కార్డుల పంపిణీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చేపట్టింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఉస్మానియా ఆసుపత్రిలోని రోగులను ఈ కార్డులను అందజేశారు. త్వరలో ఈ కార్డులను అన్ని ఆసుపత్రుల్లోని రోగులకు అందజేయనున్నారు.

ప్రజలపాలిటి వరంగా ఉన్న కంటివెలుగు కార్యక్రమం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ కార్యక్రమం పట్ల విస్తతంగా ప్రచారం జరగడంతో ఇప్పటి వరకు దాదాపు ఒక కోటి నలభై లక్షల మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామం ఎర్రవల్లిలో కంటి పరీక్షలు నిర్వహిస్తే 217 మందికి దృష్టి లోపం సమస్యలు బయటపడ్డాయి. దీంతో ఒక గ్రామంలో పరిస్థితి ఇలా వుంటే రాష్ట్ర వ్యాప్తంగా కంటిపరీక్షలు నిర్వహిస్తే పరిస్థితి ఎట్లా వుంటుందో అర్థం చేసుకుని కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. గత ఏడాది ఆగస్టు 15న మెదక్ జిల్లా మల్కాపూర్‌లో స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 8582 గ్రామాలు, 764 మునిసిపల్ వార్డుల్లోనే కాకుండా అదనంగా 487 గ్రామాలు, 119 వార్డుల్లో కంటివెలుగు శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా ఆసుపత్రులలో శాశ్వతంగా కంటివెలుగు శిబిరాలు కొనసాగిస్తున్నారు.

అటవీ భూములపై ఆందోళన..

• తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


భీమ్‌గల్, పభ న్యూస్ : నిజామాబాద్ జిల్లా, దేవన్‌పల్లి గ్రామ శివారులోని అటవీ భూములు మావే అంటున్న అటవీ శాఖ వారి నిర్ణయాన్ని వెనుతీసుకోవాలని రైతుల ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని పట్టా భూములు గత 55 నుండి 60 సంవత్సరాలుగా వివిధ రకాల పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. రైతులకు గత ప్రభుత్వం అసైన్ భూములు సర్వే నంబరులు 95,50,52,56,57 లతో ఇచ్చిందని తెలిపారు. ఈ భూములలో వరి జొన్న, మొక్కజొన్న, వివిధ రాకాల పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ భూముల్లో హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని తెగేసి చెప్పారు. ఫారేస్టు అధికారులు మొండి వాదనలో ఈ భూములు అటవీ ప్రాంతం లోనికి ఉందని చెప్పడంతో మంగళవారం గ్రామ ప్రజలు, వ్యవసాయదారులు ఎమ్మార్వో కార్యాల యాన్ని ముట్టడించారు. ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. దీంతో వెంటనే అధికారులు స్పం దించి బుధవారం దేవన్ పల్లి గ్రామంలో గల భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

కల్యాణకట్ట మేడపై నుంచి పడి చిన్నారి మృతి



తిరుమల, ప్రభ న్యూస్ : తిరుమ లలోని ప్రధాన కల్యాణకట్ట మేడపై నుంచి పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బ్రతుకు తెరువు కోసం చంద్ర కాంత్, దుర్గాదేవి వారి కుమార్తె చంద్రిక (06)లతో కలసి గత 8 సంవత్సరాల క్రితం తిరుమలకు వచ్చారు. ఈ నేపథ్యంలో వారు హోటళ్ళలో సర్వర్‌లుగా పనిచేసే వారు. కాగా మంగళవారం చిన్నారి చంద్రిక తిరుమలలోని ప్రధాన కల్యాణకట్టలో లిఫ్టు ఆట ఆడుకుంటూ మూడవ అంతస్తుకు చేరుకుంది. ఈ క్రమంలో పాపపై నుంచి చూస్తుండగా కాలుజారి క్రిందపడింది. దీంతో చుట్టుప్రక్కలవారు, తల్లిదండ్రులు హుటాహుటిన పాపను స్థానిక అశ్విని ఆసుపత్రికి తరలించారు. కాగా పాప అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

కేంద్రంపై ఏపీ సీఎంవి నిందలే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో వైఫ ల్యాల నుంచి దృష్టి మళ్ళించడానికే ఆ రాష్ట్ర ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రంపై నిందలు వేస్తున్నారని భాజపా పార్లమెంట్ సభ్యుడు బండారు దత్తాత్రేయ విమర్శిం చారు. శారదా చిట్ ఫండ్ కుంభకోణానికి సంబంధించి సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విజయమని ఆయన తెలిపారు. భారత రాష్ట్రా ల సమాఖ్య అంతర్యుద్ధానికి, రాజ్యాం గ సంక్షోభానికి పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ ప్రయత్నించారని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబునాయుడు, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, కుమరస్వామి, దేవేగౌడ్‌లకు ఒక గుణపాఠం లాంటిదని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చెక్కుల పంపిణీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బ్రాహ్మణులు ఐక్యతతో ఉండి అందరితో సమానంగా ఉన్నత స్థానంలోకి ఎదిగేందుకు కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పా టును ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కె.వి. రమణాచారి తెలిపారు. ఇక్కడి బొగ్గుల కుంట లోని డాక్టర్ దేవు లపల్లి రామానుజరావు కళ్యాణ మండపంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ తరపున తెలం గాణ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పథకం (బెస్ట్) కింద ఎంపికైన 42 మంది లబ్దిదారులకు రూ.1,33,22,000, వివేకానంద విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన 110 మంది లబ్దిదారులకు రూ.19.75 కోట్ల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ని ఏర్పాటు చేసి బ్రాహ్మ ణులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కేసీఆర్ ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా సహాయ, సహకారా లనందిస్తోందన్నారు. బ్రాహ్మణులకు సరస్వతీ ఉంది కానీ ధనం లేదు. దీంతో బ్రాహ్మణులను అన్ని విధాలు గా ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ని నెలకొల్పి సహాయాన్నం దించడం జరుగుతోంది. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీయుతులు వనం జ్వాలా నరసింహారావు, కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, డాక్టర్ సముద్రాల వేణు గోపాలచారి, పురాణం సతీష్, మృత్యుంజయశర్మ, డాక్టర్ సువర్ణ సులోచన తదితరులు పాల్గొన్నారు. వారంతా ప్రభుత్వం అందజేస్తున్న ఈ సహాయాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రధానంగా బ్రాహ్మణు లంతా ఐక్యంగా ఉండాలని సూచించారు.



8న ఎస్పీఎం మిల్లులో ఉత్పత్తి ప్రారంభం

• నాలుగున్నరేళ్ల తర్వాత కార్మికుల కళ్లల్లో ఆనందం

కాగజ్‌నగర్‌టౌన్, ప్రభన్యూస్ : 27 సెప్టెంబర్, 2014న గత యాజ మాన్యం పేపర్‌మిల్లును షట్‌డౌన్ పేరిట మూసివేసింది. గత నాలుగు న్నర ఏండ్ల క్రితం మూతబడి ఉన్న పేపర్‌మిల్లును పునఃరుద్ధరించాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చొరవతోనే మిల్లు ప్రారం భానికి అడుగులు వేసింది. ఖాయిలా పడ్డ పరిశ్రమలకు చేయూత అందిస్తా మని సీఎం కేసీఆర్ సిర్పూర్ పేపర్ మిల్లుపై ప్రత్యేక దృష్టిసారించి మిల్లు తిరిగి ప్రారంభించేందుకు కేజే కంపెనీకి ప్రత్యేక రాయితీలో కల్పిస్తు మార్చి 2018న తెలంగాణ ప్రభుత్వం జీవో నెం. 18 జారీ చేసింది. గత ఏడాది అగస్టులో సిర్పూర్ పేపర్‌మిల్లును ఎన్‌సీఎల్‌టి కోర్టు తీర్పుతో జేకే యాజమాన్యం స్వాధీనం చేసుకుంది.

అప్పటి నుండి మిల్లు పునరుద్ధరణ చర్యలు ప్రారంభించి మిల్లులోని యంత్రాలకు మరమ్మతులు పనులు చేపట్టడంతో పాటు మిల్లు ఆస్తులను తమ ఆధీనంలో తీసుకుని పనులను వేగవంతంగా చేపట్టింది. మిల్లులో 1 నుండి 8 పేపర్ యంత్రాలు ఉండగా ముందుగా 7వ నెంబర్ పేపర్ యంత్రం మరమ్మతు పనులను వేగవంతం చేశారు. గతంలో బాయిలర్ పనులు పూర్తయి ట్రాయల్‌రన్ చేసి ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

10 రోజుల పసిగుడ్డుకు వాతలు

• పచ్చకామెర్లకు మందుగా వింత ఆచారం

సాలూరు: ఏజెన్సీ ప్రాంతాల్లో అనాదిగా అనుసరిస్తున్న వింత ఆచారాలు పసిపిల్లల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. పచ్చకామెర్లను తగ్గించడానికి 10 రోజుల చిన్నారికి వాతలు పెట్టడంతో పరిస్థితి విషమించింది. విజయనగరం జిల్లా సాలూరు ఏజెన్సీ ప్రాంతంలో పాచిపేట మండలం ఊబిగడ్డ గ్రామానికి చెందిన నర్సమ్మ, శ్రీను దంపతులకు 10 రోజుల క్రితం ఓ చిన్నారి జన్మించింది. అయితే మూడు రోజుల కిందట పసిబిడ్డకు పచ్చకామెర్లు వచ్చినట్లు, ఉబ్బసంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. దీంతో చిన్నారి అమ్మమ్మ సూది లాంటి వస్తువుతో బాగా కాల్చి కడుపుపై వాతలు పెట్టింది. మూడు రోజులుగా ఇలా చేస్తుండటంతో కడుపుపై పుండులా గాయమైంది. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సాలూరు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు చిన్నారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం మంగళవారంనాడు వెలుగులోకి వచ్చింది. ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు, వసతులు లేక పురిట్లోనే బిడ్డలు మరణిస్తున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు మూఢనమ్మకాలు కూడా చిన్నారుల పాలిట నరకంగా మారుతున్నాయి.


ఒంటె పాలు శ్రేష్ఠం

జీవితంలో నీటితో పాటు పాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. ఎన్నిరకాల పాలు వచ్చినా సమస్త పోషకాలున్న తల్లిపాలతో సమానమైన పాలు లభ్యం కావు. ఆధునిక పోకడల సమాజంలో మరెన్నో రకాల పాలు పుట్టుకొస్తున్నాయి. సోయా పాలు, బియ్యం పాలు, కొబ్బరి పాలు ఇలా జంతువుల పాలకు ప్రత్యామ్నాయంగా ఎన్నో రకాల పాలు మనకిప్పుడు అందుబాటులో ఉన్నాయి. అయితే ఒంటె పాలు మాత్రం సాధారణ జంతువుల పాలకు భిన్నంగా తల్లిపాలలో ఉండే పోషకాలకు దగ్గరగా ఉంటాయి. ఒంటె పాలలో సంతృప్త కొవ్వు ఆమ్లాలు, కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలు తక్కువగా ఉంటాయి. ఒమేగా-3 ఫాటీ ఆసిడ్స్, మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా, కావాల్సిన స్థాయిలో మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి ఖనిజ లవణాలు, విటమిన్ సీ, బీ2, ఏ, ఈ వంటివి పుష్కలంగా ఉంటాయి. లాక్టో ఫెరిన్ వంటి ప్రొటీన్, ల్యాక్టోపెరాక్సిడేజ్, ఇమ్యునోగ్లోబ్యులిన్, లైసోజైమ్స్ వంటివి, ముఖ్యంగా యాంటీ యాక్సిడెంట్లు, యాంటీ ఏజింగ్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలున్నాయి. ఇక భారత్‌లో ఒంటె పాలను థెరపాటిక్ డైట్‌లో భాగం చేస్తున్నారు. టీబీ, జాండిస్, రక్తహీనత, ఆటిజం, మధుమేహం వంటి వ్యాధుల బాధితులకు, రోగనిరోధకశక్తికి సంబంధించిన వ్యాధులున్న వారు వీటిని వాడితే మంచి ఫలితం కనిపిస్తుందని ఈ పాలను తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బాలు మాతృమూర్తి శకుంతలమ్మకు కన్నీటి వీడ్కోలు

నెల్లూరు కల్చరల్, ప్రభన్యూస్ : ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శ్రీ పతి పండితారాధ్యుల శకుంతలమ్మ(89) అంత్యక్రియలు మంగళవారం నెల్లూరు నగరంలోని బోడిగాడితోట కైలాస భూమిలో సాంప్రదాయ బద్ధంగా జరిగాయి. శ్రీపతి పండిరాధ్యుల శకుంతలమ్మ వయోభారంతో సోమవారం పరమపదించిన విషయం తెలిసిందే. మాతృమూర్తి మరణ సమాచారం అందుకున్న ఎస్పీ బాలు లండన్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకుని అక్కడి నుంచి కారులో నెల్లూరుకు వచ్చారు. ఎస్పీ బాలు రాకతో ఆ ప్రాంతంలో గంభీర వాతావరణం నెలకొంది. నేరుగా తల్లి పార్థీవ దేహం వద్దకు చేరుకున్న బాలసుబ్రహ్మణ్యం ఆమెకు పాదాభివందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నపిల్లవాడిలా మూగగా రోదించారు. ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం రాకతో కుటుంబ సభ్యులు మౌనంగా విలపించడం చుట్టుపక్కలవారికి కంటనీరు తెప్పించింది. అనంతరం సాంప్రదాయబద్ధంగా శకుంతలమ్మ పార్థీవ దేహాన్ని ప్రత్యేక అలంకరణ చేసిన వైకుంఠ రథయాత్ర వాహనంలో కైలాస భూమికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె పార్థీవ దేహాన్ని సాంప్రదాయబద్ధంగా ఖననం చేశారు. శకుంతలమ్మ అంతిమయాత్రలో పలువురు సినీ ప్రముఖులు, పురప్రముఖులు పాల్గొన్నారు. అంతకుమందు శకుంతలమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించిన పలు వురు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కుమారులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, అల్లుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి ఎస్పీ శైలజ, వారి కుటుంబ సభ్యులను పరా మర్శించారు. తల్లి పార్థీవ దేహనికి కుమార్తెలు పార్వతీ, వసంతలు పాదాభి వందనం చేసి, ఘనంగా నివాళులర్పించారు. శకుంతలమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళుల ర్పించిన వారిలో శాంతాబయోటిక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, సినీ రచయితలు భువన చంద్ర, వెన్నెలకంటి, సంగీత దర్శకులు వాసురావు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, నలుబోలు బల రామయ్య నాయుడు, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, గ్రోసు గోపాలయ్య, వైసీపీ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

మద్దతు ధర కోసం పత్తి రైతుల రాస్తారోకో



పెద్దపల్లి రూరల్, ప్రభ న్యూస్ : పత్తికి మద్దతు ధర కల్పించాలని మంగళవారం రైతులు ఆందోళన నిర్వహించారు. స్థానిక వ్యవసాయ ఉన్నత శ్రేణి కార్యాలయం ముందు రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పత్తి మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన రైతులు మద్దతు ధర లభించడం లేదంటూ ఆగ్రహంతో రోడ్డెక్కారు. అధికారులు పత్తికి మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. రైతుల నినాదాలు హోరెత్తాయి. రాస్తారోకోతో ఇరువైపుల భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ నరేందర్, ఎస్సై ఉపేందర్‌లు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. ఈ సందర్భంగా పత్తి రైతులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ జాప్యం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురుంకున్నామని ట్రేడింగ్ అనంతరం మద్దతు ధరలు చెల్లించకుండా 4500 ధర చేయడం ట్రేడర్‌ల మోసానికి నిదర్శనమన్నారు. అనంతరం సీఐ, ఎస్సైలు రైతులతో చర్చించి మార్కెట్ అధికారులతో చర్చలు జరిపారు. దీంతో రైతులు రాస్తారోకో విరమింపచేశారు.



తాటకి.. సురస.. ఝాన్సీరాణి..

న్యూఢిల్లీ: సీబీఐ వర్సెస్ పోలీస్.. మోదీ వర్సెస్ దీదీ... కోల్‌కతా పొలిటికల్ ఫైట్.. దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో భాజపా, తృణమూల్ నాయకులు చేస్తున్న కామెంట్లు ప్రసారమాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని పురాణ రాక్షసులైన తాటకి.. సురసతో పోల్చుతూ బీజేపీ నేతలు విమర్శిస్తుంటే, తృణమూల్ ఎంపీ తమ అధినేత్రిని తెల్లదొరలను ఎదిరించిన ధీరవనిత ఝాన్సీ రాణిగా అభివర్ణించారు. మా చిన్నప్పుడు రాంలీలా మైదానంలో ఓ సీన్ నాకు గుర్తుకొస్తోంది. రుత్విక్కులంతా యజ్ఞం చేస్తుంటే.. తాటకి అనే రాక్షసి వచ్చి పదేపదే యజ్ఞానికి ఆటంకం కలిగించే దృశ్యమది. ప్రస్తుతం మమతా బెనర్జీ పోషిస్తున్న పాత్రను చూస్తుంటే తాటకి గుర్తుకొస్తోంది అని హర్యానా మంత్రి అనిల్ విజ్ విమర్శించారు. అమిత్‌షా దగ్గర్నుంచి యోగి ఆదిత్య నాథ్ వరకు ఆమె అందరినీ అడ్డుకుంటుంది. కనీసం హెలికాప్టర్లను కూడా రానివ్వడం లేదు. ఇవి తాటకి చర్యలేనని అన్నారు. యూపీలోని బలి యాకు చెందిన మరో బీజేపీ నేత దీదీని సురసగా అభి వర్ణించారు. లంకలోకి హనుమంతుడిని కాలుపెట్టకుండా సురసి అడ్డుకుంది. ప్రధానమంత్రి మోడీ రాముడైతే, యోగి ఆదిత్యనాథ్ హనుమంతుడి వంటివారంటూ పోలికలు చెప్పారు. ఇదిలావుంటే బీజేపీ నేతల తీరును తృణమూల్ ఎంపీ దినేష్ త్రివేది కొట్టిపారేశారు. మమతా బెనర్జీ తాటాకు చప్పుళ్లకు బెదిరేవ్యక్తి కాదు. బ్రిటీషు వాళ్లను ఎదురొడ్డి నిలిచిన వీరవనిత ఝాన్సీరాణితో సమానం అంటూ కీర్తించారు.

వర్దెల్లి బుచ్చిరాములుకు అశ్రు నివాళులు



సూర్యాపేట, ప్రభన్యూస్: తెలంగాణ సాయుధ పోరాట యోదుడు, సీపీఎం సీనియర్ నాయకులు వర్దెల్లి బుచ్చిరాములు సోమవారం రాత్రి నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం ఉదయం ఆయన పార్థీవ దేహాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ భవన్‌వద్ద సందర్శనకు ఉంచారు. రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, సీపీఎం నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుమారుడు సాక్షి దినపత్రిక ఎడిటర్ వర్దెల్లి మురళితో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. హిందు స్మశానవాటికలో సంస్కారాలు నిర్వహించారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్స, మాజీమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహ్మారెడ్డి, జూలకంటి రంగారెడ్డి తదితరులున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రకటనలో సంతాపం తెలిపారు.

గజ్వేల్‌లో అడవుల అభివృద్ధి భేష్

అధికారులకు యూపీ బృందం కితాబు



గజ్వేల్, ప్రభ న్యూస్ : గజ్వేల్ ప్రాంతంలో అడవులను బాగా అభివృద్ధి చేస్తున్నారని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ అధికారుల బృందం సిద్దిపేట జిల్లా అటవీశాఖ అధికారులకు కితాబిచ్చారు. మంగళవారం గజ్వేల్ మండలం సంగాపూర్ అటవీ ప్రాంతాన్ని, అర్బన్ పార్కును, కొమటిబండ మిషన్ భగీరథ సంప్ హౌజ్‌ను పరిశీలించి నీటి శుద్ధీకరణ సరఫరా గురించి తెలుసుకున్నారు. సంప్‌హౌజ్ పైనుండి కొమటిబండ అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఉత్తరప్రదేశ్ బృందానికి అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ అశోక్‌కుమార్‌సిన్హా, సిద్దిపేట జిల్లా డీఎఫ్ఓ శ్రీధర్‌రావు, ఎఫ్ఆర్ఓ రామారావులు అడవుల అభివృద్ధికి చేపడుతున్న పనులను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో అడవుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టిందన్నారు. అటవీ భూముల్లో గతంలో నీలగిరి చెట్ల పెంపకం గురించి వివరించారు. అనంతరం గిరిపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామ ద్వారం వద్ద యువజన సంఘాలు ఇరువైపులా పెంచిన మొక్కలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వే వ్యాగన్ల సంఖ్యను పెంచండి

చీఫ్‌ఆపరేషన్స్ మేనేజర్‌తో సింగరేణి సీఎండీ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెరుగుతున్న బొగ్గుఉత్పత్తికి అనుగుణంగా రవాణా కోసం రైల్వే వ్యాగన్లసంఖ్య పెంచాలని సింగరేణి సిఎండి శ్రీధర్ రైల్వే శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ మధుసూధనరావును మంగళవారం కోరారు. సికింద్రాబాద్ రైలునిలయంలో ఈ సమావేశం జరిగింది. సింగరేణికి సగటున ప్రతిరోజూ 30రేక్‌లను(ఒక్కొరేక్ సామర్ధ్యం 4వేల టన్నులు) రైల్వే శాఖ అందిస్తుండగా, సెప్టెంబర్ 2018నుండి ఉత్పత్తి పెరగడంతో జనవరిలో ఈ సంఖ్యను 40కు పెంచారు. ఫిబ్రవరి, మార్చి ఉత్పత్తి మాసాలు కాబట్టి రోజుకు 45రేక్‌లకు వ్యాగన్లసంఖ్యను పెంచాలని సింగరేణి ఛైర్మన్ కోరగా, రైల్వే సిఓఎం సానుకూలంగా స్పందించారు. బొగ్గురవాణా, దూరాలను సమీక్షించి సర్దుబాటు చేస్తామని హామీనిచ్చారు. సమావేశంలో సిఎఫ్‌టిఎం బి.నగ్యా, సీనియర్ డిఓఓం మనోజ్, ఈడి ఆల్విన్, జిఎం ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

....

అప్పు చెల్లించలేదనే హతమార్చారు

రాకేష్‌రెడ్డి సహా ఇద్దరి అరెస్టు

● శిఖా చౌదరి పాత్రలేదన్న ఎస్పీ త్రిపాఠి ● ఆ ఇద్దరు పోలీసుల పాత్రపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఎన్నారై పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసు దర్యాప్తుకు పోలీసులు తెరదించారు. తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వకపోవడంతోనే పథకం ప్రకారం జయరామ్‌ను హత్య చేసినట్లు నిర్ధారించారు. హైదరాబాద్‌కు చెందిన రాకేష్‌రెడ్డిని ప్రధాన నిందితునిగా పేర్కొని అరెస్టు చేయడంతో పాటు సహకరించిన ఆరోపణలపై డ్రైవర్ శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేశారు. తొలి నుంచి వస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చుతూ జయరామ్ మేనకోడలు పులివర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరికి హత్యతో సంబంధం లేదని నిర్ధారించారు. నందిగామలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టును కృష్ణా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ నిర్ధారించారు. హత్యకు సంబంధించిన పూర్వాపరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 1న నందిగామ మండలం ఐతవరం సమీపంలో జయరామ్ మృతదేహం వెలుగు చూసిన తర్వాత సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి నందిగామ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపై పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించడంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశామన్నారు. ఇందుకోసం ఆరు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలోనే పలువురిని అదుపులోకి తీసుకొని విచారించామని, జయరామ్ కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించామన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం, పంచాయితీలు చేసే రాకేష్‌రెడ్డి హత్యకు సూత్రధారిగా దర్యాప్తులో నిర్ధారణ అయ్యిందన్నారు. గతంలో ఫ్యాక్టరీ వివాదం జరిగినప్పుడు రెండు దఫాలుగా రూ.6 కోట్లు రాకేష్‌రెడ్డి వద్ద జయరామ్ అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. అప్పట్లో అమెరికా నుంచి జయరామ్ సూచన మేరకు శిఖా చౌదరిని కలవడం జరిగిందని, ఇప్పుడు వారిద్దరి మధ్య సంబంధాలు లేవని ఎస్పీ చెప్పారు. పలుమార్లు తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలంటూ జయరామ్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇండియాకు వచ్చిన జయరామ్‌ను మహిళ పేరిట సిమ్ తీసుకొని చాటింగ్ ద్వారా గత నెల 30న జూబ్లిహిల్స్‌లోని తన ఇంటికి రప్పించి నిర్బంధించారన్నారు. తన వద్ద తీసుకున్న రూ.6 కోట్లు వడ్డీతో సహా చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు విచారణలో తేలిందన్నారు.

ఈ క్రమంలోనే డబ్బుల కోసం జయరామ్ స్నేహితులకు ఫోన్ చేయించగా కేవలం రూ.6 లక్షలు మాత్రమే సమకూర్చినట్లు చెప్పారు. 31వ తేదీ ఉదయం 11గంటల వరకు ఎదురు చూసినప్పటికీ డబ్బుల వ్యవహారం తేలకపోవడంతో రాకేష్‌రెడ్డి దాడి చేశారన్నారు. ముఖంపై బలంగా కొట్టడంతో సోఫాపై పడిన జయరామ్‌ను ముఖం అదిమిపట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు తెలిపారు. అక్కడి నుంచి నందిగామ వద్దకు తీసుకొచ్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కారుతో సహా మృతదేహాన్ని అక్కడే వదిలేశారని, బస్సులో రాకేష్‌రెడ్డి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడని చెప్పారు. ఇందుకు సంబంధించి టోల్‌గేట్ల వద్దనున్న సీసీటీవీ పుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. హత్య చేసిన తర్వాత రాకేష్ రెడ్డి ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారులకు ఫోన్ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. హైదరాబాద్‌లోని నల్లకుంట సీఐ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డికి ఫోన్ చేసినట్లు విచారణలో వెలుగు చూసిందన్నారు. హత్య నుంచి తప్పించుకునేందుకు వారి సలహాకోరినట్లు తెలిపారు. ఇద్దరు పోలీసు అధికారుల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పిన ఎస్పీ త్రిపాఠీ న్యాయ నిపుణుల సూచనలకు అనుగుణంగా కేసు బదలాయింపుపై ఆలోచన చేస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ త్రిపాఠి

రాజకీయ నేతలతో రాకేష్ చెట్టపట్టాల్

● ఖాకీలు, న్యాయవాదులతో సత్సంబంధాలు ● ఆ అండతో దందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు ● వచ్చిన డబ్బుతో జల్సాలు ● గోవాలో కాసినో, విదేశాల్లో ఎంజాయ్‌మెంట్ ● రాకేష్‌రెడ్డిపై గతంలో పలు కేసులు

ఎక్స్‌ప్రెస్ టీవీ అధినేత, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసులో నిందితుడైన రాకేష్‌రెడ్డిది ఘనమైన నేరచరిత్ర ఉంది. రాజకీయనేతలు, పోలీసులతో సత్సంబంధాలు నెరిపాడు. ఈ పరిచయాలను ఆసరా చేసుకుని అనేకానేక దందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడ్డాడు. తద్వారా ఆర్జించిన డబ్బుతో గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి కాసినోలో ఆ డబ్బుని ఖర్చు పెట్టేవాడు. విదేశాలకు సైతం వెళ్లి అక్కడ జల్సాలు చేసేవాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డి మహాకూటమి నేతలతో కలిసి తిరిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ తదితర నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నేతలతో రాకేష్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఎన్నికల్లో ఒక నియోకవర్గంలో ఓ కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడంతో పాటు పోలింగ్ ఏజెంట్‌గా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరో ఆసక్తికర విషయమేమంటే సదరు నేతకు కూటమి తరపున టికెట్టు ఖరారు చేసేందుకు రాకేష్ లాబీయింగ్ నడిపినట్లు ప్రచారం సాగుతోంది. ఈ టికెట్టును కాంగ్రెస్‌కు వదిలేందుకు అతను కూటమి నేతలతో రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. దీంతో సదరు నేతకు టికెట్టు ఖరారైందని కూడా చెబుతున్నారు. అంతకు ముందు కూడా ఓ మాజీ హోంమంత్రి తనయుని కోసం ఎన్నికల్లో పనిచేశాడు. ఆంధ్రకు చెందిన ఓ యువనేతతో సైతం రాకేష్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొందరు నేతలకు అపాయంట్‌మెంట్ ఖరారు చేసినట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. రాకేష్‌రెడ్డిపై పలు కేసులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

చట్టాన్ని నడిపించాల్సిన ఖాకీలు ఈ విధంగా...?

చట్టాన్ని నడిపించాల్సిన ఖాకీలు.. కట్టుతప్పటమే ఇక్కడ చర్చనీయాంశమవుతోంది. జయరామ్ హత్య, అనంతర పరిస్థితుల నుంచి నిందితులను తప్పించేందుకు పెద్ద ఎత్తున సహాయం అందించింది పోలీసు అధికారులే కావడం గమనార్హం. రాకేష్‌రెడ్డి కాల్‌డేటాలో అనూహ్యంగా ఖాకీల ప్రస్తావన వెలుగుచూసిన నేపథ్యంలో ఇరు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఐదు రోజులుగా పలు రకాల ట్విస్ట్‌లు.. అనేక రకాల అనుమానాలను వ్యక్తపరుస్తూ మీడియాలో కథనాలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతుండటం దర్యాప్తు సంస్థలనే దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏపీ, తెలంగాణ పోలీసులు పరస్పర సహకారంతో రాకేష్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ముగింపు వాఖ్యం పలికారు.

రాకేష్‌రెడ్డికి ఖాకీల సహకారం ఇలా...!

రాకేష్‌రెడ్డికి పరోక్షంగా సహాయ సహకారాలు అందించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఖాకీలలో ఒకరు రాకేష్ ఇంటి సమీపంలోనే ఉంటారని తెలుస్తోంది. జయరామ్‌ను హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని ఏం చేయాలనే దానిపై ఆ పోలీసు అధికారి రాకేష్‌కు సలహా ఇచ్చారని తెలుస్తోంది. ఆయన సలహా మేరకే రాకేష్ మృతదేహాన్ని కారులో వేసుకుని నందిగామ శివార్లలో యాక్సిడెంట్‌గా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడని సమాచారం. మరో పక్క జయరామ్‌ను ఎలా ట్రాప్ చేయాలనే అంశంలో.. మరో పోలీసు అధికారి రాకేష్‌కు సలహా ఇచ్చినట్లు ఆరోపణలు వినిపించాయి.

ఖాకీలెంతమంది ఉన్నారు?

రాకేష్‌రెడ్డికి గతంలోనూ, ప్రస్తుతం జయరాం హత్య కేసులో ట్రై కమిషనరేట్ పరిధిలో ఇంకా ఎందరు ఖాకీలు సహకరించి ఉంటారనే ప్రశ్నే ప్రతి ఒక్కరిలో ఉదయిస్తోంది. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదలీ చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డిని అంబర్‌పేట పోలీస్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు రాచకొండ సీపీ మహేష్ భగవత్ తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ గాంధీ నారాయణకు ఇబ్రహీంపట్నం ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తదుపరి పోలీసు దర్యాప్తులో వీరిపై వచ్చిన ఆరోపణలు వాస్తవ రూపం దాల్చితే వారు కూడా జయరాం హత్య కేసులో నిందితులయ్యే అవకాశం లేకపోలేదు. రాకేష్‌రెడ్డికి తొలి నుంచి అతడు చేసే స్థిరాస్థి వ్యాపారంతో పాటు ఇతరత్రా దందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడిన సందర్భంలో కొమ్ముకాసిన ఖాకీల జాబితాను సైతం దర్యాప్తు బృందం వెలికితీసే అవకాశం ఉందని తెలుస్తోంది. నేతల పేర్లు సైతం వెల్లడయ్యే అవకాశముంది.

విపక్ష పార్టీలపై దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్(నల్లకుంట), ప్రభన్యూస్: దేశంలో ప్రతిపక్షపార్టీలపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యానించారు. ఈ దాడులతో పాలించే పార్టీ అసహనం, ఫాసిస్టు ఆలోచనలు స్పష్టమవుతున్నాయన్నారు. పాలించిన అన్ని పార్టీలపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదన్నారు. హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సంఘాల సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అమిత్ షా, నరేంద్రమోడి అతిపెద్ద అవినీతి పరులని అయితే వారి పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి విపక్ష పార్టీలను సహించని స్థితి బెంగాల్‌లో కనపడుతుందన్నారు. వాస్తవానికి దేశంలో పెరిగిపోతున్న అసమానతలు అసంతృప్తులు, హింసలను దాచిపెట్టడానికే అవినీతిని ప్రధాన సమస్య చేస్తున్నారని అన్నారు. ప్రజల అసంతృప్తులను దాచి ఉంచేందుకే ఈ కుట్ర జరుగుతుందన్నారు. సామ్రాజ్యవాదం ప్రతి దేశం మెడకు పాలకులను అవినీతి రొంపిలోకి దించి తన సంపదపై ఆదిపత్యం చేస్తుందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం సీబీఐ, ఆర్‌బీఐ, బ్యాంకు వ్యవస్థ ఇలా ప్రతి వ్యవస్థలను ధ్వంసం చేస్తోందన్నారు.

వంద మంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశం బందీ అయి ఉందన్నారు. విశ్వవిద్యాలయాల మీద జరుగుతున్న దాడులు మరింత పెరిగాయన్నారు. సియాసత్ ఎడిటర్ జహీర్ అలీఖాన్ మాట్లాడుతూ ఈ దేశంలో ముస్లింల ఆదిపత్యం వస్తున్నట్టు మనువాదాన్ని అమలు చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తుందన్నారు. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదం ప్రమాదకరమని అన్నారు. సామ్రాజ్యవాదం అన్ని రంగాలను విడదీస్తున్నారని 92 శాతంగా ఉన్న ప్రజలు ధైర్యంగా ఫాసిజాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో బి. ప్రదీప్, ఎం. వెంకట్రావ్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వి. సంధ్య, వేములపల్లి వెంకట్రామయ్య, అనురాధ, సతీష్‌చందర్ తదితరులు ప్రసంగించారు.

వేటగాళ్లపై ఎన్ని కేసులు పెట్టారు?

● విద్యుత్ కంచె ఎలా వచ్చింది? ● కోర్టుకు వచ్చి జవాబు చెప్పండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్ జోన్ లో పులుల సంరక్షణ వ్యవహారంలో ఈ నెల 7న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరై, వివరణ ఇవ్వాలని అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్, కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ను హైకోర్టు ఆదేశించింది. వేటగాళ్లు బలవంతంగా ప్రవేశించి విద్యుత్ కంచెను అమర్చి పులిని ఎలా హతమార్చారో తెలుసుకోవాలని అనుకుంటున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. ఆ వేటగాళ్లపై ఎన్ని కేసులు నమోదు చేశారని అడిగింది. పులులు సంచరించే ఆ ప్రాంతంలో ఉన్న అనధికార విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో చెప్పాలని అటవీ శాఖాధికారులను ఆదేశించింది. కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్ ను జంతు సంరక్షణ ప్రాంతంగా ప్రకటించారా అని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. పులులు అంతరించి పోకుండా సంరక్షించేందుకు అన్ని రాష్ట్రాల్లోని అభయారణ్యాలకు అవసరమైన సాంకేతికత, ఆర్థిక సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏఎస్ జీ కె.లక్ష్మణ్ నివేదించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్ , జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది. టైగర్ జోన్ లో రోజు రోజుకీ అంతరించిపోతున్న పులులను పరిరక్షించేందుకు విధివిధా నాలను రూపొందించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశిం చాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖ లైంది.

లోకాయుక్త, ఉపలోకాయుక్త భర్తీ ఎప్పుడు..?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త సంస్థలో గత ఏడాది నుంచి ఖాళీగా ఉన్న లోకాయుక్త, ఉపలోకాయుక్త పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో రెండు వారాల్లోగా పూర్తి వివరాలు సమర్పించాలని తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్ ను హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త సంస్థలో ఖాళీ గా ఉన్న లోకాయుక్త, ఉపలోకాయుక్త పదవులను భర్తీ చేసేందుకు వెంటనే తగు చర్యలు చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. విశ్రాంత న్యాయమూర్తులతో లోకాయుక్త, ఉపలోకాయుక్త పదవులను భర్తీ చేయాలంటూ తామిచ్చిన విన్నపాన్ని వెంటనే పరిష్కరించేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. లోకాయుక్తగా విధులు నిర్వర్తించిన జస్టిస్ సుభాషణ్ రెడ్డి డిసెంబర్,2017లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆ సంస్థకు అధిపతి లేకపోవడంతో లోకాయుక్త సంస్థ పనిచేయడం లేదు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న అధికారులపై వచ్చే అవినీతి ఆరోపణలు, అక్రమాలపై విచారణ చేపట్టేందుకు చట్టబద్ధమైన లోకాయుక్త సంస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జస్టిస్ సుభాషణ్ రెడ్డి రిటైరైన తర్వాత లోకాయుక్త గా ఎవరినీ నియమించలేదన్నారు. దీంతో 29.12.2018 నాటికి 5550 ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. అందువల్ల లోకాయుక్త, ఉపలోకాయుక్త లను వెంటనే నియమించేందుకు తగిన చర్యలు తీసుకునేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ...

లోకాయుక్త,ఉపలోకాయుక్త పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో పూర్తి వివరాలతో తమకు రెండు వారాల్లోగా సమర్పించాలని తెలంగాణ అడ్వకేట్ జనరల్ ను ఆదేశించింది.తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామ న్యాయాలయాలకు జీవో జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామీణ ప్రాంతాల్లోని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. హైకోర్టు ప్రతిపాదనల మేరకు వివిధ జిల్లాల్లో 55 గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 4 ను జారీ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అలాగే న్యాయా లయాల ఏర్పాటుకు అవసరమైన నిధులు, సిబ్బందిని కూడా ఆర్థిక శాఖ ప్రత్యేకంగా మంజూరు చేస్తుందని ఆ జీవో పేర్కొంది. దీంతో ఈ ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ ముగించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీ ఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్ కుమా ర్ వాదనలు వినిపిస్తూ..తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి2, 2019న జీవో నంబర్ 4ను జారీ చేసినట్లు నివేదించారు. ఇందుకు అవసరమైన నిధులు, సిబ్బందిని ఆర్థిక శాఖ ప్రత్యేకంగా జారీ చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది ప్రకటనను నమోదు చేసిన ధర్మాసనం ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ ముగించింది.

ఏపీ పోలీసులపై నమ్మకం లేదు..

శిఖాచౌదరిపై దర్యాప్తు చేయండి

జూబ్లీహిల్స్ పీఎస్‌లో మృతుడు జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎక్స్‌ప్రెస్ టీవీ అధినేత, కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ హత్య కేసు దర్యాప్తు చేయడంలో ఏపీ పోలీసులు విఫలమయ్యారని జయరామ్ సతీమణి పద్మశ్రీ సంచలన ఆరోపణ చేశారు. హత్య కేసులో శిఖాచౌదరి ప్రమేయం లేదని దాదాపుగా క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో జయరాం భార్య పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో తన అడ్వకేట్, తండ్రి పిచ్చయ్యచౌదరితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేశారు. జయరాం హత్య హైదరాబాద్‌లోనే జరిగిందని ఇక్కడే విచారణ జరపాలని పద్మశ్రీ పోలీసుల కిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శిఖాచౌదరి, మరో వ్యక్తి కలిసి జయరాం బెడ్‌రూమ్‌లోకి వచ్చి విలువైన వస్తువులు తీసుకెళ్లారని పద్మశ్రీ పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త జయరాంను అత్యంత కిరాతకంగా హత్య చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తెలంగాణ పోలీసుల మీద నాకు అపారమైన నమ్మకం ఉందని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. శిఖాచౌదరి మరో వ్యక్తితో వచ్చి జయరాం బెడ్‌రూమ్‌లో జొరబడి పదెకరాల ల్యాండ్‌కు సంబంధించి, జయరాం కంపెనీలకు చెందిన ఇతరత్రా డాక్యుమెంట్లు తీసుకెళ్లిందని పద్మశ్రీ ఆరోపించింది. శిఖా చౌదరిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేసింది. కేసుని నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని కోరారు. ఒకవేళ శిఖాచౌదరి ప్రమేయాన్ని పోలీసులు నిర్ధారించని పక్షంలో తాను న్యాయపోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. ఏపీ పోలీసులు జయరామ్ హత్యపై సరిగా విచారణ చేయలేదని, ఎవరి ఒత్తిడితోనే పనిచేస్తున్నారంటూ ఆమె ఆరోపించింది.మరోవైపు జూబ్లీహిల్స్ పోలీసులు జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదు అందిందని, విలువైన వస్తువులు పోయాయని తన ఫిర్యాదులో పద్మశ్రీ పేర్కొన్నారని, ఆ దిశగా తాము దర్యాప్తు చేస్తామని అన్నారు.





సేవకుడు కావలెను..!

లండన్: యువరాణి ఎలిజిబెత్ 2 రాజకుటుంబానికి ఓ సేవకుడు కావాలి. అనుభవం కలిగివుండడమే అర్హత. దరఖాస్తు చేసుకున్నవారికి రాజకుటుంబం ఒక పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో విజయవంతమైన వ్యక్తి కొద్దిపాటి శిక్షణ ఇస్తారు. ఎంపికైన వ్యక్తి బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో పని చేయాలి. బల్మోరల్ వంటి ఇతర ప్రదేశాలకు రాజకుటుంబం వెళ్లినప్పుడు వారితోనే ప్రయాణించాలి. ఉన్నతప్రమాణాలతో స్థిరంగా పని చేసే వ్యక్తి కావాలి. అధికారుల మధ్యాహ్న భోజనాలు, విందులు, అధికారిక కార్యక్రమాలకు సేవలు అందించాల్సి ఉంటుంది. ఎంపికైన సేవకుడికి సంవత్సరానికి 19,935 పౌండ్లు చెల్లిస్తారు. అంటే భారతీయ కరెన్సీలో దాదాపు రూ. 18 లక్షలు అన్నమాట. జీతంతోపాటు ఇతర ప్రయోజనాలు కూడా ఉంటాయి. నివాసం కల్పిస్తారు. కానీ జీతంలో కోత ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 17. ఈ మేరకు రాయల్ కుటుంబ అధికారిక వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన ఇచ్చారు. సేవకుడిగా స్థిరపడాలని, రాజకుటుంబంలో పనిచేయాలనుకునేవారు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవచ్చు.

పేరులేని వీధులే కావాలి

బెర్లిన్: వినడానికి కాస్తంత ఆశ్చర్యకరంగా ఉన్నప్పటికీ అక్కడి ప్రజలు పేరులేని వీధులే కావాలని కోరుకుంటున్నారు. పేర్లు పెట్టాలని అధికారులు రెండేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నారు. వ్యతిరేకతలు వ్యక్తమవుతుండడంతో ఈ ఆదివారం ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఓటింగ్ నిర్వహించగా 60 శాతం మంది ఓటర్లు వీధులకు పేర్లు వద్దని తేల్చి చెప్పారు. 40 శాతం మంది అనుకూలంగా ఓటు వేశారు. వాయువ్య జర్మనీలోని హిల్గర్‌మిస్సెన్‌లో ఈ విశేషం చోటుచేసుకుంది. కొన్ని గ్రామాలను కలిసి 1970లో మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. వీధులకు పేర్లు పెడితే పోలీసు, ఇతర అత్యవసర సేవలను సులభంగా అందించవచ్చునని అధికారులు భావిస్తున్నారు. కానీ అధికారుల ప్రయత్నాన్ని స్థానికులు విఫలం చేస్తున్నారు.



పంట కాలనీల బాధ్యత సమన్వయ సమితిలదే!

గ్రామస్థాయిలో రైతుల బహుళ ప్రయోజనాల అమలు బాధ్యతలు వారికే

- ఏప్రిల్ నుంచి సభ్యులకు గౌరవ వేతనాలు
- నెల రోజుల ముందుగానే కార్యాచరణ
- జూన్ నుంచి పంట కాలనీల ఏర్పాటు
- మే నెలలోనే రైతులను సంసిద్ధం చేయాలి
- దేశంలోనే ప్రప్రథమంగా సరికొత్త వ్యవస్థ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది వ్యవసాయ సంవత్సరం నుంచి సీఎం కేసీఆర్ మానస పుత్రిక రైతు సమన్వయ సమితుల వ్యవస్థ పూర్తిస్థాయిలో కార్యరంగంలోకి దిగుతోంది. గ్రామ స్థాయిలో రైతుల బహుళ ప్రయోజనాలకు వారినే బాధ్యుల్ని చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించింది. ఆ మేరకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రైతు సమన్వయ సభ్యులందరికీ గౌరవ వేతనాలు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో వారికి బాధ్యతలు అప్పగించబోతున్నారు. అందుకు నెల రోజుల ముందుగానే వారి చేతికి కార్యాచరణ ప్రణాళిక అందనుంది. జూన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పంట కాలనీలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించినందున సమితి సభ్యులు మే నెల నుంచే రైతులను సంసిద్ధం చేసే పనిలో నిమగ్నం కావాల్సి ఉంటుంది.

సభ్యులకు గౌరవ భృతి

రాష్ట్రంలో వ్యవసాయ సహకారానికి సరికొత్త నిర్వచనాన్ని సూచిస్తూ ప్రభుత్వం నెలకొల్పిన రైతు సమన్వయ సమితి వ్యవస్థ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఫలితాల దిశగా పయనించనుంది. సమితి సభ్యుల సేవలు ఉపయోగించుకుని రైతు తలెత్తుకు బతికేలా చేయాలన్న విశాల దృక్పథంతో ముఖ్యమంత్రి తన ముందుచూపు ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టబోతున్నారు. రైతు సమన్వయ సమితి సభ్యులకు నెలనెలా గౌరవ భృతిని చెల్లించాలని, అందుకోసం కసరత్తు చేయాలని తాజాగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు సమన్వయ సమితి సభ్యులకు రూ.3 వేల చొప్పున గౌరవ భృతిని చెల్లించనున్నారు. మండల రైతు సమన్వయ సమితి సభ్యులకు నెలసరి భృతి రూ. 5 వేలు, జిల్లా సమితి సభ్యులకు రూ. 15 వేలు, రాష్ట్ర సమితి సభ్యులకు రూ. 30 వేల చొప్పున ఇవ్వాలని సీఎం సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో సమన్వయ సమితి చైర్మన్‌గా నియమితులైన గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే కేబినెట్ ర్యాంకు పదవిలో ఉన్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రితో సమానంగా జీతభత్యాలు చెల్లిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 15 మంది చొప్పున రైతు సమన్వయ సమితి సభ్యులను ఇదివరకే నియమించారు. ఆ లెక్క ప్రకారం 1,91,265 మంది సభ్యులున్నారు. దీని ప్రకారం ప్రభుత్వం ఇచ్చే నెలసరి భృతి రూ. 3 వేల చొప్పున లెక్కిస్తే ప్రతినెలా రూ.57.37 కోట్లు అవుతుంది. ప్రతి ఏటా దాదాపు రూ.685 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. 585 మండలాల్లోనూ మండల సమన్వయ సమితి సభ్యులను నియమించారు. ప్రతి మండలంలో 24 మంది చొప్పున మొత్తం 14,040 మంది సభ్యులు ఉన్నారు. వీరికి గౌరవ భృతి నెలకు రూ.7 కోట్లు, సంవత్సరానికి రూ. 84.24 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. జిల్లా స్థాయిలో ఉన్న రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి రూ. 15 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలో 24 మంది సమితి సభ్యులను ఇప్పటికే నియమించారు. ఆ ప్రకారం రాష్ట్రంలో ఉన్న 30 వ్యవసాయ జిల్లాల్లో కలిపి మొత్తం 720 మంది జిల్లా సమితి సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతినెలా చెల్లించే మొత్తం దాదాపు రూ.కోటి దాటుతుంది. ఈ లెక్కన వార్షిక వ్యయం దాదాపు రూ. 12 కోట్లు అవుతుంది. రాష్ట్రస్థాయిలోనూ రైతు సమన్వయ సమితికి 42 మంది సభ్యులను నియమించారు. వీరికి నెలసరి భృతి రూ. 30 వేలుగా సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారు. వీరికి ప్రతి ఏటా దాదాపు రూ.కోటిన్నర గౌరవ భృతి చెల్లించాల్సి వస్తుంది. ఈ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలో తలపెట్టిన పంట కాలనీల పథకాన్ని, రైతు సంక్షేమ కార్యక్రమాలను వచ్చే వ్యవసాయ సంవత్సరం నాటికి వందశాతం విజయవంతం చేయవచ్చునని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఈ పథకం అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటుచేసి బాధ్యతలు అప్పగించారు. దేశంలోనే ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రవేశపెట్టిన ఈ సరికొత్త రైతు సహకార వ్యవస్థలో గౌరవ వేతనాల చెల్లింపు ప్రక్రియను 2019-20 ఆర్థిక సంవత్సరం మొదలుకుని ప్రారంభిస్తారు. అందుకోసం బడ్జెట్‌లో ప్రత్యేక పద్దుగా పేర్కొని నిధులు కేటాయిస్తారు.

నాలుగంచెలుగా రైతులకు సహకారం

వ్యవసాయ రంగం, రైతు కుటుంబాల ఆర్థిక పరిపుష్టికి ముందుచూపు ఆలోచనతో, తనదైన శైలిలో శ్రీకారం చుడుతున్న సీఎం కేసీఆర్ సరికొత్త తరహాలో నాలుగంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. రైతుల పక్షాల ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రభుత్వ పథకాల ద్వారా అన్నదాతలకు లబ్ధి చేకూర్చేలా చూసేందుకు అధికారికంగా నాలుగంచెల్లో రైతు సమన్వయ సమితులను నెలకొల్పారు. గ్రామ స్థాయిలోనే కాకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ ఈ సంఘాలు ఏర్పాటయ్యాయి. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ సభల ద్వారా పదిహేను మంది సభ్యులతో కూడిన కమిటీలను ఎంపిక చేశారు.

సంక్షోభ నివారణే సమితుల లక్ష్యం

వ్యవసాయ రంగం ఎదుర్కొన్న దుర్భిక్షపరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో మెరుగైన వనరులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఉన్నతాధికార యంత్రాంగం నిర్దిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకుంది. చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేసేందుకు సరికొత్త వ్యవస్థ పనిచేయనుంది. రైతు పక్షపాతిగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ఈ వ్యవస్థకు సంబంధించి ఏడాది కాలంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు కసరత్తు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రైతుల అవసరాలపై సమాచారం

ఎప్పటికప్పుడు రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారికి కావాల్సిన సహాయ, సహకారాలకు అందిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను ముందుకు నడిపించేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒక పారదర్శక వ్యవస్థను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. రైతుల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించి వారి కష్టాలు తీర్చేవిధంగా ప్రభుత్వం ముందుచూపు ప్రణాళికతో కార్యరంగంలోకి దిగుతోందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని దేశానికే తలమానికంగా అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పానికి మనందరం మద్దతుగా నిలిచి విజయవంతం చేయాల్సిన బాధ్యతను సమితులకు అప్పగిస్తున్నారు.



కిసాన్ సమ్మాన్‌కు తొలి నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్థికశాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కిసాన్ సమ్మాన్ యోజన పథకం ఉద్దేశాలు, లక్ష్యాలను గురించి వివరించారు. లబ్ధి పొందేందుకు కేంద్రం విధించిన నిబంధనలను కూడా ఈ సందర్భంగా స్పష్టంచేశారు.

కిసాన్ సమ్మాన్ అమలుకు రాష్ట్రంలో అర్హతగల రైతుల జాబితాలు, వారి బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డు నెంబర్లతో సహా పూర్తిస్థాయి వివరాలు తమకు సమర్పించాలని ఈ సందర్భంగా వసుదా మిశ్రా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. అయితే ఈ పథకం ప్రకటించిన వెంటనే రాష్ట్రంలో అర్హులపై ఆరా తీసిన వ్యవసాయశాఖ కేంద్రానికి సమర్పించేందుకుగానూ జిల్లాల వారీగా ప్రత్యేక జాబితాలతో నివేదిక సిద్ధంచేసి ఉంచింది. దీంతో అడిగిందే తడవుగా ప్రభుత్వం కేంద్ర వ్యవసాయ శాఖకు సమ్మాన్ యోజన పథకం అర్హుల జాబితాను అందజేసి దేశంలోనే ప్రప్రథమంగా వివరాలు అందించిన రాష్ట్రంగా గుర్తింపు దక్కించుకుంది. ఈ పథకం అమలుకు కేంద్రం నిధులు కూడా కేటాయించిన నేపథ్యంలో వారం, పది రోజుల్లోనే తెలంగాణ రైతుల ఖాతాల్లో కుటుంబానికి రూ.2వేల చొప్పున నగదు జమ చేయబడుతుందని వ్యవసాయ, ఆర్థిక శాఖల అధికారులు చెబుతున్నారు. పథకం ఉద్దేశాల ప్రకారం మూడు విడతలుగా రూ.6వేలు రైతులకు ఆన్‌లైన్ నగదు బదిలీని చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇచ్చిన నివేదిక ప్రకారం 47.08 లక్షల మంది ఐదు ఎకరాల్లోపు భూమి కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మొదటి విడత నగదు బదిలీకి సంబంధించి రూ.941.53 కోట్లు అవసరమవుతున్నాయి. మొత్తం మూడు విడతలుగా కుటుంబానికి రూ.6వేల చొప్పున రూ.2,824.59 కోట్లు అవసరమని ఆర్థికశాఖ లెక్కలు తేల్చింది. కేంద్రానికి సమర్పించిన నివేదికల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఎకరంలోపు భూమి కలిగి ఉన్న రైతులు 14.86 లక్షల మంది ఉన్నారు. వారికి మొదటి విడత నగదు బదిలీ కోసం రూ.297.16 కోట్లు, మూడు విడతలుగా పథకం ద్వారా లబ్ధి చేకూరే మొత్తం రూ.891.49 కోట్ల నిధులు అవసరం కానుంది. అలాగే ఒకటి నుంచి రెండెకరాల్లోపు భూమి ఉన్నవారు 13.37 లక్షల మంది ఉన్నారు. వారికోసం మొదటి విడత రూ.267.47 కోట్లు, మూడు విడతలు కలిపి రూ.802,40 కోట్లు అవసరమవుతాయి. రెండు నుంచి మూడెకరాల్లోపు భూమి ఉన్న రైతులు 8.96 లక్షల మంది కాగా, వారికి మొదటి విడతగా ఈ నెలాఖరు నాటికి రూ.179.23 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. మూడు విడతలు కలుపుకుని రూ.537.69 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం లెక్కల ప్రకారం రాష్ట్రంలో మూడు నుంచి నాలుగు ఎకరాల భూమి కలిగి ఉన్న రైతుల సంఖ్య 5.75 లక్షలుగా ఉంది. వారికోసం మొదటి విడతగా రూ.115.02 కోట్లు కేంద్రం కిసాన్ సమ్మాన్ యోజన నిధులు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అలాగే మూడు విడతలు కలుపుకుని రూ.345.06 కోట్లు సన్నకారు రైతులకు అందనున్నాయి. నాలుగు నుంచి ఐదెకరాల్లోపు భూమి కలిగి ఉన్న రైతుల సంఖ్య 4.13 లక్షలు ఉండగా, వారికి మొదటి విడత కిసాన్ సమ్మాన్ యోజన పథకం నిధులు రూ.82.65 కోట్లు అవసరమవుతున్నాయి. అలాగే మూడు విడతలు కలుపుకుని రూ.247.94 కోట్లు నగదు బదిలీ ద్వారా రైతులు లబ్ధి పొందనున్నట్లు తెలంగాణ ఆర్థికశాఖ లెక్కలు ప్రకటించింది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుతో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన పథకం అమల్లోనూ అగ్రస్థానంలో నిలిచి ప్రత్యేకతను చాటుకుంటోంది.

రాష్ట్రాలతో సంబంధం లేకుండా 'కిసాన్ సమ్మాన్'

- అలాంటి ప్రతిపాదనలు వచ్చినా తిరస్కరిస్తాం
- నేరుగా రైతు ఖాతాల్లోకి నగదు బదిలీ ముఖ్యోద్దేశం
- రాష్ట్రాల నుంచి కేవలం రైతుల సమాచారం మాత్రమే తీసుకుంటాం
- కిసాన్ సమ్మాన్ కేవలం చిన్న, సన్నకారు రైతులకే
- మీడియాతో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుదా మిశ్రా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోట్లాది మంది రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కిసాన్ సమ్మాన్ పథకం అమలుపై ఇక్కడి అధికారులతో చర్చించేందుకు వచ్చానని కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుదా మిశ్రా తెలిపారు. తమ లక్ష్యానికి సరిపడే పూర్తిస్థాయి వనరులు తెలంగాణలో ఇప్పటికే సిద్ధంగా ఉండడం శుభ పరిణామమని చెప్పారు. సీఎస్ జోషితో సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. రాష్ట్రాల వారీగా రైతుల సమాచారం, వారి భూముల వివరాలు తమవద్ద ఉన్నప్పటికీ తెలంగాణలో ఇప్పటికే అమలవుతున్న రైతుబంధు పంట పెట్టుబడి మద్దతు పథకం నివేదికలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. తెలంగాణ అమలు చేస్తున్న పెట్టుబడి మద్దతు పథకం దేశంలోనే అత్యంత పెద్దదని, ప్రతిష్ఠాత్మకమైనదని వసుదా మిశ్రా తేల్చిచెప్పారు. రైతుబంధుకు, కిసాన్ సమ్మాన్ పథకానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఈ నిధులను వారు సొంతంగా చేస్తున్న పథకాలకు మళ్ళించేందుకు వీల్లేదని, అది తెలంగాణకు కూడా వర్తిస్తుందని స్పష్టంచేశారు. రాష్ట్రాల నుంచి సమాచారం తీసుకుంటామే తప్ప నిధులు ఇవ్వబోమని, లక్ష్యం మేరకు మూడు విడతలుగా రూ.6 వేల మొత్తాన్ని రైతు ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తామని వెల్లడించారు. కుటుంబం యూనిట్‌గా తీసుకుని ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. అందులో భార్య, భర్త, మైనర్ పిల్లలు ఉంటారని తెలిపారు. ఒకవేళ పిల్లలు 18 ఏళ్లు దాటి ఉంటే వారి పేరున వ్యవసాయ భూమి ఉంటే కిసాన్ సమ్మాన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆధార్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు బ్యాంకు ఖాతాల వివరాలు ఉంటే ఈ పథకానికి ఆ రైతు సంపూర్ణ అర్హత కలిగి ఉన్నట్లేనని తేల్చిచెప్పారు. కిసాన్ సమ్మాన్ నిధులను రైతుబంధు పథకంలో విలీనంచేసి లబ్ధి చేకూర్చాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని వసుదా స్పష్టంచేశారు. రాష్ట్రాలతో సంబంధం లేకుండా నేరుగా రైతులకు లబ్ధి చేకూర్చడమే ఈ పథకం ముఖ్యోద్దేశమని ఆమె వెల్లడించారు. వీలైనంత త్వరలోనే దేశవ్యాప్తంగా అర్హతగల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తామన్నారు. అందులో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటుందని చెప్పారు.

కిసాన్ యోజనకు ఓకే..

వసుదా మిశ్రాతో భేటీలో సీఎస్ జోషి స్పష్టీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. ఈ విషయంలో తమవద్ద ఇప్పటికే పూర్తిస్థాయి సమాచారం ఉన్నందున ఇంత ఖచ్చితమైన నమ్మకాన్ని ఇస్తున్నానని ఈ సందర్భంగా మంగళవారం సచివాలయంలో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుదా మిశ్రాతో చెప్పారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా రైతులు, వారి బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డు నెంబర్లు, కుటుంబ సభ్యుల సంఖ్య, వారి వ్యక్తిగత సమాచారం, చర, స్థిరాస్తులు, ఇతర సమాచారం పూర్తిగా సమీకరించి నివేదికలు రూపొందించుకున్నట్లు పేర్కొన్నారు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం మొట్టమొదటిగా అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. పూర్తిస్థాయి పారదర్శకతతో నగదు బదిలీ జరిగేలా చూస్తామన్న నమ్మకాన్ని ఆయన వెలిబుచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, సీసీఎల్ఏ డైరెక్టర్ వాకాటి కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ రిజర్వేషన్లతో ఎవరికీ నష్టం లేదు!

వైశ్య, రెడ్డి సంఘాల సంయుక్త సభలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లకు నష్టం జరగకుండా అగ్రవర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించామని కేంద్ర రవాణా, జాతీయ రహదార్లు, జలవనరుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ చెప్పారు. డబ్భై సంవత్సరాలుగా పేదరికంలో మగ్గుతున్న అగ్రవర్ణాల వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గరీబీహఠావో నినాదం ఇచ్చింది కానీ, పేదలు పేదలుగానే ఉన్నారని విమర్శించారు.

మంగళవారం పబ్లిక్ గార్డెన్‌లో అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధం చేసినందుకు కృతజ్ఞతతో తెలంగాణ ఓసీ సంక్షేమ సంఘం, వైశ్య వికాస సంఘం, రెడ్డి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గడ్కరీ ప్రసంగించారు. భాజపా కుటుంబ పార్టీ కాదని ప్రజల పార్టీ అని అన్నారు. ప్రజల పక్షాన్న నిలిచే పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న భాజపాలో సాధారణ కార్యకర్త పార్టీ అధ్యక్షుడిగా ఎదిగే అవకాశముందని అన్నారు. తాను కూడా కార్యకర్త స్థాయి నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా ఎదిగానని అన్నారు. అలాగే టీ అమ్మిన నరేంద్రమోడీ కూడా పార్టీలో ఉన్నతస్థానానికి ఎదిగి ప్రధానమంత్రి అయ్యారని చెప్పారు. ఈ అభినందన సభకు వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త అధ్యక్షత వహించగా, రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి సముద్రాల వేణుగోపాలచారి, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ ప్రాజెక్టులేమీ ఆపలేదు

తెలంగాణలో 55 ఏళ్ళలో జరగని అభివృద్ధి ప్రధాని మోడీ చేశారు

- రాష్ట్రంలో ఏమూలకు వెళ్ళినా పనులు కనిపిస్తాయి
- పోలవరం ప్రాజెక్టుకు వంద శాతం నిధులు :కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి తనను కోరిన రహదార్లు సహా ఇతర ప్రాజెక్టులేమీ ఆపలేదని కేంద్ర రవాణ, జాతీయ రహదార్ల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ చెప్పారు. ఈ విషయంపై వివరణ కావాలంటే మంత్రి హరీష్‌రావును అడగండన్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, తెలంగాణల మధ్య కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి కెసీఆర్ స్వయంగా తననే కలిసారని చెప్పారు. తెలంగాణలో నీళ్ళ కోసం కేవలం ఎనిమిది రోజుల్లోనే నిధులను మంజూరు చేశామన్నారు. తెలంగాణలో 55 సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి పనులు ప్రధాని మోదీ హాయంలో జరిగిందన్నారు. తెలంగాణలో ఏ మూలకు వెళ్ళినా అభివృద్ధి పనులు కనిపిస్తాయని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలో ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామన్నారు. మొత్తం 99 ప్రాజెక్టుల్లో 66 ప్రాజెక్టులు వచ్చే జూన్‌లో ప్రారంభం కానున్నాయని గడ్కరీ చెప్పారు.

పోలవరం ప్రాజెక్టుకు వంద శాతం నిధులు


పోలవరం ప్రాజెక్టు కోసం వంద శాతం నిధులు కేంద్రమే సమకూర్చుతుందని గడ్కరీ చెప్పారు. నల్లపై ఐదు టిఎంసిల నీళ్ళ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మంత్రులు, అధికారులు జగడం ఆడుకోవడం చూశామన్నారు. దేశ వ్యాప్తంగా నదులను అనుసంధానం చేయాలని మాజీప్రధానమంత్రి వాజ్‌పేయి భావించారని అన్నారు. నదుల అనుసంధానం కంటే ముందు నాన్ హిమాలయ రాష్ట్రాల నదుల నీళ్ళు సముద్రంలో కలవకుండా చూడాలనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు.మంగళవారం సిక్‌విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాల శక్తికేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జుల సన్నాహక సదస్సు జరిగింది.ముఖ్య అతిథిగా గడ్కరీ, అతిథులుగా డాక్టర్ కె. లక్ష్మణ్ సహా పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

అయోమయ రాజకీయాలతో జాగ్రత్త

ప్రజలను అయోమయానికి గురిచేసే రాజకీయాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలని భారతీయ జనతా పార్టీ శ్రేణులను గడ్కరీ హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాను ఆశీర్వదించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళండని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నరేంద్రమోదీపై వ్యతిరేకంగా ప్రతిపక్షాలు జత కట్టాయని విమర్శించారు. ఒకరినొకరు నమస్కారం కూడా చేసుకోలేని వారంతా కూటమి కడుతున్నారని ఆయన ఆక్షేపించారు.

రోజూ 18 కి.మీ. పైనే రోడ్లు

దేశంలో ప్రతీరోజూ 18 కిలోమీటర్ల పైనే రోడ్ల నిర్మాణం జరుగుతుందని గడ్కరీ తెలిపారు. అగ్రవర్ణాల లోని పేదలకు విద్య, ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్లు కల్పించా మన్నారు. ఆయుస్మాన్‌భవ పథకం వలన సుమారు పది లక్షల మందికి వైద్య ప్రయోజనం కలిగిందన్నారు.



"నా ఇల్లు... బీజేపీ ఇల్లు"

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మురళీధర్‌రావు చెప్పారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సన్నాహక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీధర్‌రావు పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 11న సమర్పణ దివాస్, 28న కమలజ్యోతి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇళ్ళలో దీపాల పండుగు నిర్వహిస్తామని చెప్పారు. ''నా ఇల్లు.. బీజేపీ ఇల్లు'' అని దేశ వ్యాప్తంగా ఇళ్ళ వద్ద జెండాల పండుగ నిర్వహిస్తామన్నారు. 1200 మండలాల్లో కోటి మంది కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా మాట్లాడతారని వివరించారు. దేశవ్యాప్తంగా 4100 అసెంబ్లీ నియోజకవర్గాలలో మార్చి 2న మోటారు బైకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కందులు కొనండి సార్!

సీఎంకు రైతు సంఘం లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనగోలు చేస్తున్న కేంద్రాలు కొనసాగించాలని కోరుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్‌రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ మంగళవారం లేఖ రాశారు. కందుల కేంద్రాలను గత ఐదు రోజులుగా మూసి వేయడంతో ప్రైవేట్ వ్యాపారులు కందుల ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు కందులకు రూ. 5,675 మద్దతు ధర ఉండగా.. ప్రైవేట్ వ్యాపారస్థులు క్వింటాలుకు రూ. 4,500 నుంచి 4,800 వరకే చెల్లిస్తున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల హెక్టార్లలో కందిపంట వేయగా దాదాపు 3 లక్షల టన్నుల కందులు దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఇంకా రైతుల వద్ద 1 లక్షక్వింటాళ్ల కందులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందులకు బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

అరుదైన జంతువు వేట.. రూ.78 లక్షల నజరానా

ఇస్లామాబాద్: పాకిస్తాన్ జాతీయ జంతువు, మేక జాతికి చెందిన అరుదైన వన్యప్రాణి మర్ఖోర్‌ను వేటాడిన అమెరికా జాతీయుడికి భారీ నజరానా దక్కింది. అరుదైన వన్యప్రాణిని వేటాడితే నజరానా ఇవ్వడం ఏంటనుకుంటున్నారా... అయితే పూర్తి వివరాలు తెలుసుకోవాల్సిందే. పాకిస్తాన్ ఉత్తర ప్రాంతం గిల్గిత్ బలిస్తాన్‌లో హంటింగ్ ట్రోఫీని అధికారికంగా నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ పరిధి లో ఉన్న మర్ఖోర్‌ను వేటాడాలి. విజేతకు లక్ష పది వేల డాలర్ల(భారతీయ కరెన్సీలో దాదాపు రూ. 78 లక్షలు)ను బహుమతిగా ప్రకటించింది. ఈ ట్రోఫీలో అమెరికాకు చెందిన బ్రయాన్ హర్లాన్ విజేతగా నిలిచాడు. మర్ఖోర్‌ను విజయవంతంగా వేటాడి పట్టుకున్నాడు. దీంతో ఆయనకు భారీ నజరానా దక్కింది. మర్ఖోర్ వేట ట్రోఫీలో ఇదే అత్యధిక బహుమతి కావడం విశేషం. ఈ వేటను ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సమయాల్లో మాత్రమే మర్ఖోర్‌ను వేటాడాలి. ఇతర సమయాల్లో అరుదైన ఈ జాతి జంతువులను వేటాడడం శిక్షార్హం. మర్ఖోర్ ట్రోఫీల నిర్వహణ సంఖ్య పెరిగిపోతోంది. దీంతో జంతువుల సంఖ్య తగ్గుతోందని అధికారులు చెబుతున్నారు. 2018-19 మధ్య కాలంలో మొత్తం 50 ట్రోఫీలను నిర్వహించారని వెల్లడించారు.



వరాహనామ సంవత్సరం

బీజింగ్: డ్రాగన్ దేశం చైనాలో అధికారిక నూతన సంవత్సరం ప్రారంభమయింది. ఫిబ్రవరి 5న ప్రారంభమయిన ఈ నూతన ఏడాది పేరు వరాహనామ సంవత్సరం. చైనీయుల హన్ గువో కాలంలో జ్యోతిష్యశాస్త్రంలో మొత్తం 12 రాశులను సూచించారు. ఈ దాదాపు క్రీస్తుపూర్వం 5వ దశాబ్దం క్రితం ఈ విధానాన్ని ప్రారంభించారు. ఈ రాశులకు 12 జంతువుల పేర్లను పెట్టారు. వ్యక్తి పుట్టిన సంవత్సరాన్ని బట్టి అతడి రాశిని నిర్ణయిస్తారు. అంటే 2019లో పుట్టిన చైనీయుల రాశి పేరు వరాహం అన్నమాట. అదేవిధంగా రాశిని బట్టి వ్యక్తి లక్షణాలు లెక్కగడతారు. వ్యక్తుల అదృష్టాన్ని అంచనా వేస్తారు.1923, 1935, 1947, 1959, 1971, 1983, 1995, 2007, 2019లో జన్మించిన వారి రాశి పంది. దయ, శ్రమ, ఔదార్యాన్ని ఈ రాశి సూచిస్తుంది. ఇబ్బందులను ఎదుర్కొనే సమయంలో ఓర్పు, సంయమనాన్ని పాటిస్తారని ఈ రాశి సూచిస్తుంది.



తెలిసే తప్పు చేశారు



(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. వీలైనంత త్వరగా విద్యార్థులను జైలు నుంచి విడిపించేలా ప్రయత్నిస్తున్నామని ఎడ్వర్డ్ బజాకా చెప్పారు. విచారణ పూర్తయ్యేంత వరకు తెలుగు విద్యార్థులను ఫెడరల్ కస్టడీలోనే ఉంచాలని న్యాయవాది బజాకా వాదించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తిని అభ్యర్థించారు. లేనిపక్షంలో విద్యార్థులను బెయిల్‌పై విడుదల చేయాలని, లేనిపక్షంలో యుఎస్ఐసిఎస్ విద్యార్థులను అరెస్టు చేసే అవకాశముందని అదే జరిగితే విద్యార్థుల యుఎస్ఐసిఎస్ వద్ద కస్టడీ శిక్షలో పరిగణించబడదని చెప్పారు. ఫెడరల్ కస్టడీలో ఉంటే భవిష్యత్తులో శిక్ష పడ్డాక ఫెడరల్ కస్టడీలో ఉన్నకాలంలో మినహాయింపు వస్తుందని అది ఐస్ అరెస్టుచేసే సాధ్యపడదని న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకే తెలుగు విద్యార్థులను ఫెడరల్ కస్టడీకే కోరుతున్నామని కొంత సానుకూలనిర్ణయం వచ్చే అవకాశం ఉందని న్యాయవాది మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చెప్పారు. డిపెండెంట్‌గా ఉన్న ఫణీంద్ర అనే విద్యార్థికి బెయిల్ మంజూరైందని కానీ అతనిని ఐస్ అదుపులోకి తీసుకోలేదని కారణం ఆయనకు హెచ్1-బీ వీసా ఉందని చెప్పారు. విద్యార్థులను అదుపులోకి తీసుకున్న సమయంలో వారికి సంబంధించిన ముఖ్యపత్రాలు, ఫోన్‌కాల్‌లిస్ట్ సేకరించిందని ఆ వివరాలను తమకు ఇవ్వాలని న్యాయవాది కోర్టును అభ్యర్ధించారు. విచారణలో అనేక విద్యార్థుల అంశాలు చర్చకు వచ్చాయని వాటన్నింటిని బహిరంగంగా చెప్పలేమని పేర్కొన్నారు. తిరిగి కోర్టులో విచారణ ఎప్పుడు జరుగుతుందో చెప్పలేమని న్యాయమూర్తి నిర్ణయం మేరకే తేదీ ఖరారు అవుతుందని అన్నారు. ఆటా తెలంగాణ ప్రతినిధి వెంకట్ మంతెన మాట్లాడుతూ, డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న ఎనిమిది మంది తెలుగు విద్యార్థులను విడుదల చేయించడం కోసం కృషి చేస్తున్నామని మా సంస్థ తరఫున ఎడ్వర్డ్ బజాకా తరఫున న్యాయవాదుల బృందాన్ని నియమించామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా విడుదలయ్యేలా తమ తరఫున న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తారని విద్యార్థులను యుఎస్ఐసిఎస్ కస్టడీలోకి తీసుకోకుండా ఫెడరల్ కస్టడీలోనే కొనసాగించాలని తాము న్యాయస్థానాన్ని కోరామని గుర్తుచేశారు. వచ్చేవారం సెకండ్ ట్రయల్ ఉండే అవకాశం ఉందని అందులో మిగిలిన తెలుగు విద్యార్థులకు సానుకూల తీర్పు వస్తుందన్న భావనలో ఉన్నామని చెప్పారు. తెలుగు విద్యార్థులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించేందుకు తమ అసోసియేషన్ సిద్ధంగా ఉందని ఆ దిశగానే న్యాయవాదులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

విద్యార్థులు నేరం చేశారు

ఇదిలా ఉండగా అమెరికాలో నిబంధనలకు విరుద్ధంగా తల దాచుకుంటున్న భారతీయ విద్యార్థులకు తాము నేరం చేస్తున్నట్లుగా స్పష్టంగా తెలుసునని అమెరికా విదేశాంగ శాఖ చెప్పింది. అమెరికాలో అక్రమంగా నివసించేందుకు ఫార్మింగ్టన్ అనే బోగస్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు పొందిన వ్యవహారంలో అరెస్టయిన 129 మంది భారతీయులతో సహా 130 మంది విదేశీ విద్యార్థులకు అమెరికాలో అక్రమంగా నివసించేందుకు వీలుగా చట్టంతో చెలగాటమాడుతున్న విషయం బాగా తెలుసునని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ చెప్పింది. భారతీయ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నందుకు భారత్, అమెరికా రాయబార కార్యాలయానికి డిమార్షె జారీచేసిన కొన్ని రోజుల తర్వాత అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వివరణ ఇచ్చింది. అమెరికాలో తల దాచుకునేందుకు ఒక నకిలీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన వ్యవహారంలో అమెరికా అధికారులు 130 మంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అందులో 129 మంది భారతీయులు కావడం గమనార్హం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ అధికారులు గత బుధవారం వీరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పే అండ్ స్టే ముఠా గుట్టు బయటపెట్టేందుకు గ్రేటర్ డెట్రాయిట్ ప్రాంతంలోని డీహెచ్ఎస్ నిఘా సంస్థ ఒక నకిలీ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన వివరణలో యూనివర్సిటీ ఆఫ్ ఫర్మింగ్టన్‌లో అడ్మిషన్ పొందిన వారందరికీ ఆ విశ్వవిద్యాలయంలో బోధనా సిబ్బంది లేదని, తరగతులు నిర్వహించడన్న విషయం తెలుసునని అయినా అమెరికాలో అక్రమంగా నివసించేందుకు తాము నేరం చేస్తున్నట్లు సంగతి కూడా వారికి తెలిసినా మిన్నకుండిపోయారని చెప్పారు. తాము అదుపులోకి తీసుకున్న విద్యార్థుల కోసం దౌత్యపరమైన వెసులుబాటు కల్పించాలని భారత ప్రభుత్వం కోరిన సంగతి విదితమే. పే అండ్ స్టే వ్యవహారంలో అరెస్టయిన ఎనిమిది మంది భారతీయులను మిషిగన్‌లోని ఫెడరల్ కోర్టులో ప్రవేశపెట్టారు. తాము నిర్దోషులమని వాదించారు. ఫణిదీప్ కర్నాటి, భరత్ కాకిరెడ్డి, సురేష్ కందాలా, ప్రేమ్ రాంపీసా, సంతోష్ సామ, అవినాష్ తక్కళ్లపల్లి, అశ్వంత్ నూనె, నవీన్ ప్రతిపాటిలను తూర్పు మిషిగన్ జిల్లా జడ్జి ఎదుట పోలీసులు హాజరుపరిచారు. కర్నాటి తరఫున న్యాయవాది జాన్‌బ్రూస్ బ్రూస్టర్ వాదించారు. కర్నాటి దగ్గర హెచ్-1బీ వీసా ఉందని ఆయన పదేళ్లుగా అమెరికాలో ఐటి ఇంజనీర్‌గా పనిచేస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు పూర్తయ్యాక దోషులుగా తేలితే ఈ ఎనిమిది మందికి ఐదేళ్ల వరకు శిక్షపడవచ్చని అంచనా వేస్తున్నారు.

లోక్‌సభ బరిలో హార్ధిక్ పటేల్



అహ్మదాబాద్: పటీదార్ రిజర్వేషన్ల ఉద్యమనాయకుడు హార్ధిక్ పటేల్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉంది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో ఉన్న అమ్రేలీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని ఆయన సన్నిహితవర్గాలు వెల్లడించాయి. అయితే ఏదైనా పార్టీ నుంచి పోటీ చెయ్యాలా లేక స్వతంత్రుడిగా బరిలో నిలవాలా అనే నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. గుజరాత్‌లోని మెహసనా, అమ్రేలీలో ఏదో ఒకస్థానం నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ టికెట్ ఆఫర్ ఇచ్చింది. అయితే మెహసనాలో హార్ధిక్‌పై క్రిమినల్ కేసు ఉంది. దీంతో మెహసనా నుంచి పోటీ చేసే అవకాశం లేదని, అమ్రేలీ నుంచి పోటీ చేయడమే ఉత్తమమని పటేల్ సన్నిహితులు పేర్కొన్నారు. ఇదిలావుండగా హార్ధిక పటేల్‌కు టికెట్ ఆఫర్ ఇచ్చామనే వార్తలను గుజరాత్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ అమిత్ చావ్దా ఖండించారు. పటేల్‌కు కాంగ్రెస్ ఆఫర్ ఇవ్వలేదని అన్నారు. పటీదార్ రిజర్వేషన్ల ఉద్యమం అమ్రేలీ జిల్లాలో జోరుగా సాగింది. జనాభా అధికంగా ఉండడంతో రాజకీయంగా ఈ జిల్లాలో పటీదార్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అమ్రేలీ లోక్‌సభ పరిధిలోని అమ్రేలీ, ధరి, బబ్రా, రజులా అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. గుజరాత్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు పరేష్ ధనానీ అమ్రేలీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అమ్రేలీ జిల్లా పంచాయతీ పాలకవర్గంలో కూడా కాంగ్రెస్ చేతిలోనే ఉంది. రిజర్వేషన్లు సాధించేవరకు ఎన్నికల్లో పోటీ చేయబోనని గతంలో హార్ధిక్ పటేల్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



రాలేగావ్ సిద్ధి: లోక్‌పాల్ నియామకం డిమాండ్‌తో వారం రోజులుగా దీక్ష చేపట్టిన అన్నాహజారేను దీక్ష విరమింప చేస్తున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

దీక్ష విరమించిన అన్నాహజారే

రాలేగావ్ సిద్ధి: సామాజిక కార్యకర్త అన్నాహజారే నిరాహార దీక్షను విరమించారు. లోక్‌పాల్ నియామకం కోసం జనవరి 30న రాలేగావ్ సిద్ధిలో అన్నా హజారేదీక్ష చేపట్టారు.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రులు రాధామోహన్, సుభాష్ భమ్రేలతో సుదీర్ఘంగా చర్చలు జరిపిన తర్వాత దీక్ష విరమిస్తున్నట్లు హజారే ప్రకటించారు. తన డిమాండ్ల పరిష్కారానికి హామీ లభించడంతో దీక్ష విరమించినట్లు హజారే తెలిపారు. లోక్‌పాల్ నియామకాన్ని వీలైనంత త్వరగా చేపడతామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తెలిపారు. ఈనె13న లోక్‌పాల్ సెర్చ్ కమిటీ సమావేశమై చర్చిస్తుందని పేర్కొన్నారు. లోక్‌పాల్ చట్టం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచినా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లోక్‌పాల్‌ను నియమించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ హజారే దీక్షకు దిగారు.

కేంద్రానికి సుప్రీం అక్షింతలు

- అసోంలో ఎన్ఆర్‌సీ ప్రక్రియ ప్రభుత్వ నిర్లక్ష్యంపై అసహనం
- కేంద్ర ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- గడువులోగా ముగించాలని ఆదేశం

న్యూఢిల్లీ: అస్సాం నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్(ఎన్ఆర్‌సీ) ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. ఎన్ఆర్‌సీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సహకరించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర హోంశాఖ వ్యవహరిస్తున్న తీరు ఎన్ఆర్‌సీ ప్రక్రియనే ధ్వంసం చేసేలా ఉందని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను కొనసాగించకూడదని ప్రభుత్వం భావిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల నేపథ్యంలో సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) దళాలు అస్సాంలో ఉన్నాయి. రెండు వారాల పాటు ఎన్ఆర్‌సీ ప్రక్రియను నిలుపుదలకు గడువు కోరుతూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. జూలై 31 నాటికి ప్రక్రియను ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. గడువును పొడగించబోమని మరోసారి తేల్చి చెప్పింది. ఎన్ఆర్‌సీ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు మినహాయింపునివ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. అస్సాం రాష్ట్రప్రభుత్వ ఎన్ఆర్‌సీ రాష్ట్ర కోఆర్డినేటర్లు, ఎన్నికల సంఘ అధికారులు ఎన్ఆర్‌సీ ప్రక్రియను వేగంగా కొనసాగించాలని సూచించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ తీర్పునిచ్చింది. ఇదిలావుండగా అస్సాంలోకి పెద్ద సంఖ్యలో బంగ్లాదేశీయులు వలస వచ్చారు. జనాభాలో వీరు అధికంగా ఉన్నారు. వీరి పేర్లను జనాభా నుంచి తొలగించేందుకు డిసెంబర్ 31 నుంచి ఎన్ఆర్‌సీ ప్రక్రియను మొదలుపెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వాస్తవ పౌరులను ఆధారాలతో సహా అధికారులు గుర్తించాల్సి ఉంది.

మిషన్ యూపీ

- ఉత్తరప్రదేశ్‌లో పాగాకు కాంగ్రెస్ వ్యూహం
- సెక్రటరీగా నియమితులైన తర్వాత తొలిసారి రాహుల్‌తో ప్రియాంక భేటీ
- యూపీలో ఎన్నికల ప్రచారం, మెగా ర్యాలీల నిర్వహణపై చర్చ



న్యూఢిల్లీ : ఔరంగజేబ్ రోడ్డులో స్థానికులతో ప్రియాంకా గాంధీ



ప్రియాంక గాంధీకి కేటాయించిన కార్యాలయం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక రాష్ట్రాల్లో పట్టు కోసం కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెంచింది. బీజేపీకి కంచుకోటగా మారిన ఉత్తర్‌ప్రదేశ్‌ను చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇటీవల రాజకీయ రంగ ప్రవేశం చేసిన సోనియా తనయ ప్రియాంక గాంధీ..తొలిసారి సోదరుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయి యూపీ రాజకీయాలపై మంతనాలు జరిపారు. తుగ్లక్ రోడ్డులోని రాహుల్‌గాంధీ నివాసానికి చేరుకుని లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ప్రియాంకతో పాటు ఉత్తరప్రదేశ్ పశ్చిమ విభాగం ఇన్‌ఛార్జి జ్యోతిరాదిత్య సింధియా, యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ కూడా రాహుల్‌తో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలు సాగిన సమావేశంలో తాజా రాజకీయాలు, వచ్చే ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీకి దీటుగా మెగార్యాలీలు

ఎన్నికలకు ముందే ర్యాలీలు, సభలతో దూసుకుపోతున్న బీజేపీకి ధీటుగా యూపీలో మెగార్యాలీలు నిర్వహిస్తే పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం వస్తుందని కొంతమంది నాయకులు వివరించినట్లు తెలుస్తోంది. బీజేపీ వైఫల్యాలను ప్రచారాస్త్రాలుగా వాడుకుని ఎన్నికల బరిలోకి దిగాలని ప్రియాంకకు సూచించినట్లు సమాచారం. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ప్రజలకు వివరించేందుకు 13 భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజక వర్గాలపై ప్రత్యేక శ్రద్ధపెడితే భారీగా ఓటుబ్యాంక్‌ను కొల్లగొట్టవచ్చని కొంత మంది నేతలు సూచిస్తున్నారు.

ఎస్పీ- బీఎస్పీలను తిప్పికొడదాం

80 లోక్‌సభ స్థానాలున్నా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో మెజారిటీ స్థానాలను కైవసంచేసుకుంటే కేంద్రంలో చక్రం తిప్పొచ్చన్నది అన్ని రాజకీయ పార్టీల అభిమతం. ఇదే ధీమాతో అటు కాంగ్రెస్ , ఇటు బీజేపీకి వ్యతిరేకంగా కూటమిని ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్తున్న ఎస్పీ-బీఎస్పీ ప్రణాళికలను దెబ్బతీసేలా వ్యూహాలు రచించాలని రాహుల్-ప్రియాంక భేటీలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కంటే ఓటు షేరింగ్‌లో ఆ రెండు పార్టీలే ముందుండటంతో అఖిలేష్-మాయావతిలకు చెక్ పెట్టేలా ప్రచారం నిర్వహించాలని ప్రియాంక పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రియాంక రాకతో యూపీ కాంగ్రెస్‌లో నూతనోత్సాహం నెలకొందని.. మెగార్యాలీల్లో ప్రియాంక దూకుడుగా వ్యవహరిస్తే ఎస్పీ- బీఎస్పీ,బీజేపీ ఓటు బ్యాంక్ కొల్లగొట్టవచ్చని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ప్రియాంకకు ప్రత్యేక కార్యాలయం

ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన స్వీకరించిన ప్రియాంక గాంధీకి న్యూఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమావేశమందిరాన్ని ఏర్పాటు చేశారు. గతంలో రాహుల్ గాంధీ ఉపయోగించిన కాన్ఫరెన్స్ హాల్‌నే ప్రియాంక గాంధీకి కేటాయించారు. ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అనే నేమ్ ప్లేట్ కూడా పెట్టారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళాలో పాల్గొన్న తర్వాత ప్రియాంక గాంధీ బాధ్యతలను స్వీకరించనున్నారు. మరోవైపు లక్నోలోనూ ప్రియాంక కోసం ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.



నాగోబాకు మహాపూజ

- ఉట్టిపడిన ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు
- మహాపూజ నిర్వహించిన మెస్రం వంశీయులు

ఆదిలాబాద్,ప్రభన్యూస్ బ్యూరో : దక్కన్ పీఠ భూమి గిరిజనులకు ఆరాధ్యదైవమైన నాగోబాకు మెస్రం వంశీయులు అత్యంత భక్తి శ్రద్దలతో మహాపూజ నిర్వహించారు. సోమవారం రాత్రి నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు సంస్కృతి సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమం నిర్వహించి నాగోబా జాతరకు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా , ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో కొలువై ఉన్న నాగోబా ఆలయాన్ని గంగాజలంతో శుద్ధి చేశారు. పక్షం రోజుల క్రితం కాలినడకన గోదావరి నదికి వెళ్లి తీసుకువచ్చిన గంగాజలాన్ని ఆలయ ప్రాంగణంలోని చెట్టుపై ఉంచిన కలుషాన్ని మెస్రం వంశీయులు కొత్త కుండల్లో గోదావరి జలాన్ని ఆలయంలో కి తీసుకువచ్చి ఆలయాన్నంతా శుద్ధి చేశారు. అనంతరం జరిగిన మహాపూజలో పాల్గొన్నారు. నాగోబా సన్నిధిలో భక్త జన సందడి నెలకొని ఉంది. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడ్డాయి. మహాపూజ నిర్వహించిన మెస్రం వంశీయులు తమ ఆరాధ్య దైవానికి పూజలు చేసిన అనంతరం ఇతరులను ఆలయంలోకి అనుమతించారు. ఆదివాసుల సంస్కృతి నుంచి అనాదిగా వస్తున్న ఆచారం మేరకు మెస్రం వంశీయుల కొత్త కోడళ్లను నాగోబా సన్నిధిలో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు నాగోబా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికచింతనతో వారు మ్రోగిపోయింది. ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేవిధంగా మహిళలు పురుషులు పూజా కార్యక్రమానికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టు నుంచి మెస్రం కూతుళ్లు , అల్లుల్లు , కోడళ్లు గంగాజలాన్ని ఆలయానికి తీసుకురావడంలో ఆదివాసుల్లో ఉన్న క్రమ శిక్షణను చాటి చెప్పింది. సంప్రదాయబద్ధంగా వారు కుండల్లో నీరు తీసుకువచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో నాగోబా ఆలయాన్ని శుద్ధి చేశారు. పంటలు పుష్కలంగా పండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ మెస్రం అల్లుల్లు, బిడ్డలు ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టను కొత్తగా ఏర్పాటు చేశారు. మెస్రం వంశీయులు తయారు చేసిన పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా సన్నిధిలో నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. ఆదివాసి సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుని ఉన్న నాగోబా జాతరకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. జాతరకు వచ్చే భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు.



మోడీని ఇందిరతో పోల్చడం అవమానకరం

- ఇందిరది ప్రేమ, ఆప్యాయత మార్గం
- మోడీది ద్వేషం,వివక్ష మార్గం
- రోజుకు రూ.17లు ఇచ్చి రైతును అవమానిస్తారా: మోడీపై రాహుల్ నిప్పులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాని మోడీపై విమర్శలు గుప్పించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీతో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీకి అస్సలు పోలిక లేదని వ్యాఖ్యానించారు. ఇందిరాగాంధీతో నరేంద్ర మోడీని పోలిస్తే ఆమెను అవమానించినట్లేనని రాహుల్ అన్నారు. కొంతమంది మోడీ పరిపాలన శైలిని ఇందిరతో పోలుస్తున్నారని... ఇలాంటి పోలికలు సరైనవి కావంటూ రాహుల్ ఖండించారు. ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు ప్రేమ, ఆప్యాయాలతో తీసుకున్నవని.. ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయాలు ఆగ్రహం, వివక్ష, దేశ ప్రజలను విభజించే విధంగా ఉంటాయని ఆరోపించారు. పేదల ఎన్నడూ ఆలోచించని మోడీ పాలన బ్రిటీష్ పాలనకు అద్దంపడుతుందని వ్యాఖ్యానించారు.

ప్రధాని నరేంద్రమోడీ కూడా చాలా విషయాల్లో ఇందిరాగాంధీని అనుకరిస్తున్నారని... ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు రాజకీయ ప్రత్యర్థులను అణగ దొక్కడంలోనూ ఆయన ఇందిర మార్గానే అనుసరిస్తున్నారని పలువురు రాజకీయ పరిశీలకుల విశ్లేషిస్తున్నారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రోజుకు రూ.17 ఇవ్వడమంటే రైతులను అవమానించడమే. మోడీ ప్రభుత్వం ఈ విధంగా రైతులను వంచించేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ప్రలోభాలు పనిచేయవు.దేశంలో వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో రైతు రుణ మాఫీ అనేది ప్రశ్నే కాదు. ప్రధాని మోడీ 20-25 మంది ఆశ్రిత పెట్టుబడిదారులైన మిత్రుల కోసం రూ. 3.5 లక్షల కోట్లు బ్యాంక్ రుణాలిప్పించారు. రైతులకు వ్యవసాయ రుణం అవసరం. అనిల్ అంబానీకి వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్న మోడీప్రభుత్వం రైతులకు రుణ మాఫీతో సాయం ఎందుకు చేయదు..?

రెండో హరిత విప్లవం సాధ్యమే..

నరేంద్ర మోడీ తన వ్యవహార శైలితోనే వ్యవసాయ సంక్షోభాన్ని తెచ్చిపెట్టారు.కొంత కష్టతరమైన భారత్‌లో రెండో హరితవిప్లవం సాధ్యమే. మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, రైతులకు ప్రభుత్వ సహకారం వంటి వాటితో ఇది సాధ్యమౌతుంది. ఇదంతా ఒక్కరోజులో జరిగే పనికాకపోయినా.. ప్రయత్నిస్తే మంచి ఫలితాలొస్తాయి. కానీ మోడీ ప్రభుత్వం రక్షణ, వ్యవసాయ, మౌలిక రంగాలను ఆశ్రిత పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టింది. మేం అధికారంలోకి వస్తే రైతులను రాజులనుచేస్తాం. ఆర్థిక నిర్మాణంలో రైతుల భాగస్వాములే. సమీకృత వ్యవసాయ పద్ధతులతో మన ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయవచ్చు.

మోడీజీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలేవీ..?

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగంపై స్పందిస్తూ.. పెద్దపెద్ద సంస్థల్లో ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడని మోడీ.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలకు ప్రోత్సాహకాల ద్వారా ఉపాధి పెంచుతున్నామని చెబుతున్నారు. ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు ఏమైంది. చిన్నచిన్న కంపెనీల వాళ్లు ప్రధాని,ఆర్థిక మంత్రిని కలిసే అవకాశం ఉంటుందా..? అనిల్ అంబానీ లాంటి వాళ్లు ప్రధానితో పారిస్ వెళ్తూ వేల కోట్ల రుణాలు పొందు తున్నారు. చిన్న వ్యాపారులు రుణాలు పొందాలంటే బ్యాంకులు సవాలక్ష రూల్స్ చెబుతాయి. దేశంలో 40 మంది ప్రముఖ పారిశ్రామిక వేత్తలు రూ.12లక్షల కోట్లు బ్యాంక్‌లకు మొండి బకాయిదారులుగా ఉన్నారు. దేశం లోని ప్రతీ జిల్లాకు ప్రత్యేక నైపుణ్యాలున్నాయి. ఆయా జిల్లాల నుంచి వచ్చే ప్రత్యేక ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించకుండా..మోడీ స్టార్టప్ ఇండియా అంటున్నారు. ఇంతవరకు ఆయన ఎన్ని స్టార్టప్‌లను ప్రారంభించారు. మీరు ఇంజనీర్లు, లాయర్లను గౌరవిస్తారు కానీ చేతివృత్తుల వారిని ఎందుకు పట్టించుకోరు.

కనీస ఆదాయ పథకంతో అద్భుతాలే..

కనీస ఆదాయ పథకం అద్భుతమైన ఆలోచన. సరిగ్గా అమలు చేస్తే అత్యంత పేదలకు చేయూత నివ్వొచ్చు. కనీస ఆదాయ పథకంపై గత ఆరు నెలలుగా కసరత్తు చేశాం. మోడీకి దేశంలోని సంక్షోభం పట్టదు.దేశంలో ఎంతో ఉద్యోగ కల్పనకు అవకాశాలున్నా.. సరైన ప్రోత్సాహం లేక యువత నిరుత్సాహంతో..తమ భవిష్యత్‌పై స్పష్టత లేకుండా గడుపుతున్నారు. ఇదే ప్రభుత్వంపై ఆ వర్గం ఆగ్రహానికి కారణం. కాంగ్రెస్ పార్టీ యువత ఆవేదనను అర్థం చేసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోంది. తాము అధికారంలోకొస్తే వారి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తామని హామీ ఇస్తున్నాం.

ఎస్పీ- బీఎస్పీ పొత్తుపై..

నేను వ్యతిగతంగా మాయావతి, అఖిలేష్‌ను గౌరవిస్తా. దేశానికి వాళ్లు అద్భుతమైన సేవ చేశారు. ముఖ్యంగా మాయావతి ఎంతో సేవ చేశారు. ఎన్నికల వేళ వారిరువురు పొత్తు మంచిదే. పార్టీల భావజాల పరంగా యూపీలో కాంగ్రెస్, ఎస్పీ- బీఎస్పీ కూటమి మధ్య పోటీ ఉంటుంది. చాలా విషయాల్లో ఆ రెండు పార్టీలతో కాంగ్రెస్ పార్టీ కలిసిపనిచేసిందని రాహుల్ చెప్పుకొచ్చారు.

సిగరెట్ కాల్చాలంటే.. వందేళ్లు దాటాలి!



వాషింగ్టన్: అమెరికాలోని హవాయి రాష్ట్రం ధూమపాన నిషేధానికి అత్యంత కఠిన నిబంధనలు తీసుకొస్తోంది. పొగ తాగడానికి ప్రభుత్వం నిర్దిష్ట వయోపరిమితి పేర్కొనడం సహజం. అది ఒక్కోదేశంలో ఒక్కోలా ఉంటుంది. మన దేశంలో 18 ఏళ్లుండగా, అమెరికాలో 21 ఏళ్ల నిబంధన ఉంది. హవాయి రాష్ట్రంలోనూ ఇదే రూల్. కానీ ఇప్పుడు ఆ పరిమితిని 100 ఏళ్లకు పెంచాలన్న కొత్త బిల్లును తీసుకొస్తున్నారు. రిచర్డ్ క్రీగన్ అనే చట్టప్రతినిధి ఈ బిల్లును ప్రతిపాదించారు. 2024కల్లా మొత్తంగా సిగరెట్‌పై నిషేధం విధించాలన్నది లక్ష్యం. విడతల వారీగా సిగరెట్‌పై నిషేధం విధించాలని క్రీగన్ ప్రతిపాదించారు. వచ్చే ఏడాదికి 30 ఏళ్లకు, 2021లో 40 ఏళ్లకు, 2022లో 50 ఏళ్లకు, 2023లో 60 ఏళ్లకు, 2024లో వందేళ్లకు పెంచాలని క్రీగన్ ప్రతిపాదించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా బిల్లును సిద్ధం చేసినట్లు చెప్పాడు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసమే ఈ విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

హిమాలయాలు ఎడారులే!



న్యూఢిల్లీ: వాతావరణ మార్పులు భవిష్యత్‌లో భయంకర మార్పులకు కారణం కాబోతున్నాయి. మంచు పర్వతాలు సైతం అదృశ్యం అయ్యే ప్రమాదం పొంచివుంది. హిందూకుష్‌పర్వత శ్రేణుల్లో మూడో వంతు గ్లేసియర్లు కరిగిపోనున్నాయి. 2100 సంవత్సరం లోగా మంచుకొండలు అడుగంటుతాయని ఓ సర్వే హెచ్చరించింది. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 సెంటీగ్రేడ్లకు తగ్గించినా హిందూకుష్ పర్వతాల్లోని మంచు మూడవ వంతు కరుగుతుందని ఖాట్మాండుకు చెందిన ఐసీఐఎంవోడీ సంస్థ తన నివేదికలో తెలిపింది. హిమాలయాలతో పాటు కరకోృణం ప్రాంతాల్లో సగటున 0.7 శాతం ఉష్ణోగ్రతలు పెరుగుతాయని సర్వే వెల్లడించింది. సుమారు 350 పరిశోధకులు, నిపుణులు, విధానకర్తలు హిందూకుష్‌పై ముసాయిదాను తయారు చేశారు. మొత్తం 8 దేశాల్లో హిందుకుష్ పర్వతాలు ఉన్నాయి. సుమారు 3500 కిలోమీటర్లు వ్యాపించి ఉంటాయి.

సీపీని షిల్లాంగ్‌లో ప్రశ్నించండి..

కోల్‌కతా సీపీ రాజీవ్‌ను అరెస్టు చేయొద్దు..

వివాదాలు ఆపి.. విచారణ ప్రారంభించండి

శారదా చిట్ స్కాంలో సీబీఐ, కోల్‌కతా పోలీసులకు సుప్రీం ఆదేశం

- సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపై మమత హర్షం
- ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణన..దీక్ష విరమణ
- రాజీవ్‌పై వేటుకు సిద్ధమైన కేంద్ర హోంశాఖ
- క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని బెంగాల్ సర్కార్‌కు లేఖ



న్యూఢిల్లీ: శారదా చిట్ ఫండ్ కుంభకోణం కేసు విచారణపై సీబీఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఈ కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రశ్నించవచ్చని స్పష్టం చేసింది. విచారణ పేరుతో అరెస్ట్ మాత్రం చేయవద్దని సూచించింది. కేసు విచారణకు రాజీవ్ కుమార్ కూడా సీబీఐకి సహకరించాలంటూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అనవసర వివాదాలకు పోకుండా కేసు విచారణను పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేసిన కోర్టు.. విచారణకు మేఘాలయ రాజధాని షిల్లాంగ్ సీబీఐ కార్యాలయానికి హాజరుకావాలని కోల్‌కతా సీపీని ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు హాజరుకాకుండా ఉండేందుకు రాజీవ్ కుమార్ ఎలాంటి కారణాలు చూపలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక వేళ శారదా చిట్ ఫండ్ స్కాంకు సంబంధించిన కీలక ఆధారాలను సీపీ రాజీవ్ కుమార్ నాశనం చేశారని తేలితే ఆయనపై కఠిన చర్యలు తీసుకునేలా తామే ఆదేశిస్తామని స్పష్టం చేసింది. సీబీఐ విచారణకు రాజీవ్ పూర్తిగా సహకరిస్తారని తాము భావిస్తున్నట్లు వెల్లడించింది.

సీబీఐ అధికారుల నిర్బంధమేల..?

సీబీఐ తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్,సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాజీవ్ కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ సీబీఐ విచారణకు సహకరించడం లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శారదా చిట్ ఫండ్ స్కాంపై సీబీఐ దర్యాప్తు చేస్తుండగా.. గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న కోల్‌కతా సీపీ ఈ కేసుకు సంబందించిన వివరాలను సీబీఐతో పంచుకునేందుకు ఇష్టపడటం లేదని తెలిపారు. సీపీని విచారించేందుకు కోల్‌కతాలోని ఆయన నివాసానికి వెళ్లిన 25 మంది సీబీఐ అధికారులను అక్కడి పోలీసులు బలవంతంగా బస్సులో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారని వివరించారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్ వికాస్ సింగ్ నివాసాన్ని కూడా బెంగాల్ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొవడం గర్హనీయమైన చర్యగా పేర్కొన్నారు.

సీపీ సహకరించినా కక్ష సాధింపు చర్యలా..?

పశ్చిమ బెంగాల్ పోలీసుల తరపున న్యాయవాది అభిషేక్ మను సింగ్వీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ.. అటార్నీ జనరల్ వ్యాఖ్యలను ఖండించారు. కోల్‌కతా పోలీసులను వేధించేందుకే కేంద్ర ప్రభుత్వం సీబీఐని వాడుకుంటోందని ఆరోపించారు. చిట్‌ఫండ్ స్కాంపై విచారణకు ఏర్పాటు చేసిన సిట్ కు ప్రస్తుత కోల్‌కతా సీపీ సారథ్యం వహించారని.. విచారణ నిస్పక్షపాతంగా జరిగినట్లు నాడు సర్వోన్నత న్యాయస్థానమే కితాబిచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసుకు సంబంధించిన లింక్‌లు వివిధ రాష్ట్రాల్లో ఉండొచ్చనే సీబీఐకి బదిలీ చేసిన విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో సీపీపై ఇంతవరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదుకాలేదని.. సీబీఐకి సీపీ సహకరించారని గతంలోనే డీజీపీ 5 లేఖలు రాసిన విషయాన్ని గుర్తు చేశారు. శారదా చిట్ ఫండ్ స్కాం విచారణలో భాగంగా సీబీఐ అధికారులు ఎప్పుడైనా తన కార్యాలయానికి రావొచ్చని రాజీవ్ కుమార్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కోల్‌కతా సీపీ తప్పనిసరిగా సీబీఐ విచారణకు హాజరుకావాలన్న ప్రభుత్వ వాదనను మీరెందుకు వ్యతిరేకించడం లేదని ధర్మాసనాన్ని ప్రశ్నించారు. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం వివాదానికి గల పూర్వపరాలు గురించిన వివరాలను ఈ నెల 18 లోగా తెలియజేయాలని పశ్చిమబెంగాల్ డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది..

సీపీపై క్రమశిక్షణా చర్యలు..?

కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్‌పై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీపీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మమతా బెనర్జీతో పాటు సీపీ రాజీవ్ కుమార్ కూడా ధర్నాలో కూర్చున్నట్లు తమకు సమాచారం అందిందని.. ఇలాంటి విషయాలు ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమని స్పష్టంచేసింది. అఖిల భారత సర్వీసుల ప్రవర్తనా నియమావళికి ఇలాంటివి విరుద్ధమని హోంశాఖ తన లేఖలో పేర్కొంది.

ఆ గూండాలను తరిమికొడతాం

ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని పురూలియా బీజేపీ ర్యాలీలో యోగి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ గూండాలను తరిమికొట్టండంటూ పిలుపునిచ్చారు. మమత ప్రభుత్వం పేదల సొమ్మును దోచుకుంటోందని ఆరోపించిన యోగి.. అవినీతిపరుడైన అధికారి(కోల్‌కతా సీపీ)ని కాపాడేందుకు మమత ధర్నాకు కూర్చోవడంతోనే అసలు విషయం అర్థమైందన్నారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే టీఎంసీ గూండాల పనిపడతామని వ్యాఖ్యానించారు. యోగి వ్యాఖ్యలపై మమత స్పందిస్తూ.. సొంత రాష్ట్రం యూపీని చక్కబెట్టుకోలేని యోగి బెంగాల్‌లో ఎందుకు చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు.

ఫెడరల్ ఫ్రంట్ నిర్మాత మమత

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దీక్ష విరమణ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.మోడీవి విభజన రాజకీయాలను ఆరోపించిన బాబు.. ఇలాంటి వారి చర్యలను తిప్పికొట్టేందుకు విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణంలో మమతా బెనర్జీ మెయిన్ పిల్లర్ అన్న బాబు.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని 42 స్థానాలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సీబీఐ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన చంద్రబాబు మోడీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు 23 ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపై నడుస్తాయని చెప్పారు.

బీజేపీ, తృణమూల్ దొందూ దొందే



అవినీతి విషయంలో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని సీపీఎం సీనియర్ నాయకుడు సీతారాం ఏచూరి ఆరోపించారు. బీజేపీ అవినీతి చిట్టా వ్యాపం నుంచి రాఫెల్ వరకు ఉందని అన్నారు. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి ఆర్థిక నేరగాళ్లు విదేశాలకు పారిపోయేందుకు సహకరించారని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటోందన్నారు. ఇప్పటికే పలువురు టీఎంసీ నేతలు అరెస్టై బెయిల్‌పై ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.దేశ ప్రజలను దోచుకోవడంతో ఆ రెండూపార్టీల నేతలకెవరూ తీసిపోరని వ్యాఖ్యానించారు.

మమత దీక్ష విరమణ



కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను అరెస్ట్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్వాగతించారు. ధర్మాసనం నిర్ణయం తమ నైతిక విజయంగా అభివర్ణించారు.మోడీకి వ్యతిరేకంగా వెళ్లేందుకు ఎవరూ సాహసించకున్నా.. రాజ్యాంగాన్ని కాపాడే ఉద్దేశంతో తాము ఐక్యపోరాటానికి శ్రీకారం చుట్టామన్నారు. మేమెప్పుడూ చట్టాన్ని గౌరవిస్తాం. ప్రజాస్వామ్య మూలాలను నాశనం చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే పోరాటం చేస్తాం.

శారదాచిట్ ఫండ్ స్కాంలో సీబీఐ విచారణకు బెంగాల్ పోలీసులు మొదటి నుంచి సహకరిస్తూనే ఉన్నారని...రాజకీయ కక్ష సాధింపుతోనే మోడీ ప్రభుత్వం సీబీఐని వాడుకుంటోందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత తన దీక్షను విరమిస్తున్నట్లు మమత ప్రకటించారు. మమత దీక్షను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విరమింపజేశారు.ప్రజలను బ్లాక్ మెయిల్ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటోందని ఆరోపించారు. సీబీఐ అంటే తనకెంతో గౌరవముందన్న మమత.. వివిధ కేసుల విచారణను మరింత వేగవంతం చేయాలని కోరారు. మమల్ని చూసి బీజేపీ ఎందుకు భయపడుతోంది.. వైరివర్గాలను దారిలోకి తెచ్చుకునేందుకు ఇలాంటి మార్గాలను అన్వేషిస్తారా.. మోడీజీ రాజీనామా చేసి గుజరాత్ వెళ్లిపోండి..అని విరుచుకుపడ్డారు.



పార్లమెంట్‌ను కుదిపేసిన బెంగాల్ పంచాయితీ

రాజ్యసభలో ముందుకు సాగని కార్యకలాపాలు

సీబీఐ వ్యవహారంపై వెల్‌లో టీఎంసీ నిరసనలు

లోక్‌సభలో సభ్యుల ఆందోళన నడుమ రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ

సభ నుంచి టీఎంసీ ఎంపీల వాకౌట్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పశ్చిమ బెంగాల్ వ్యవహారం వరుసగా రెండో రోజు ఉభయసభలను కుదిపేసింది. సీబీఐతో ప్రతిపక్షాల కక్ష్యసాధింపునకు దిగుతున్నారని టీఎంసీ ఎంపీలు ఉభయసభల్లో ఆందోళనకు దిగారు. దీంతో ఉభయ సభలు పదేపదే వాయిదా పడ్డాయి. లోక్‌సభ జీరో అవర్, ప్రశ్నోత్తరాల కార్యక్రమాలు ముందుకు సాగలేదు. మంగళవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే టిఎంసి ఎంపీలు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టిముట్టారు. సీబీఐ కేంద్రం పంజరంలోని చిలుక అంటూ నినాదాలు చేశారు. సభ్యులు శాంతించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఎంపీలు వినిపించుకోకపోవడంతో సభను పలు సార్లు వాయిదా వేశారు. మధ్యాహ్నం తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చను చేపట్టారు. బీజేపీ ఎంపీ హుకుందేవ్ నారాయణ్‌యాదవ్ ఈ చర్చను ప్రారంభించారు. అయితే చర్చకు టీఎంసీ ఎంపీలు పదే పదే అడ్డు తగిలారు. అయితే వీరి నినాదాల మధ్యనే కొంత సేపు ఆయన ప్రసంగాన్నికొనసాగించారు. టీఎంసీ ఎంపీలు ఆందోళన కొనసాగిస్తుండడంతో సభను స్పీకర్ మరోసారి వాయిదా వేశారు. అయితే సభను బుధవారానికి వాయిదా వేయాలని, సభ సజావుగా కొనసాగేందుకు సహకరిస్తామని టీఎంసీ పక్ష నేత సుదీప్ బంధోపాధ్యాయ స్పీకర్‌కు తెలిపారు. పశ్చిమబెంగాల్ వ్యవహారంపై హోంమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఇతర పార్టీల ఎంపీలు తీర్మానంపై మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు ఎలా వాయిదా అడుగుతారని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దాంతో టీఎంసీ ఎంపీలు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగింది.



దేశంలో అవినీతిని అరికట్టి, మధ్య దళారీ వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్మూలించారని బీజేపీ ఎంపీ హుకుందేవ్ నారాయణ్ యాదవ్ అన్నారు. మధ్య దళారులే మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. జన్‌ధన్ ఖాతాలతో నేరుగా ప్రభుత్వ పథకాలు లబ్దిదారుల ఖాతాల్లో చేరుతున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. తన లాంటి అత్యంత నిరుపేద వర్గాల నుంచి వ్యక్తులకు పద్మభూషణ్‌తో సత్కరించారని చెప్పారు.వచ్చే ఎన్నికల్లో తిరిగి నరేంద్రమోడీ ప్రభుత్వానికి దేశ యువత పట్టం కడుతుందని అన్నారు. పెద్దపెద్ద బంగాళాల్లో నివసించేవారే మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. పేద ప్రజలంతా నరేంద్రమోడీ పాలనలో సంతోషంగా ఉన్నారని అన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన ఏకరువు పెట్టారు. రైతులకు ఆరువేల రూపాయలిచ్చి ఆదుకుంటోందన్నారు. అయితే రైతులకు ప్రకటించిన ఆరువేల రూపాయల వల్ల రైతులకు దీర్ఘకాల ప్రయోజనం ఉండదని బీజేడీ ఎంపీ భర్తృ హరి మెహతాబ్ అన్నారు.

పశ్చిమ బెంగాల్ వ్యవహారంపై రాజ్యసభలో కార్యక్రమాలు స్తంభించిపోయాయి. సభ ప్రారంభం కాగానే టిఎంసి ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. కేంద్రానికి, సిబిఐకి వ్యతిరేకంగా టిఎంసీ ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో సభ తొలుత మధ్యాహ్నం రెండింటికి ఆ తర్వాత బుధవారానికి వాయిదా పడింది.

సీమకు ప్రత్యేక ప్యాకేజీ

రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఎంపీ బుట్టా రేణుక అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన లేపోవడం శోచనీయమన్నారు. రాఫెల్ వివాదంపై జేపీసీ వేయాలన్నారు.మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు.

నియంతృత్వానికి రోజులు దగ్గరపడ్డాయ్

మోడీపై టీడీపీ ఎంపీల విమర్శలు.. జంతర్ మంతర్ వద్ద ఎంపీ మాగంటి దీక్ష



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ తెలుగు దేశం పార్టీ ఎంపీలు దేశ రాజధానిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత పార్లమెంట్ ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన ఎంపీలు, ప్రత్యేకహోదా తమ హక్కంటూ నినదించారు. అనంతరం 1వ నెంబర్ గేట్ దగ్గర ఎంపీలు లోపలకు వెళ్లే మార్గాన్ని అటకాయిస్తూ కాసేపు ఆందోళన చేశారు. అనంతరం అక్కణ్ణుంచి ఎంపీలంతా జంతర్ మంతర్ దీక్షా స్థలికి చేరుకున్నారు. పుట్టిన రోజు సందర్బంగా ఏలూరు ఎంపీ మాగంటి వెంకటేశ్వర రావు (బాబు) దీక్ష చేపట్టాలని ముందే నిర్ణయించుకున్నారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం గతంలో పుట్టినరోజు నాడు దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అదే బాటలో తాజాగా ఎంపీ కే. రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ ఆవరణలోనే తన పుట్టినరోజు నాడు దీక్ష చేశారు. ఇప్పుడు మాగంటి బాబు కూడా వారి బాటలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఆయన దీక్షకు మద్ధతుగా సొంత నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది నేతలు, అభిమానులు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకున్నారు. దీంతో దీక్షా స్థలం జనంతో కిక్కిరిసిపోయింది. మిగతా ఎంపీలు అక్కడికి చేరుకోవడంతో మరింత ఆవేశంతో బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు, రామ్మోహన్ నాయుడు, బుట్టా రేణుక తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

సుప్రీం తీర్పు మమతకు చెంపపెట్టు : జీవీఎల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సీబీఐ విచారణను అడ్డుకుంటున్న వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బెంగాల్ సీఎం మమత బెనర్జీకి చెంపపెట్టులాంటిదని భారతీయ జనతా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహా రావు వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్లో మీడియాతో మాట్లాడిన జీవీఎల్, కోర్టు తీర్పుతో మమత నాటకానికి తెరపడిందని అన్నారు. త్వరలోనే చంద్రబాబు సైతం భంగపడక తప్పదని జీవీఎల్ అన్నారు. మరోవైపు సభా హక్కుల ఉల్లంఘన నోటిసీలుపై కూడా జీవీఎల్ నరసింహారావు స్పందించారు. బీజేపీ సభ్యులను సీఎం బెదిరించడంపై తాము నోటీసులు ఇస్తామన్న భయంతోనే టీడీపీ నేతలు తనపై నోటీసులిస్తున్నారని వివరించారు. తాను అసెంబ్లీ మొత్తాన్ని ఎక్కడా తప్పుబట్టలేదని, సభా నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రి మాట్లాడిన తీరుపై మాత్రమే స్పందించానని వెల్లడించారు. తనకు నోటీసు పార్లమెంట్ ద్వారానే ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

థాక్రేతో ప్రశాంత్ కిషోర్ భేటీ

ముంబైలోని థాక్రే నివాసంలో సమావేశం.. శివసేన గెలుపునకు సహకారం!

రాజకీయ ప్రాధాన్యం లేదన్న శివసేన ఎంపీ.. భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చ



ముంబై: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. చర్చలు, భేటీలు, పొత్తులు, వ్యూహాలు, విమర్శ, ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిం చాయి. ఇదేకోవకు చెందిన మరో ఆసక్తికరమైన భేటీ మంగళవారం జరిగింది. ఎన్నికల వ్యూహకర్త, జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంతి కిశోర్ శివసేన అధ్యక్షుడు ఉద్దవ్ థాక్రేను ఆయన నివాసంలో కలిశారు. థాక్రే ఇంట్లో మధ్నాహ్న భోజనం చేశారు. ఉద్దవ్ థాక్రే కుమారుడు ఆదిత్యథాక్రే కూడా వీరి భేటీలో పాల్గొన్నారు.

ఈ భేటీ ముగిసిన తర్వాత.. ప్రత్యేక సందర్శకుడు వచ్చారని ఆదిత్యథాక్రే ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అర్థవంతమైన చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ముంబైలోని ఉద్దవ్ థాక్రే నివాసం మాతోశ్రీలో ముగ్గురు కూర్చున్న ఓ ఫొటోను కూడా జతచేశారు. ఆదిత్య థాక్రే ట్వీట్‌కు ప్రశాంతి కిశోర్ రిప్లై ఇచ్చారు. అధ్బుతమైన అతిథ్యమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌డీఏలో భాగస్వామైన శివసేనకు మహారాష్ట్రలో గెలుపునకు చేతులు కలపాలని చూస్తున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు తర్వాత కూడా సహకారం అందిస్తామని తెలిపారు.

మర్యాదపూర్వక భేటీ

ఉద్దవ్ థాక్రే, ప్రశాంత్ కిశోర్ మధ్య జరిగిన భేటీ మర్యాదపూర్వకమైనదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. ఎన్‌డీఏలో భాగమైన పార్టీ నాయకుడు కావడంతో ఉద్దవ్ థాక్రేను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారన్నారు. మర్యాదపూర్వక సమావేశంగానే పరిగణించాలని, రాజకీయ కోణంలో చూడవద్దని ఆయన అన్నారు.

మహారాష్ట్రలో శివసేన గెలుపునకు కృషి చేస్తానని ప్రశాంత్ కిశోర్ హామీ ఇచ్చారని వార్తలు వెలువడుతున్నాయి. బీజేపీ, శివసేన పొత్తు సఖ్యతను పునరుద్ధరణకు మధ్యవర్తిగా వ్యవహరించేందుకు ఆయన నిరాకరించారని పేర్కొంటూ విశ్లేషణలు వెలువడుతున్నాయి. శివసేన పార్టీ ప్రచారాన్ని మాత్రమే ప్రశాంత్ కిశోర్ బృందం చేపట్టనుందని, బీజేపీకి సహకారం అందించరని చెబుతున్నారు. ఎన్‌డీఏలోని బీజేపీయేతర పార్టీలు తమ పరపతిని చాటుకునేందుకు ఒక్కటవుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వ్యూహంలో భాగంగానే శివసేన చీఫ్‌తో ప్రశాంత్ కిశోర్ భేటీ అయ్యారని లెక్కలు కడుతున్నారు.

ఇంగ్లండ్‌తో సిరీస్ తర్వాత..
టీ20 లనుంచి మిథాలీ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: సీనియర్ మహిళా క్రికెటర్ వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ టీ20 అంతర్జా తీయ మ్యాచ్‌లనుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించింది. భారత్‌లో పర్యటించనున్న ఇంగ్లం డ్‌తో జరిగే టీ20 సిరీస్ తర్వాత రిటైర్మెంట్ తీసుకోనున్నట్లు మిథాలీ ప్రకటన చేసింది. భారత్‌లో ఇంగ్లండ్ పర్యటన మార్చి 4న ప్రారంభం కానుంది. ఈ మేరకు బీసీసీఐ అధికారి ఒకరు మంగళ వారం మీడియాకు వెల్లడించారు. అయితే 50 ఓవర్ల ఫార్మాట్లో కొనసాగ నున్నట్లు మిథాలీ తెలిపింది. ప్రస్తుతం మిథాలీ న్యూజిలాండ్‌తో టీ 20 సిరీస్ ఆడే జట్టులో సభ్యురాలుగా కొనసాగుతోంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో చివరి 11మంది క్రీడాకారిణుల్లో మిథాలీ ఉంటుందా అన్నది అనుమా నమే. 2020 టీ20 ప్రపంచ కప్ దృష్ట్యా పటి ష్టమైన జట్టును రూపొందించేందుక ు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దృష్టి పెట్టిన నేపథ్యం లో.. మిథాలీ తన రిటైర్మెంట్‌ను ప్రక టించిందని బీసీసీసీ అధికారి తెలిపాడు. మిథాలీ టీ20ల్లో ఇప్ప టివరకు 85 మ్యాచు లాడి 2283 పరు గులు చేసింది. ఇందులో 17 అర్ధ సెంచరీలు న్నా యి. ఆమె అత్యధిక స్కోరు 97.





ఆస్ట్రేలియాలో గెలిచి న్యూజిలాండ్‌లో జైత్ర యాత్ర చేస్తున్న టీమిం డియా, నేటి నుంచి కివీస్ జట్టుతో టీ20 సిరీస్‌ను ఆడనుంది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 2008-09లో ఆడిన ఒకే ఒక్క టీ20 సిరీస్‌లో 0-2తో ఆతిథ్య దేశానికి కోల్పోయింది. ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ నేతృత్వంలోని జట్టు అప్పటి ఓటమికి బదులు తీర్చుకుంటామని ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్ క్రికెట్ అభిమానులను అలరిస్తుందన టంలో సందేహం లేదు.

మ.12:30 నుంచి ప్రారంభం

పొట్టి ఫార్మాట్లో తేల్చుకుందాం

• నేడు భారత్- న్యూజిలాండ్ తొలి టీ20 మ్యాచ్ • సిద్ధమైన ఇరు జట్లు

ప్రపంచ కప్ బెర్త్‌లుఖాయమైనట్లే?

ఇటీవల న్యూజిలాం డ్‌తో ముగిసిన వన్డే సిరీస్, 2019 ప్రపంచకప్‌లో ఆడనున్న భారత జట్టు 15మంది ఆటగాళ్ల ఎంపి కకు మార్గం సులభ తరం చేసింది. అయినప్ప టికి.. మరి కొన్ని స్థానాలకోసం ఆటగాళ్లను సెలెక్టర్లు పరిశీలిస్తున్నా రు. వన్డే సిరీస్ జట్టులో లేని యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ టీ20 సిరీ స్‌కోసం జట్టులోకి తిరిగి వచ్చాడు. వరల్డ్ కప్ జట్టులో స్పాట్ కోసం తానూ.. బరిలో ఉన్నానని స్పష్టం చేయను న్నాడు. ఆస్ట్రేలియా తో సిరీస్‌కు విశ్రాంతిని చ్చిన వెటరన్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీకి న్యూజిలాండ్ పర్య టనలో అవకాశమి చ్చా రు. ధోనీ చివరి సారిగా గత ఏడాది జులైలో టీ20 లో ఆడాడు. టెస్ట్ సిరీస్ లో అద్భుతమైన ఆటను ప్రదర్శించిన పంత్ ఈ పొట్టి ఫార్మాట్లో తన ప్రతా పాన్ని చూపాలని ఎదురు చూస్తున్నా డు. అంతేకాక ఈ సిరీస్ మరో వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ దినేష్ కార్తీక్‌కు కూడా అవకా శం కల్పిస్తున్నది. మ్యాచ్ ఫినిషర్‌గా కొన్ని సార్లు మెరిసిన కార్తీక్ తొలి టీ20లో చివరి 11మంది ఆటగాళ్లలో ఉంటాడన్న ది అనుమా నమే. అంబటి రాయుడు న్యూజి లాండ్‌తో చివరి వన్డేలో 90 పరు గులు చేసిమ్యాచ్ గెలవడంలో కీలక భూమి క పోషిం చాడు. ప్రపంచకప్ జట్టు లో రాయుడు మిడిలార్డర్‌లో తన స్థానం ఖాయం చేసుకున్నట్లే అని చెప్పవ చ్చు. రాయుడు టీ20 సిరీస్‌కు ఎంపిక కాలే దు. 19ఏళ్ల శుభ్ మన్ గిల్ క ూడా కివీస్‌తో చివరి వన్డేలో కీలకమైన ఆటను ప్రదర్శిం చాడు. కోహ్లీ జట్టులో లేకపోవడంతో నెంబర్ త్రీ బ్యాట్స్ మన్‌గా గిల్ మళ్లీ బరిలోకి దిగడా నికి వందశా తం అవకాశాలు న్నాయి. టీ20 జట్టు లో చేరిన వారిలో పంత్‌తో పాటు, కృణాల్ పాండ్యా, పంజాబ్ పేసర్ సిద్ధార్ధ్ కౌల్ ఉన్నారు. సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, లేకపో వడంతో వన్డే సిరీస్‌లో అవకా శం పొందిన మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్ అంతగా తమ పటిమను చూపలే క పోయా రు. బ్యాట్స్‌మెన్‌లో ధావన్ కివీస్ తో వన్డే సిరీస్‌లో రాణించలేదు. టీ20 సిరీస్‌లో రాణించి పర్యటన ను విజ య వంతంగా ముగించాలని కోరుకుం టు న్నాడు. ఇందుకోసం టెన్నిస్ బంతితో బ్యాటిం గ్‌ను ప్రాక్టీస్ చేస్తు న్నాడు. ముఖ్యంగా స్వింగ్ బౌలిం గ్‌ను ఎదుర్కోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

గెలిచి తీరాలన్న పట్టుదలతో న్యూజిలాండ్

వన్డే సిరీస్‌లో ఘోరంగా పరాజయంపాలైన ఆతిథ్య న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లోనైనా గెలిచి పరువు దక్కించు కోవాలని ఆశిస్తోంది. ఇప్పటివరకు న్యూజిలాండ్ గడ్డపై 2008-09 లో ఇరు జట్లు మధ్య ఒకేఒక్క టీ20 సిరీస్ జరుగగా.. న్యూజిలాండ్ 2-0తో గెలిచింది. 2017-18లో న్యూజిలాండ్ భారత్‌లో పర్యటించిన సమయంలో భారత్ 2-1తేడాతో సిరీస్‌ను గెలుచుకుంది. ఆదివారం జరిగిన వన్డే మ్యాచ్‌లో వెస్ట్‌పాక్ పిచ్ ప్రారం భం లో స్వింగ్‌కు అనుకూ లిం చినప్పటికి..అనంతరం బ్యాటింగ్‌కు అనుకూలం గా మారింది. మరోవైపు కివీస్ పేసర్ ట్రెంట్ బోల్ట్‌కు విశ్రాంతినిచ్చారు. తొలిసారిగా తన అంతర్జా తీయ కెరియర్‌ను ప్రారంభించనున్న డేరిల్ మిచెల్, బ్లేర్ టిక్‌నెర్‌లు భారత్ బ్యాట్స్‌మె న్‌ను ఎంత వరకు నిలువరిస్తారో వేచిచూడా ల్సిందే. చివరి 11మంది ఆటగాళ్లను ఇరుజట్లు టాస్‌కు ముందు ప్రకటించనున్నాయి.

భారత్‌లో ప్రపంచ కప్ హాకీ టోర్నీ?

లాసాన్నె: భారత్ మరోసారి ప్రపంచ కప్ హాకీ టోర్నీని నిర్వహిం చేందుకు తన సంసిద్ధతను వ్యక్తం చేసిం ది. మంగళవారం భారత హాకీ సమాఖ్య ఇందు కోసం బిడ్‌ను క ూడా దాఖ లు చేసింది. 2018లో భారత్, పురుషుల ప్రపంచ కప్‌ను ఒడిశాలో నిర్వహిం చిన విషయం తెలిసిందే. తాజాగా వచ్చే మహిళల లేదా పురుష ప్రపంచకప్‌ను 2023 లో జనవరి 13 నుంచి 29 వరకు నిర్వహించేం దుకు సంసిద్ధతను తెలి పింది. కాగా ఇదే రీతిలో ఆస్ట్రేలి యా, న్యూజి లాండ్ లు తమ సంసిద్ధ తను వ్యక్తం చేశా యి. కాగా స్పె యిన్, మలే సియా, జర్మనీ లు ఈ ఈవెం ట్‌ను 2022 జూలై 1 నుం చి 17వరకు నిర్వహిస్తామని తెలిపాయి. ఈ మేరకు అంతర్జా తీయ హాకీ సమాఖ్య ఒక ప్రకటన చేస్తూ.. వచ్చే వరల్డ్ కప్ నిర్వహణ కోసం పలు బిడ్డింగ్‌లు వచ్చా యి. బిడ్డింగ్‌ల దాఖలుకు ఆఖరు తేదీ జనవరి 31తో ముగి సింది. ఆయదేశాలు రెండు షెడ్యూల్ తేదీలను తమ బిడ్డిం గ్‌లో పేర్కొన్నాయి. 2022 జులై 1నుం చి 17 లేదా 2023 జనవరి 13 నుంచి 29లకు ప్రాధా న్యతనిచ్చాయని పేర్కొంది. ఈ బిడ్డిం గ్‌లను ఎఫ్‌ఐహెచ్ పరిశీలించి తుది నిర్ణయం జూన్ నెల లో తీసుకుంటుం ది.

భారత్‌లో ప్రపంచ కప్ హాకీ టోర్నీ?

• బిడ్డింగ్ దాఖలు చేసిన హాకీ ఇండియా



లాసాన్నె: భారత్ మరోసారి ప్రపంచ కప్ హాకీ టోర్నీని నిర్వహించేందుకు తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. మంగళవారం భారత హాకీ సమాఖ్య ఇందు కోసం బిడ్‌ను క ూడా దాఖ లు చేసింది. 2018లో భారత్, పురుషుల ప్రపంచ కప్‌ను ఒడిశాలో నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా వచ్చే మహిళల లేదా పురుష ప్రపంచకప్‌ను 2023 లో జనవరి 13 నుంచి 29 వరకు నిర్వహించేందుకు సంసిద్ధతను తెలిపింది. కాగా ఇదే రీతిలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. కాగా స్పెయిన్, మలేసియా, జర్మనీలు ఈ ఈవెంట్‌ను 2022 జులై 1 నుం చి 17వరకు నిర్వహిస్తామని తెలిపాయి. ఈ మేరకు అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఒక ప్రకటన చేస్తూ.. వచ్చే వరల్డ్ కప్ నిర్వహణకోసం పలు బిడ్డింగ్‌లు వచ్చాయి. బిడ్డింగ్‌ల దాఖలుకు ఆఖరు తేదీ జనవరి 31తో ముగిసింది. ఆయదేశాలు రెండు షెడ్యూల్ తేదీలను తమ బిడ్డింగ్‌లో పేర్కొన్నాయి. 2022 జులై 1నుం చి 17 లేదా 2023 జనవరి 13 నుంచి 29లకు ప్రాధాన్యతనిచ్చాయని పేర్కొంది. ఈ బిడ్డిం గ్‌లను ఎఫ్‌ఐహెచ్ పరిశీలించి తుది నిర్ణయం జూన్ నెల లో తీసుకుంటుం ది.

వెల్లింగ్టన్: భారత క్రికెట్ జట్టు మూడు నెలల విదేశీ పర్యటన చివరి అంకా నికి చేరుకుంది. చిరస్మ రణీయమైన విజయాలతో స్వదేశానికి చేరడానికి ముందు భారత్, న్యూజిలాండ్‌లో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుంది. ఇందులో భాగంగా స్థానిక వెస్ట్‌పాక్ స్టేడియంలో తొలి మ్యాచ్‌ను ఆతిథ్యదేశంతో ఆడనుంది. భారత జట్టు రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ విశ్రాంతి తీసుకుంటుండంతో.. రోహిత్ శర్మ జట్టుకు సారథ్యా న్ని వహిస్తున్నాడు. ఆస్ట్రేలియాలో చారిత్రక విజయాలను, న్యూజి లాండ్‌లో 4-1తో వన్డే సిరీస్‌ను గెలుపొం దిన భారత్, న్యూజి లాండ్ గడ్డపై తొలి టీ20 సిరీస్‌ను కైవసం చేసు కోవాలని ఉవ్విళ్లూరు తోంది. మరోవైపు నిరంతరం గా ఆడుతు న్న ఆటగాళ్లు విశ్రాంతిని కోరు కుంటున్నారు. ఒకవైపు ఆట లో గెలవాలనే కాంక్షను వెలి బుచ్చుతూన్యూ జిలాం డ్‌తో పొట్టి ఫార్మా ట్ సిరీ స్‌ను గెలవాలని భావిస్తు న్నారు. భారత జట్టు ఓపెనర్ శిఖర్ ధావన్ బుధవారం మీడి యా తో మాట్లాడుతూ.. మే మూ మనుషులమే మా శరీరాలకు విశ్రాంతి అవసరం. మేము ఆస్ట్రేలియా లో సాగించిన జైత్ర యాత్రను న్యూజి లాం డ్‌లో కూడా సాగించాలను కుంటున్నాము. ఈ సిరీస్ విజయం తో స్వదేశానికి వెళ్లాలను కుంటున్నాము అని తెలిపాడు.

జట్లు:

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, రిషభ్ పంత్, దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, కృణాల్ పాండ్యా, కుల్దీప్ యాద వ్, యజు వేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమా ర్, సిద్దార్ధ్ కౌల్, ఖలీల్ అహ్మద్, శుభ్‌మన్ గిల్, విజయ్ పాండ్యా, మహ్మద్ సిరాజ్

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), డోగ్ బ్రేస్‌వెల్, కోలిన్ డి గ్రాం దొమ్మి, లాకి ఫెర్గుసన్, స్కాట్ కుగ్గెలెజ్, కోలిన్ మన్రో, డేరిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్, టిమ్ సెయ్‌ఫెర్ట్, ఐష్ సోదీ, బ్లెయిర్ టిక్‌నెర్, జేమ్స్ నీశామ్.

మహిళా క్రికెట్ టోర్నీ విజేత తెలంగాణ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్,ప్రభ న్యూస్ : నగరంలోని స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో 3 రోజులుగా నిర్వహిస్తున్న 5వ ఆల్‌ఇండియా మహిళా క్రికెట్ టి-20 ఛాంపియన్‌షిప్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. హోరాహోరిగా నడిచిన ఎనిమిది రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో తెలంగాణ మహిళా క్రికెట్ జట్టు విజేతగా, రన్నరఫ్‌గా ఉత్తరప్రదేశ్ జట్లు నిలిచాయి. మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా జడ్జీ యం. లక్ష్మణ్, పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ హాజరయ్యారు. ఈ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మెన్, ఉమెన్ ఆఫ్ ది సిరీస్ టి. చందన (తెలంగాణ జట్టు), బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్‌రౌండర్ నీరజ్ రాజ్‌పథ్ (ఉత్తరప్రదేశ్)లు నిలిచారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఏసిపి పింగళి నరేష్‌రెడ్డి, టౌన్ ఏసిపి వెంకట్రావు, మహిళా ప్రాంగణ అధికారి విజేత, డిఎస్‌డివో పరందామరెడ్డి, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, సునీల్‌రెడ్డి, మహిళ క్రికెట్ అసోషియేషన్ నాయకులు మతిన్, పీడీ శ్రీనివాస్, టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గోల్కొండ 7 టూంబ్స్‌లో గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం. ఈ పోటీలు నేటినుంచి శనివారం వరకు సాగుతాయి.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

L ively
I nteraction
F or
E ver

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I

బుధవారం 6 ఫిబ్రవరి 2019

ఏది నీ స్థాయి...

ఆకాశమా.. అథఃపాతాళమా?!



వాసు తీరిగ్గా ఇంట్లో ముందుగదిలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. ఆ రోజు రెండో శనివారం అతనికి ఆఫీసుకి సెలవు. అప్పటికి ఒకసారి టిఫిన్, మూడుసార్లు కాఫీలు ఇచ్చిన వాసు భార్య కస్తూరి...అతను నాలుగోసారి కాఫీ అడిగేసరికి సిద్ధంగా ఉంచడానికి పాలు కాస్తోంది. అడిగిన రెండునిముషాల్లో వేడి కాఫీ కప్పు అతని ముందు ఉండాలి. లేకపోతే నేనంటే లెక్కలేదా...అంటూ తిట్లు మొదలు పెట్టేస్తాడు. ఆ సమయంలో ఓ చిన్న బ్యాగుతో ఇంట్లోకి వచ్చాడు వివేక్. వంటింట్లోంచి బయటకు వచ్చి చూసిన కస్తూరి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ....అన్నయ్యా..అంటూ పెద్దగా అరిచేసింది. అదే సంతోషాన్ని కంటిన్యూ చేస్తూ...'ఏమండీ మా పెద్దనాన్నగారి అబ్బాయి....మా అన్నయ్య... మన పెళ్లికి వీళ్ల ఫ్యామిలీ మొత్తం అమెరికాలో ఉంది....మీరు చూడలేదు కదా...' అంటూ ఇద్దరికీ ఒకరిని ఒకరికి పరిచయం చేసింది.

'ఆ... అమలాపురంలో ఉంటారు కదా మీరు...మీకు చేపల చెరువులు ఉన్నట్టున్నాయి...ఏంటండీ బాబు అమెరికాలో చాలారోజులు ఉండిపోయినట్టున్నారు. ఏమైనా మనం ఇక్కడ సంపాదించామంటే మన పిల్లలు అమెరికాలో చదవాల్సిందే. అక్కడ ఏంచేస్తారో తెలియదు కానీ...ఇక్కడ మాత్రం మా పిల్లలు అమెరికాలో ఉన్నారంటూ గొప్పగా చెప్పేసుకోవచ్చు...చూస్తున్నాంగా... చదువుకోవడానికి వెళ్లి వెనక్కు వస్తున్న పిల్లలను...' మొదటి పరిచయంలోనే వాసు అలా తలాతోకా లేకుండా మాట్లాడుతుంటే ఆ వచ్చిన పెద్దమనిషి వివేక్...చిరునవ్వుతో చూస్తూ ఉండిపోయాడు. వాసు... చేపల చెరువులు... అనగానే కస్తూరి ఏదో చెప్పబోయింది...కానీ వివేక్ సైగ చేయటంతో ఆగిపోయింది. అప్పటినుండి వివేక్‌తో వాసు ఏదోఒకటి పిచ్చాపాటి మాట్లాడుతూనే ఉన్నాడు. కాసేపటికి పక్కింటి అమ్మాయి పరిమళ వచ్చింది. ఆ అమ్మాయి, కస్తూరి కలిసి సాఫ్ట్ టాయిస్ తయారుచేసి అమ్ముతుంటారు. 'పెళ్లిసంబంధం వచ్చిందటగా పరిమళా...' అంటూ వాసు ఆమెని పలకరించాడు.



అవును...పెళ్లికొడుకుది బ్యాంక్ జాబ్ అంటూ వివరాలు చెప్పుకొచ్చింది పరిమళ. అంతే అదేదో పెద్ద జోక్‌లా నవ్వేస్తూ...'మీ నాన్న వాచ్‌మేన్, నువ్వు ఈ పనికిరాని బొమ్మలు తయారుచేస్తుంటావు...నీకు బ్యాంక్ జాబ్ చేసే కుర్రాడి సంబంధం వచ్చిందా....అదృష్టవంతురాలివే' అన్నాడు వాసు కాస్త వెటకారంగా. ఆ పిల్ల చిన్నబుచ్చుకుంది.

★ ★ ★

వివేక్... కస్తూరి, పరిమళ కలిసి తయారుచేస్తున్న సాఫ్ట్ టాయిస్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. కస్తూరి అందులో శిక్షణ తీసుకుందని తెలుసుకుని మరింత ఆనందంగా ఆమెని అభినందించాడు. 'మా చెల్లి చిన్నప్పటినుండీ అంతే ఇలా చూసిందంటే చాలు అలా పట్టేస్తుంది' అన్నాడు వాసుతో. వాసు మరోసారి వెటకారంగా నవ్వుతూ...'మీరే చెప్పుకోవాలి...మీ చెల్లెలి గొప్పలు. ఇంట్లో కూర్చుని ఆ బొమ్మలు కుట్టటం కూడా ఒక గొప్పేనా...ముందు మీచెల్లిని వంట సరిగ్గా చేయటం నేర్చుకోమని చెప్పండి' అన్నాడు.

వివేక్ అతనివైపు ఆశ్చర్యంగా చూశాడు. తను వచ్చినప్పటినుండీ చూస్తున్నాడు. వాసు నోటివెంట ఒక్క మంచిమాట రాలేదు. ఎవరో ఒకరిని ఏదో ఒక విషయంలో వెక్కిరిస్తూనో, కించపరుస్తూనో మాట్లాడుతున్నాడు.

★ ★ ★

పరిమళ తరువాత కస్తూరి వాళ్లకి పాలుపోసే అతను వచ్చాడు. అతని కొడుకుకి సినిమాలంటే పిచ్చి. అయితే మూడేళ్లు శ్రమపడి అనుకున్నది సాధించాడు. సినిమాల్లో కాస్త గుర్తింపు ఉన్న చిన్నపాటి పాత్రలు పోషిస్తున్నాడు. ఆ విషయాన్ని కస్తూరికి చెప్పి తన కొడుకు నటించిన సినిమాల పేర్లు చెప్పాడు...కస్తూరి నిజంగా చాలా ఆనందించింది. 'నేను అనుకుంటూనే ఉన్నాను సాంబయ్య...వాడికి పట్టుదల చాలా ఎక్కువ. చూడు వాడు నీకెంత పేరు తెచ్చిపెడతాడో' అంటూ అతడిని కూడా అభినందించింది. ఆ వెంటనే వాసు అందుకున్నాడు....' ఆఆ తెస్తాడు పేరు...ఇలాంటివాళ్లని ఎంతమందిని చూడలేదు...నాలుగురోజులు తిరిగి కడుపుకాలాక ఏం చేయాలో తెలియక ఇంటిదారి పడతారు. లేదా ఏ కూలోనాలో చేసుకుంటూ బతకాల్సిందే..ఇలాంటివాళ్లంతా హీరోలైపోతే...ఇక అంతే...వాడిని ఇప్పుడే తీసుకువచ్చేస్తే మంచిది' అన్నాడు సాంబయ్యతో. అతని మనసు చివుక్కుమంది. కొడుకులో నిజంగానే టాలెంట్ ఉంది. వాడు మూడేళ్లుగా ఇంటినుండి ఒక్క పైసా కూడా అడగకుండా అక్కడే ఏదో తిప్పలు పడుతున్నాడు. 'సాధ్యమైనంతవరకు కష్టపడతాను నాన్న...ఇక నావల్లకాదు..అనుకున్నపుడు వచ్చేసి బుద్ధిగా మన పాల వ్యాపారం చేసుకుంటాను' అని మాట ఇచ్చాడు. వాడి ఆశలో నిజాయితీ ఉందనిపించే ఊరుకున్నాడు తను. అదే చెప్పాడు వాసుతో సాంబయ్య. అతను వేసిన క్యారక్టర్లను గురించి చెప్పాక వాసుకి అర్థమైంది...అతను టాలెంట్ ఉన్నవాడేనని. లేకపోతే మూడేళ్లలో అంతస్థాయికి రావటం సాధ్యం కాదు. అయినా వాసు సాంబయ్యని అభినందించలేదు. 'అబ్బో... అప్పుడు సాంబయ్యగారు మనకు కారులో వచ్చి పాలుపోస్తాడేమో' అన్నాడు తన వెటకారపు నవ్వుని కొనసాగిస్తూ. అప్పటివరకు నవ్వుతున్న సాంబయ్య మొహం చిన్నబోయింది. అది చూశాక వాసు మనసు శాంతించింది.

★ ★ ★

ఆ తరువాత భోజనాల దగ్గర కూడా కూరలు బాగోలేదని పెరుగు సరిగ్గా తోడుకోలేదని ఇలా రకరకాల విమర్శలు చేసి భోజనం పూర్తి చేశాడు. మాటల సందర్భంలో వివేక్ అడిగాడు...'కస్తూరి సాఫ్ట్ టాయ్స్ బాగా చేస్తోంది. దానిచేత ఇదే చిన్నపాటి పరిశ్రమలా పెట్టించవచ్చు. మీరు వద్దంటున్నారట కదా' అని. వాసు కాస్త సీరియస్‌గా చూస్తూ...'ఏం చేస్తారు ఈ ఆడవాళ్లు. నాలుగు రోజులు చేసి నా వల్లకాదంటే నాకు పెట్టుబడి దండగ. అందుకే వద్దన్నాను' అన్నాడు. 'మీకు తెలియదు తన గురించి... తను అనుకున్నదంటే సాధించి తీరుతుంది... మీరు వద్దంటే చెప్పండి...ఆ పెట్టుబడేదో నేనే పెడతాను. మా చెల్లి పైకొస్తే నాకూ సంతోషమేగా' అన్నాడు వివేక్. 'నాకు ఇష్టంలేదండీ' వెంటనే తెగేసి చెప్పినట్టుగా అన్నాడు వాసు. 'నాకు నా భార్య ఇల్లు చూసుకుంటే చాలు. ఇప్పటికే ఈ బొమ్మలంటూ తిరుగుతూ...నానా వేషాలూ వేస్తోంది. చూశారా...ఎలా తయారైందో బ్యూటీ పార్లర్‌కి వెళ్లటం అవసరమా తనకి' అన్నాడు కోపాన్ని ఆవేశాన్ని కలగలపి. కస్తూరికి కోపం తన్నుకొస్తోంది. రాకరాక వచ్చిన పెద్దనాన్న కొడుకుముందు పోట్లాడితే బాగోదని తమాయించుకుంది.

★ ★ ★

కస్తూరి వాసుల పెళ్లయి ఆరునెలలవుతోంది. ఈ ఆరునెలల్లో ఇలా చాలాసార్లు తమాయించు కుందామె. తన భర్తలో ఇంత సంకుచిత బుద్ధి ఉంటుందని ఆమె ఊహించలేకపోయింది. తండ్రి చనిపోతే వచ్చిన ఉద్యోగంతో ఇరవై ఏళ్లకే ప్రభుత్వ ఉద్యోగి అయ్యాడు వాసు. ఇప్పుడు అతని వయసు ఇరవై ఎనిమిది. ఆ ఉద్యోగం చేసి ఇంటికి రావటం తప్ప ఈ ప్రపంచంతో ఇక తనకు అవసరమే లేదన్నట్టుగా ఉంటాడు. విపరీతమైన వెటకారం...ఎవరు కాస్త మంచిగా ఉన్నా, ముందుకు వెళుతున్నా తట్టుకోలేడు. చివరికి ఈ విషయంలో భార్యకు కూడా మినహాయింపు లేదు. పెళ్లయిన దగ్గరనుండి కస్తూరికి జైల్లో ఉన్నట్టుగా ఉంది. ఇంట్లోంచి బయటకు రాకూడదు. పెద్దగా నవ్వకూడదు, ఫోన్లో ఎక్కువ సేపు మాట్లాడకూడదు... ఇలాంటి ఆంక్షల మధ్యే గొడవపడి మరీ ఆ బొమ్మలు చేయటం నేర్చుకుంది. తను ఏం ఆలోచించినా వాసుకి వెటకారంగా ఉంటుంది. ఏ ఆలోచన చెప్పినా....అబ్బో చాల్లే నీ తెలివితేటలు... అంటూ ఒక్కమాటలో తుంచేస్తాడు. ముఖ్యంగా కస్తూరికి వ్యాపారం అంటే చాలా ఇష్టం. సొంతంగా ఒక టాయ్స్ షాపు పెట్టాలనే ఆశ ఉంది. ఇంకా చాలా చేయాలని ఉంది. వాట్సప్‌లో తన కజిన్స్ అందరూ వాళ్ల చదువులు కెరీర్‌లను గురించి మాట్లాడుకుంటుంటే... ఇక తన జీవితమంతా ఇంతేనా...ఈ నాలుగు గోడల మధ్యే మగ్గిపోవాలా,,, అనిపించాక వివేక్‌కి అన్నీ ఫోన్లో చెప్పింది. అందుకే వివేక్ పనిగట్టుకుని ఢిల్లీనుండి వచ్చాడు. 'అమలాపురంలో గొడ్లు మేపుకునే వాళ్లు కూడా వచ్చి నాకు సలహా ఇచ్చేవారే' అన్నాడు వాసు వివేక్‌ని బాధపెట్టాలనే. వివేక్ నవ్వుతూ...'నేను ఆనందరావుని కాదు. వాడు నా తమ్ముడు. నేను సైకియాట్రిస్ట్ వివేక్‌ని ఢిల్లీలో ఉంటాను' అన్నాడు. ఒక్కసారిగా ఖంగుతిన్నాడు వాసు. కాస్త జంకాడు.

★ ★ ★



వాసు వివేక్‌ని చూడగానే అమలాపురం ఆనందరావని అనుకున్నాడు...కస్తూరి కాదని చెప్పబోతుంటే వివేక్ వద్దని సైగ చేశాడు. 'అయితే ఏంటి..ఇప్పుడు మీరు నాకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి వచ్చారా..' అన్నాడు వాసు అదే బింకంతో. 'కౌన్సెలింగ్ ఇవ్వడానికి మీరేమీ పేషంట్ కాదు...అయితే మీరు ఒక విషయం మాత్రం చెప్పండి. నేను వచ్చినప్పటినుండీ చూస్తున్నాను. పరిమళ పెళ్లి విషయం చెబితే...నీకు అంత అర్హత ఉన్న అబ్బాయి అవసరమా అన్నారు. సాంబయ్య తన కొడుకు గురించి చెబితే అతను రాబోయే రోజుల్లో కూలినాలి చేసుకుని పనిచేసుకోవాలి...అని తీర్మానించేశారు. వాళ్ల సమర్థత ఏమిటో, వారి అర్హత ఏమిటో నిర్ణయించే అధికారం మనకేముంది చెప్పండి'. వాసు మాట్లాడలేదు. అతని మొహం ఎర్రబారుతోంది. అతనికి కోపం వస్తోంది. 'వాసూ మీకు తెలియటం లేదు...మీ ఆలోచనల వలన అందంగా ఉండాల్సిన మీ కాపురం నరకంగా మారే పరిస్థితులు కనబడుతున్నాయి. మీరు విన్నా వినకపోయినా...ఇవన్నీ నిజాలు. అంటూ వివేక్ తన మాటలు కొనసాగించాడు. 'ఇంటర్ చదవటంతోనే మీకు జాబ్ వచ్చేసింది. ఆ చదువు తప్ప మీకున్న అర్హత ఇంకేమీ లేదు. అది మీకు ఆత్మన్యూనతగా మారింది. ఇదే కాదు...మీలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ చాలా ఉంది. కస్తూరి ఇక్కడ సాఫ్ట్ టాయ్స్ విషయంలో చాలా నేర్చుకుంది. మార్కెట్ కూడా చేయగలుగుతోంది. ఆమె సమర్థురాలన్న సంగతి మీకు కూడా తెలుసు. అందుకే ఆమెను ఎప్పుడూ కిందకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కసారి అన్ని ఇగోలు పక్కనపెట్టి ఆలోచించండి. పరిమళ తండ్రి వాచ్‌మేనే కావచ్చు. అతను తన కూతురి జీవితం బాగుండాలని ఎందుకు కోరుకోకూడదు. అందులో అత్యాశ ఏముంది..పరిమళ తను కూడా సొంతంగా సంపాదించుకోవాలని, తల్లిదండ్రులకు సహాయపడాలని తాపత్రయపడుతోంది. అందులో ఎగతాళి చేసే విషయం ఏముంది...మీ మనసు చుట్టూ ఒక కంచెవేసుకున్నారు. ఇతరులు ముందుకు వెళుతున్నారు...అంటే ఎందుకు మీకు భయంగా ఉంది...ఇతరులు తమ సమర్థతని గురించి చెబుతుంటే...మీరెందుకు ఉలిక్కిపడుతున్నారు...మీమీద మీకు నమ్మకం గౌరవం లేవు. నేను తక్కువ... అనే ఫీలింగ్‌తో ఉన్నారు కాబట్టి...మీకంటే ఎక్కువగా ఎవరు అనిపించినా...మీకు నచ్చటం లేదు. వారిని ఏదో ఒక మాట అని సంతృప్తి పడుతున్నారు. ఒక్కసారి ఆలోచించండి...ఈ ప్రపంచం చాలా విశాలమైంది. మీ ఇంటిపక్కన ఉన్న పరిమళ, మీకు పాలుపోసే సాంబయ్య...వీళ్లే కాదు...వీళ్లిద్దరినీ మీరు కించపరచినంత మాత్రాన ఏం జరుగుతుంది. ప్రపంచం ముందుకు వెళుతూనే ఉంటుంది. పరిమళకు బ్యాంకు ఎంప్లాయితో పెళ్లవక మానదు...సాంబయ్య కొడుకు పైకి రాకా మానడు. మీచుట్టూ ఉన్నవారిని తక్కువ చేసి మాట్లాడి...హమ్మయ్య వాళ్లు ముందుకు వెళ్లలేరులే అనుకుంటే అది మీ అమాయకత్వమే అవుతుంది. ఇతరులను ఒక్క మంచిమాటతో అభినందించలేకపోతున్నారంటే... ఇతరులను బాధపెట్టేలా మాట్లాడితే...ఇతరులను కించపరిస్తే మీకు ఆనందం కలుగుతుందంటే....మీ స్థాయి ఏమిటో మీరు ఒక్కసారి ఆలోచించుకోండి.

ఈ రోజు ఉన్నట్టుగా ప్రపంచం రేపు ఉండటం లేదు. ఇక్కడ ఇతరులకు బాధకలగకుండా ఎవరికి నచ్చినట్టుగా వారు బతికే హక్కు అందరికీ ఉంది. మనమెవరం...ఎవరిస్థాయి ఏమిటి అని నిర్ణయించడానికి...నిజానికి మన చేతుల్లో ఉన్నది ఒక్కటే...మన స్థాయిని తగ్గించుకోవడమో పెంచుకోవడమో. అంతకుమించి ఏమీ చేయలేము.

★ ★ ★

ఈ రోజు ఉన్నట్టుగా ప్రపంచం రేపు ఉండటం లేదు. ఇక్కడ ఇతరులకు బాధకలగకుండా ఎవరికి నచ్చినట్టుగా వారు బతికే హక్కు అందరికీ ఉంది. మనమెవరం...ఎవరిస్థాయి ఏమిటి అని నిర్ణయించడానికి...నిజానికి మన చేతుల్లో ఉన్నది ఒక్కటే...మన స్థాయిని తగ్గించుకోవడమో పెంచుకోవడమో. అంతకుమించి ఏమీ చేయలేము. మీ మానసిక స్థాయి పెరిగితే మీ భార్య మీతో ఆనందంగా ఉంటుంది...మిమ్మల్ని మీరు ఇలాగే తక్కువగా చూసుకుంటూ...ఇతరులు కూడా అక్కడే ఉండాలని కోరుకుంటుంటే...మీ భార్య జీవితాంతం ఏడుస్తూ మీతో ఉంటుంది....ఆ ప్రభావం...మీ తరువాత తరాలపైన కూడా పడుతుంది.' వాసు వెళ్లిపోవాలని అనుకున్నా...వెళ్లలేకపోయాడు. మౌనంగా ఉండిపోయాడు...కస్తూరి కళ్లనిండా నీళ్లు...వాటినే చూస్తున్నాడు వాసు....'అరె ఈ అమ్మాయిని బాధపెట్టే అధికారం నాకేముంది'...అని మొదటిసారిగా అనిపించింది వాసుకి.

- వడ్లమూడి దుర్గాంబ

ఆ సన్నదనం నుండి విముక్తి... ఆసన్నం!

దక్షిణ కొరియాలో అధికబరువున్న అమ్మాయిలకోసం మోడలింగ్ వేదిక శరీర కొలతల చట్రం నుండి బయటకు వస్తున్న యువతులు

ప్రపంచవ్యాప్తంగా ఆడవాళ్లపై రకరకాల ఒత్తిళ్లు ఉన్నాయి. ఇప్పుడు ఆడపిల్లలపై ఉన్న పెద్ద ఒత్తిడి అందంగా కనిపించాల్సి రావటం. అవును...సన్నగా నాజూగ్గా ఉండాల్సిన ఒత్తిడి వారిపైన చాలా ఉంటోంది. సినీ మోడలింగ్ రంగాల్లో ఉన్నవారే కాదు...సాధారణ అమ్మాయిలు సైతం...అలాగే ఉండాలని కోరుకుంటున్నారు. సోషల్ మీడియా వచ్చాక...అనుక్షణం ఫొటోలు తీసి పోస్టు చేస్తున్న నేపథ్యంలో ఆడపిల్లలు నిరంతరం ఒక అందాల పోటీలో ఉన్నట్టుగా ఫీలవుతున్నారు. ఇది ఇక్కడే కాదు...ప్రపంచమంతా ఉంది. దక్షిణ కొరియా మహిళలు సైతం ఇలాంటి ఒత్తిడికి లోనవుతున్నారు. అక్కడ యాభై కిలోలకంటే ఎక్కువ బరువున్న మహిళలను లావున్నవారిగా పరిగణిస్తున్నారు. మామూలుగా అయితే లావుని ఎత్తుని బట్టి లెక్కవేయటం ఉంటుంది కానీ... అక్కడ మాత్రం ఎంత ఎత్తు ఉన్నా...యాభై కిలోలు మాత్రమే బరువు ఉండాలంటున్నారు. అయితే మోడలింగ్ అనేది కొంతమందికి కలల కెరీర్. కేవలం బరువున్నంత మాత్రాన ఆశలు వదిలేసుకోవాలా...అని దక్షిణ కొరియా మహిళలు ప్రశ్నిస్తున్నారు.



ఈ నేపథ్యంలో పార్క్ అనే 25ఏళ్ల యువతి...మోడల్ కావాలని అనుకుని చాలా ప్రయత్నాలు చేసింది. ఆమె లావుగా ఉండటంతో కొన్నాళ్లు డైటింగ్ చేయటం, తరువాత ఎక్కువగా తినేయటం...ఇలా నానా ఇబ్బందులు పడిన తరవాత ఆమె ఒక విషయాన్ని గమనించింది. తను పొడవు కాదు, సన్నం కాదు. మోడలింగ్‌కి ఆదర్శం అంటున్న శరీర తీరు తనకు సాధ్యం కాదని. దాంతో తననితాను నేచురల్ సైజ్ మోడల్‌గా వర్ణించుకుంటూ...ఒక యూట్యూబ్ చానల్ ని మొదలుపెట్టింది. నేచురల్ సైజ్ మోడల్ అంటే నిజజీవితంలో ఎలా ఉంటామో...అలా ఉండటమే. యూట్యూబ్ ఛానల్‌లో ఆమె తనలాగా, తనకంటే ఎక్కువగా లావుగా ఉన్నవారికి ఫ్యాషన్లను పరిచయం చేస్తోంది. ఫ్యాషన్ మేగజైన్లలో కనిపించే సన్నటి మోడళ్లలాగే వీరూ ఛానల్‌లో కనబడుతున్నారు.

పార్క్ ఆలోచన అక్కడి మహిళలకు బాగా నచ్చింది. దాంతో వందలమంది యువతులు యాష్‌ట్యాగ్ టాల్‌కోర్‌సెట్ పేరుతో నేచురల్ సైజ్ మోడల్ విధానాన్ని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. నడుమువద్ద సన్నగా కింద లావుగా ఉండే దుస్తుల పేరు కోర్‌సెట్. అది వద్దు...అనే అర్థంలో వారు ఆ పేరు పెట్టుకున్నారు. పార్క్ ఇటీవల సియోల్‌లో అన్ని రకాల శరీర బరువు ఉన్న అమ్మాయిలతో సియోల్‌లో ఒక ఫ్యాషన్ షో కూడా నిర్వహించింది. ఆమెని సమర్థిస్తూ...అనేక మంది వీడియోలు ఫొటోలు పోస్టు చేస్తున్నారు. ఆ ఫొటోల్లోవారు జుట్టుని కత్తిరించుకుని, మేకప్ సామాగ్రిని చిందరవందర చేస్తూ...మేకప్ లేకుండానే బయటకు వస్తూ...వీడియోలు పెడుతున్నారు. సన్నగా ఉంటేనే ఆనందంగా ఉండవచ్చని మొదట అనుకున్నానని కానీ... ఇప్పుడు నేను ఎలా ఉన్నానో అలా ఉండటమే ఆనందమని భావిస్తున్నానని పార్క్ అంటున్నారు.



దక్షిణ కొరియాలో పురుష ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ...అక్కడి మహిళలు ఫెమినిజం బాటపడుతున్నారు. మహిళలపై అందంగా ఉండాలనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని సియోల్‌లోని ఒక యూనివర్శిటీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెండర్ స్టడీస్ పరిశోధకుడు సోన్‌హీ జాంగ్ అంటున్నారు. అయితే దక్షిణ కొరియా మహిళలు ఈ బంధనాల నుండి బయటపడేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఛా జీ వోన్ అనే 24ఏళ్ల అమ్మాయి...ఒక యూట్యూబ్ ఛానల్‌ని నిర్వహిస్తోంది. ఆమె తనజుట్టుని తనకు నచ్చినట్టుగా వదిలేస్తూ తన దుస్తులను తనకు సౌకర్యంగా అనిపించేలా ధరిస్తూ...మేకప్ లేకుండా తిరగటం మొదలుపెట్టాక ఆమెకు...యూ ట్యూబ్‌లో వీక్షకులు పెరిగారు. 7,20,000 వ్యూస్ వచ్చాయి. ఇప్పుడు తనకు నచ్చినట్టుగా తింటున్నానంటోంది ఆమె. మీరు ఎలా కనబడుతున్నారు...అనే విషయం గురించి ఎక్కువగా ఆలోచించవద్దని తోటి మహిళలకు సలహా ఇస్తోంది...ఛా.

చింతన

ఆత్మవల్లనే దేహం చైతన్యవంతం



అధ్యాయం-13, శ్లోకం -34

యథా ప్రకాశయత్యేకః
కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం
ప్రకాశయతి భారత ॥

తాత్పర్యం

ఓ భరతవంశీయుడా! ఒక్కడేయైన సూర్యుడు లోకమంతటిని ప్రకాశింపజేయునట్లు, దేహములోని ఆత్మ సమస్త దేహాన్ని చైతన్యంతో ప్రకాశింపజేస్తుంది

భాష్యం

సూర్యుడు ఒక్క చోటనే ఉండి అంతటినీ కాంతివంతము చేసినట్లు, ఈ శరీరంలోని హృదయంలో ఉండు అతి సూక్ష్మమైన ఆత్మ, శరీరమునంతటినీ చైతన్యవంతం చేస్తుంది. సూర్యరశ్మిని బట్టి సూర్యుని ఉనికిని గుర్తించినట్లు, చైతన్యమును బట్టి ఆత్మయొక్క ఉనికిని గుర్తించవచ్చును. ఆత్మ ఉన్నంతవరకు శరీరమంతటా చైతన్యం ఉంటుంది. అదే ఒకసారి ఆత్మ వెళ్ళిపోతే శరీరము అచేతనమవుతుంది. తెలివిగలవారు ఈ విషయాన్ని గుర్తించవచ్చు. కాబట్టి చైతన్యమనేది భౌతిక మూలకాల సమ్మేళనము వలన ఉద్భవించినది కాదు. అది ఆత్మ లక్షణము. అయితే ఆత్మ చైతన్యము ఆ శరీరానికే పరిమితమైతే, అతని స్నేహితునిగా కొనసాగే పరమాత్మ అన్ని శరీరాల చైతన్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి వారివురూ చైతన్యవంతులే అయినా ఈ భేదాన్ని కలిగి ఉంటారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

భక్తికి మొదటి మెట్టు

భగవంతునిపై మమకారం

కోరికలు తీరడానికో, బాధల నివారణకో మాత్రమే భక్తిని వినియోగించరాదు. తీవ్ర భక్తి ఉంటే ఇవన్నీ వాటంతట అవే నెరవేరుతాయి. భక్తి కావాలంటే అహంకార మమకారాల త్యాగానికి సిద్ధమవ్వాలి. భగవంతుని మీద విశ్వాసం, ప్రేమ ఉండాలి. మనసావాచా కర్మణా భక్తి సాధనలను ఆచరించాలనే దృఢ నిశ్చయం ఉండాలి. భక్తి సాధనలో ఏకాగ్రత కుదిరేందుకు లోపల బయట శుచిగా ఉండాలి. సర్వమూ ఈశ్వరమయంగా చూడగలగాలి.



భక్తి అనేది చాలా మంది ఎక్కువగా వినే పదమే. దేవునిపై భక్తి గురించే ఎక్కువగా ఈ పదం వాడుతుంటారు. ఈ భక్తికి ఎన్నో నిర్వచనాలు ఎంతో మంది మహానుభావులు చెప్పారు. నారద భక్తి సూత్రాలు ఈ అంశాన్నే కూలంకషంగా వివరించాయి. అయితే భక్తి అవసరం, ప్రయోజనం, దాని సాధనకు యోగ్యత, భక్తిలో రకాల గురించి ఒకసారి గుర్తు చేసుకుందాం. భగవంతుని నుంచి వేరైన జీవుడిని తిరిగి భగవంతునిలో ఐక్యం చేసేది భక్తి. అందువల్ల భక్తి అంటే కలయిక. అనగా ఒక యోగం. అందువలప భక్తి సాధనలను భక్తి యోగంగా పిలుస్తారు.

అవసరం

భగవంతుని నుంచి జీవుడు దూరమవటానికి కారణం అహంకార, మమకారాలు. వీటిని తొలగించుకుంటే జీవుడే దేవుడు. దీనికి మార్గం భక్తి. కష్టాలతో విసిగి వేసారిన వారు తమ దుఃఖ నివృత్తి కోసం భక్తిని స్వీకరిస్తుంటారు. పూర్వ జన్మలలో చేసిన సాధన ఫలితంగా కొందరికి చిన్న వయసులోనే భక్తి భావం కలుగుతుంది. ప్రహ్లాదుడు, ధ్రువుడు అటువంటివారే.

ప్రయోజనం

భక్తి వల్ల భగవంతుని అనుగ్రహం పొందవచ్చును. అనుగ్రహం వల్ల జనన మరణరహితమైన ముక్తిని పొందవచ్చును. సంసార దుఃఖం నుంచి, బంధం నుంచి విముక్తి సాధించవచ్చును. పరమ శాంతి, శాశ్వతానందం పొందవచ్చు.

సాధనకు యోగ్యత

భక్తి సాధనకు కులమత, స్త్రీ పురుష, చిన్న పెద్ద భేదము లేక అందరూ యోగ్యులే. విపరీత భక్తితో ఎటు వంటి ప్రత్యేక సాధన లేకుండానే భగవంతుని పొందినవారు ఉన్నారు. అయితే అందరికీ అంతటి భక్తి కుదరడం కష్టం. ప్రత్యేకంగా భక్తి ఫలితాన్ని పొందాలంటే లక్ష్యమెరిగి భగవంతుని పొందడానికి సాధన చేయాలి. సాధనలో ఎన్నో రకాలున్నాయి. కోరికలు తీరడానికో, బాధల నివారణకో మాత్రమే భక్తిని వినియోగించరాదు. తీవ్ర భక్తి ఉంటే ఇవన్నీ వాటంతట అవే నెరవేరు తాయి. భక్తి కావాలంటే అహంకార మమకారాల త్యాగానికి సిద్ధమవ్వాలి. భగవంతుని మీద విశ్వాసం, ప్రేమ ఉండాలి. మనసావాచా కర్మణా భక్తి సాధనలను ఆచరించాలనే దృఢ నిశ్చయం ఉండాలి. భక్తి సాధనలో ఏకాగ్రత కుదిరేందుకు లోపల బయట శుచిగా ఉండాలి. సర్వమూ ఈశ్వరమయంగా చూడగలగాలి. చాలా మంది కోరికలు తీర్చుకోడానికో, బాధల పరిష్కారానికో మాత్రమే భక్తిని స్వీకరిస్తున్నారు. అవసరం లేనపుడు వదిలేస్తున్నారు. కోరికలు తీరడం, బాధలు తొలగడం జరిగితే మొక్కులు తీరుస్తున్నారు. లేకపోతే వేరే దైవాన్ని ఆశ్రయిస్తున్నారు. అంతేకాని భగవంతుని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు.

భక్తిలో రకాలున్నాయి తామసిక, రాజసిక భక్తి కాక సాత్విక భక్తి ఉండాలి. భగవంతుని కోసం సర్వ సమర్పణ చేయగలిగి ఉండాలి. సర్వాన్ని త్యజించి భగవంతుని పాదాలనాశ్రయించాలి. బ్రహ్మమును చేరేందుకు చేసే ప్రయాణంలోఎదురయ్యే అనేక అవాంతరాలను దాటేందుకు నిత్యం భక్తిని అభ్యసించాలి.

భగవంతుని నుంచి జీవుడు దూరమవటానికి కారణం అహంకార, మమకారాలు. అయితే 'భగవంతుడు నా వాడు ' అనే మమకారంతో మొదలయ్యేది భక్తి. ఆ భక్తిలో జనించే ప్రేమ అలౌకికం. ఈ భక్తే మోక్షసాధనం.


పరా భక్తి

నిజమైన భక్తుడు భగవంతుని కోసం సర్వం త్యాగం చేసి తాను కూడా సర్వ సమర్పణ అవుతాడు. అదే పరాభక్తి అనబడు తుంది. పరాభక్తుడు కర్తగా ఉండడు. భోక్తగా ఉండడు. అతడికి ఇష్టాయిష్టాలు ఉండవు. సకల వ్యాపారాలకు భగవంతుడే అధిష్ఠానంగా ఉంటాడు. పరాభక్తుడికి స్థూల శరీరం పడి పోయినా తిరిగి ఏర్పడదు. అనగా జన్మ ఉండదు. సూక్ష్మ శరీరం కూడా భంగమై ఆత్మతత్త్వం మిగులుతుంది. దానినే **'జీవేశ్వరైక్యం'** అంటారు.

సర్వేజనాస్సుఖినోభవంతు

- కోసూరు హయగ్రీవరావు
9949514583

నేనెవడను?



విషయవాసనలు (తలపులు) లెక్కకు మీఁటి సముద్రములోని అలలవలె కానవచ్చుచున్నవి. అవి యెప్పుడు వీగిపోవును?

చిరకాలంగా వచ్చే విషయ వాసనలు (కోరికలు) సముద్రతరంగాల వలె అనంతంగా ఉన్నప్పటికీ, స్వరూప ధ్యానము చేయగా చేయగా అవి అన్నీ నశిస్తాయి.

వాసనలన్నీ అణగి కేవలం స్వరూపంగా ఉండుట సాధ్యమేనా?

'సాధ్యమా, కాదా' అనే సందేహానికి చోటీయక స్వరూప ధ్యానమునే ఎడతెగక కలిగి ఉండాలి. ఒకడు ఎంత పాపి అయినా సరే, ''నేను పాపినే, ఎట్లా కడతేరడం?'' అని వెక్కి, వెక్కి ఏడవక, 'నేను పాపిని' అనే తలపును పూర్తిగా పారద్రోలి స్వరూప ధ్యానంలో దృఢమైన పట్టుదల కలవాడై ఉంటే, వాడు నిశ్చయంగా కడతేరగలడు.

ప్రశ్నలు-సమాధానాలు

మంచి మనస్సని, చెడ్డమనస్సని రెండు రకాల మనస్సులు లేవు. మనస్సు ఒక్కటే. వాసనలే శుభమని, అశుభ మని రెండు రకాలు. మనస్సు శుభవాసనతో కూడి ఉంటే మంచి మనస్సని అంటారు. ఇతరులెంత దుర్మార్గులుగా కనిపించినా వారిని ద్వేషింప రాదు. రాగ, ద్వేషములు రెండూ విడువ వలసినదే. ప్రపంచ విషయములందు మనస్సుని ఎక్కువగా ప్రసరింప జేయరాదు. వీలైనంత వరకు ఇతరుల వ్యవహారంలో ప్రవేశించరాదు. ఒకడు ఇతరులకు ఇచ్చేవన్నీ నిజానికి ఇచ్చుకునేది తనకే. ఈ సత్యం తెలిస్తే ఇతరులకు ఈయని వారెవరు? 'తాను' లేచినచో సమస్తము లేచును. 'తాను' అణగారి నచో సకలము అణగిపోవును. మనము ఎంతెంతగా అణకువతో ప్రవర్తిస్తామో, అంతకు అంత మేలే అవుతుంది. మనస్సును వశపరచుకుంటే ఎక్కడైనా ఉండవచ్చు.

అనువాదం: ప్రణవానందులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

గాయత్రీజప దూరత్వం

శాపగ్రస్తుల కథా కమామిషు-16

విశ్వామిత్రుడు సప్తర్షులలో ఒకడు. ఆయన పూర్వాశ్రమంలో గాధి అనే రాజు. వసిష్ఠుని స్థాయికి ఎదగాలని పట్టుబట్టి ఆ స్థాయికి ఎదిగి, ఆయన చేతనే బ్రహ్మర్షిగా గుర్తింపు పొందాడు. గాయత్రీ మంత్రానికి పరమార్థం ఏర్పరిచాడు. అయితే ఆయన ఆ విధంగా గాయత్రి మంత్రానికి పరమార్థం చెప్పటంతో ఈర్ష్యాసూయలకు గురైన ఒక అగ్ర కులం వారు ఆయనను దూషించారు. విశ్వామిత్రునికి కోపంఎక్కువ, సహనం తక్కువ. ఆయన తనను దూషించిన వారిపై ఆగ్రహించి మీరు గాయత్రీ మంత్ర జపానికి దూరం అవుతారు అని శపించాడు.

దుర్వాసుని శాపం

ఇంద్రునికి మేలు జరగాలని ఒక సారి దుర్వాసుడు మహాలక్ష్మీ యాగం చేశాడు. దేవి కటాక్షంతో ఒక పూలహారం ప్రసాదంగా పొందాడు. అది ఇంద్రునికిస్తే బాగుంటుందని దేవ సభలో కొలువు తీరి ఉన్న ఇంద్రునికి అందరి ముందూ ఆ హారాన్ని ఇచ్చాడు. 'ఈ హారం వేసుకుని నేను ఎక్కడకుపోను? ఎన్నాళ్లు తిరగను? అని భావించి నిర్లక్ష్యంగా దానిని తన గజమైన ఐరావతం మెళ్లో వేశాడు ఇంద్రుడు. ఐరావతం ఆ హారాన్ని తన కాళ్ల కింద పడేసి తొక్కి పాడు చేసింది. దుర్వాసుడు ఇది అవమానంగా భావించాడు. **'నీకు లక్ష్మీ కటాక్షం కలగాలని నేనిచ్చిన హారాన్ని నీవు స్వీకరించక ఐరావతానికి ఇచ్చావు. నీకే ఆ హారం విలువ తెలియదు. ఇక ఆ ఏనుగుకు ఎలా తెలుస్తుంది? నిన్ను శపిస్తున్నాను. నీతో పాటు దేవతలంతా లక్ష్మీ కళ తప్పిన వారవుతారు. అష్ట లక్ష్ములూ మీకు దూరమవుతారు. ఐరావతం, చంద్రుడు, ఉచ్చైశ్రవం, లక్ష్మి, కల్పవృక్షం, అమృత భాండం, పారిజాతం, అప్సరసలు, ధన్వంతరి మొదలైనవన్నీ మీకు తక్షణమే దూరమవుతాయి'** అన్నాడు. ఆయన చెప్పినట్టే జరిగింది. దానితో దేవతలంతా శ్రీహరిని శరణు వేడారు. దానికి ఆయన 'అవన్నీ దూరమై ఆయన శాపం ఫలించింది కనుక ఇప్పుడు క్షీర సాగర మథనం చేయండి. మళ్లీ అన్నీ లభిస్తాయి' అని ఉపాయం చెప్పాడు. వారి ఒక్కరి వల్ల అది సాధ్యం కాదు కనుక వారి సోదర సమానులైన రాక్షసుల్నీ ఒక్క తాటి పైకి తెచ్చి మథనం జరిపించాడు. దానితో వారు పోగొట్టుకున్నవన్నీ తిరిగి వచ్చాయి. ఎటువంటి వారికైనా అప్పుడప్పుడు బుద్ధి హీనత కలుగుతుందని, ఈ ఉదంతంలోని ఇంద్రుని చూస్తే తెలుస్తుంది.

నాగులకు తల్లి శాపం

కశ్యప ప్రజాపతి భార్యల్లో వినత, కద్రువ అనే వారున్నారు. వినత వలన గరుత్మంతుడు, కద్రువ వలన సర్పాలు జనించాయి. ఒకానొక సమయంలో వినత, కద్రువల మధ్య ఒక విషయంలో మాట పట్టింపు వచ్చింది. కద్రువకు తాను అన్నది తప్పని తెలుసు. అయినప్పటికీ తాను చెప్పినదే సరైనదని నిరూపించేందుకు తన కుమారులైన సర్పాల సాయం కోరింది. వారు ఆమె చెప్పింది తప్పు కనుక వారు అంగీకరించలేదు. దానితో ఆమె మీ **నాలుకలు చీలిపోవుగాక** అని శపించింది. ఆమె అన్నట్టుగానే గరుడుడు తెచ్చిన అమృతభాండంలోని అమృత బిందువులు దర్భలపై పడగా వాటిని నాకే ప్రయత్నంలో పదునుగా ఉన్న దర్భల వల్లసర్పాల నాలుకలు చీలిపోయాయి. ఇప్పటికీ సర్ప జాతుల నాలుకలు చీలి ఉండడం చూడవచ్చు

కచ, దేవయానుల శాప ప్రతిశాపాలు

రాక్షస గురువైన శుక్రాచార్యునికి మృత సంజీవనీ విద్య తెలుసు. దేవదానవ యుద్ధంలో మరణించిన రాక్షసులను ఆయన ఆ విద్యతో బతికించేవాడు. ఆ విద్య తెలుసుకురమ్మని దేవ గురువు బృహస్పతి తన కుమారుడైన కచుని శుక్రాచార్యుని వద్దకు పంపాడు. అతడు దేవ గురువు బృహస్పతి కుమారుడని తెలిసినా విద్య కోరి వచ్చిన అర్థుడిని నిరాకరించ రాదని శిష్యునిగా స్వీకరించాడు. అతని వినయ విధేయతలకు, మేధస్సుకు శుక్రాచార్యుడు ముగ్ధుడయ్యాడు. అతని కోరిక మేరకు మృత సంజీవినీ విద్య నేర్పడానికి అంగీకరించాడు. అలాగే నేర్పాడు కూడా. అతడు ఆ విద్యనేర్చుకుని తన తండ్రి వద్దకు వెళ్లే ముందు గురువుకు, అంతకు ముందు తనకు ప్రాణదానం చేసిన గురుపుత్రిక దేవయానికి చెప్పి వెడదామనుకున్నాడు. ఆ సమయంలో దేవయాని కచుని తనను పెళ్లాడమని కోరింది. అతడు నిరాకరించాడు. దానితో ఆమె కోపించి నీవు నేర్చుకున్న విద్య నీకు, దేవతలకు ఉపయోగపడకుండుగాక అని శపించింది. దానికి ప్రతిగా కచుడు నీవు నీ సవతి శర్మిష్ఠ చేత **కష్టాలపాలవుతావు** అని శపించాడు. ఆ శాప ఫలితంగా దేవయానికి సవితి పోరు తప్పలేదు. దేవయాని భర్త యయాతి శర్మిష్ఠనూ పెళ్లి చేసుకున్నాడు. వారిద్దరి వలన ఆయనకు నలుగురు పుత్రులు కలిగారు. వారు పెరిగి పెద్దవారై పెళ్లీడుకొచ్చారు. యయాతి మరి కొంతకాలం యవ్వనంతో ఉండాలనుకుని కొద్దికాలం పాటు తన వృద్ధాప్యాన్ని తీసుకుని వారి యవ్వనాన్ని తనకు ఇస్తారా అని కుమారులను అడిగాడు. ముందు యయాతి దేవయానికి జన్మించిన తన పెద్ద కొడుకు యదువును అడిగాడు. అతను నిరాకరించడంతో **అతని సంతానం ఎవరూ రాజు కారనీ ఒక వేళ అయినా రాజులుగా నిలవరు** అని శపించాడు. ఆ యదు వంశానికి చెందిన శ్రీకృష్ణుని తాత, ముత్తాతలు క్షత్రియలైనప్పటికీ ఎవరూ రాజులు కాలేదు. దేవయాని రెండో కొడుకు కూడా తండ్రి వృద్ధాప్యాన్ని తీసుకోవడానికి నిరాకరించడంతో అతనిని నీ **వారంతా అడవులలో సంచరింతురు గాక** అని శపించారు. శర్మిష్ఠ కొడుకులలో ఒకడు వార్ధక్యాన్ని తీసుకునేందుకు అంగీకరించడంతో అతనిని చిరకాలం చల్లగా జీవించమని ఆశీర్వదించాడు. అయితే యయాతి దేవయాని కొడుకులిద్దరినీ శపించాడని శుక్రాచార్యుడు కోపించాడు. **నీకు తిరిగి వార్ధక్యం ప్రాప్తించుగాక** అని యయాతిని శపించాడు.



- డాక్టర్ దేశిరాజు లక్ష్మీనరసింహారావు
9985844558

దిన ఫలాలు

మేష రాశి: పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూర ప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులా రాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఆంధ్రప్రభ నాయిక

ఆక్స్‌ఫర్డ్ టూ ఐపిఎస్

యుపి యువతి అఫ్రోజ్ ప్రస్థానం

రైతు కుటుంబంలో జన్మించినా, పెద్ద చదువులు చదివే ఆర్థిక స్థోమత లేకపోయినా ఉన్నత చదువులు ఆర్జించాలనే తపనతో కష్టపడి చదివి స్కాలర్‌షిప్‌లను సంపాదించుకుని ఆక్స్‌ఫర్డ్‌లో విద్యను అభ్యసిస్తుంది. మంచి విద్యను పొందుతున్నందుకు సంతోషంగా ఉన్నా, మనసులో ఏదో వెలితిగా ఉండేది. దానికి కారణం తన గ్రామానికి, కుటుంబసభ్యులకు ఏమీ చేయలేకపోతున్నాననే బాధ. ఆ బాధను తొలగించుకోవడానికి ఆమె తిరిగి గ్రామానికి వచ్చి యుపిఎస్‌సి ప్రవేశపరీక్షలను రాసింది. మొట్టమొదటిసారి ప్రయత్నంలో ఆమె ఐపిఎస్‌ర్యాంకు సాధించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీని వదిలి ఐపిఎస్ వైపు రావడానికి గల కారణాలేమిటో పరిశీలిద్దాం.



ప్రత్యేకం

ఐమా అఫ్రోజ్ పద్నాలుగేళ్ల వయసులో తండ్రి (రైతు) చనిపోయాడు. తండ్రిలేని కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అందరికీ తెలిసిన విషయమే. అటువంటి పరిస్థితుల్లో కూడా ఆమె తల్లి అండగా నిలబడి మంచి మార్గంలో నడిపించింది.

ఐమా అఫ్రోజ్ ప్రస్తుత వయసు 26సంవత్సరాలు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లా కందుకూరి టౌన్‌లోని ఒక రైతు కుటుంబానికి చెందినది. ఆమె ప్రజలకు సేవచేయడమే జీవిత లక్ష్యంగా చేసుకుంది. యుపిఎస్‌సి పరీక్షలలో ఐపిఎస్ ర్యాంకు సంపాదించడంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ సర్వీసులో స్థానం కోసం అప్పటివరకు విలాసవంతంగా గడుపుతున్న ఆక్స్‌ఫర్డ్ జీవితాన్ని వదులుకుని తన బాధ్యతలను చేపట్టడానికి భారతదేశానికి వచ్చింది. భారతదేశంలో శాంతి, సంపదలను కాపాడడమే నా కలని ఆత్మవిశ్వాసంతో చెబుతుంది.

ఆమె ఎంచుకున్న మార్గం పూలబాట కాదు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఎదురౌతాయి. అయినా ఆమె దానిమీదే ఆసక్తితో ముందుకు వెళుతోంది. పద్నాలుగేళ్ల వయసులో ఆమె తన తండ్రిని తెలియని జబ్బుతో సరైన చికిత్స అందక పద్నాలుగేళ్ల వయసులో కోల్పోయింది. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని ఆమె ఆ క్షణమే మనసులో నిర్ణయించుకుంది. తండ్రిలేని కుటుంబాన్ని తల్లే చూసుకుంటూ పిల్లలందరిని పెంచి పెద్దచేసింది.

''మా అమ్మ మా తమ్ముడికి మంచి విద్యాబుద్ధులు చెప్పించాలనుకుంది. ఆమె చాలా దృఢమైన మహిళ. ఒకసారి మనసులో ఏదైనా అనుకుంటే చేసి తీరాల్సిందే. తను రోజూ సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని మా పెళ్లి కట్నకానుకల కోసం వెనుకేసేది. చదువు మీద నా ఆసక్తిని చూసి నువ్వేమి చదువుకోవాలనుకుంటున్నావో అది చదువుకో. కావలసిన సహకారం నేను చేస్తాను'' అని ఆమె ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈస్థాయికి రాగలిగాను అని ఐమా అఫ్రోజ్ చెబుతుంది.



గ్రామంలో హైస్కూల్ చదువు అయిపోయాక ప్రసిద్ధమైన సెయింట్ స్టీఫెన్ కాలేజ్‌లో ఫిలాసఫీ చదువుకుంది.

''మూడు సంవత్సరాలు నేను ఆ కాలేజీలో ఫిలాసఫీ చదువుకున్నాను. ఆ మూడు సంవత్సరాలు నా జీవితంలో ఎంతో మంచి రోజులు. ఆసమయంలోనే పర్యావరణం గురించి తెలుసుకున్నాను. విద్యార్థులను ప్రొఫెసర్లు మంచి ప్రాంతాల్లో వదిలిపెట్టి అక్కడ వాతావరణాన్ని పరిశీలించమని చెప్పేవారు. అక్కడే క్లాసులు కూడా నిర్వహించేవారు. క్లాసులో కంటే బయట ఈవిధంగా చెప్పిన పాఠాలే మాకు బాగా గుర్తుండిపోయాయి. ఫిలాసఫీ చదివితే మనిషిలో ఆలోచనాశక్తి పెరుగుతుందని నాకు ఇక్కడ చదివాకే తెలిసింది'' అని చెబుతుంది ఐమా అఫ్రోజ్.

చదువుమీద శ్రద్ధతో స్కాలర్‌షిప్ సంపాదించుకుంది. ఆ స్కాలర్‌షిప్‌తో ప్రపంచంలో ప్రముఖమైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదువుకోవడానికి వెళ్లింది. అక్కడ వోఫ్‌సన్ కాలేజ్‌లో మాస్టర్ డిగ్రీని పూర్తిచేయడానికి వెళ్లింది. అక్కడ విద్యార్థులు, ప్రొఫెసర్లు అందరూ ఒక హాల్‌లో కూర్చుని డిబెట్‌ను పెట్టుకునేవారు. ఒకరి అభిప్రాయాలను మరొకరితో యధేచ్ఛగా పంచుకునేవారు. కాని ఆమె ఆలోచనలు ఎప్పుడూ సేవాభావం వైపే ఉండేవి. ఎక్కడ ఏమి చేయగలమా అని నిరంతరం ఆలోచించేది. మన్‌హటన్ ప్రాంతంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించేది. కొంతమంది ఆమె కార్యక్రమాలలో పాలుపంచుకునేవారు కాదు. అయినా నిరుత్సాహపడేది కాదు.

ప్రతిరోజూ ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాలు చేసి రూమ్‌కి వచ్చేవారు. ఇన్ని మంచి పనులు చేస్తున్నా రూమ్‌కి రాగానే అమ్మ, ఆమె చిరునవ్వు నా దగ్గర లేవని, వారిని మిస్సయ్యానని బాధపడేది. బాధతో రూమ్ కిటికీ నుంచి బయటకు చూస్తూ అలాగే నిల్చుండిపోయేది. ఆకాశాన్ని, రద్దీగా ఉన్న న్యూయార్క్ రోడ్లను చూస్తూ ఉన్నప్పుడు ఆమెలో ఒక ప్రశ్న మొదలైంది. ఈ హడావిడి జీవితమే తన లక్ష్యమా? ఈ చదువులు అయిపోయాక తానేమి చేయాలన్న ఆలోచన ఆమెలో మొదలైంది. గాంధీజీ కలను ఎవరు సాకారం చేస్తారు. ఆయన ప్రతి కంటిలోని కన్నీటిని తుడిచేలా మన సాయం ఉండాలి అనేవారు. అలా ఆమెలో ప్రశ్న మొదలైంది. విదేశాల్లో స్థిరపడడమే తన కలకాదు. గాంధీజీ కలలను సాకారం చేయడానికి తన వంతు కృషి చేయాలని ఆక్షణమే నిర్ణయించుకుంది. సెలవుల్లో ఆమె ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల కళ్లలో ఎంతో ఆనందాన్ని చూసేది. మా అమ్మాయి బాగా చదువుకుని మా కష్టాలను, బాధలను తీరుస్తాదనే నమ్మకం వారి కళ్లల్లో కనిపించేది. బంధువులు ఆమె దగ్గరకు వచ్చి రేషన్‌కార్డు కోసం అప్లికేషన్ పూర్తిచేయించుకోవడం చేస్తుంటే, మరికొంతమంది కాటారాక్ట్ సర్జరీకి తోడుగా తనను తీసుకెళ్లేవారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఉంటే ఇవన్నీ ఆమె చేయలేనని ఆలోచించింది. నేను ఇంటికి తిరిగి రావడంలోనే వీరందరికి సంతోషం ఉందని తెలుసుకుని సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరుకావాలని ప్రిపరేషన్ మొదలుపెట్టింది. 2017సం.లో జరిగిన పరీక్షల్లో ఆమె 217 ర్యాంకును సంపాదించింది. ఆ ర్యాంకు ప్రకారం ఐపిఎస్ సేవలకు అర్హత సంపాదించింది. హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో ఆమె 16 నెలలు శిక్షణకోసం వెళ్లింది. ''ఈ స్థాయికి రావడానికి అమ్మ, అన్నయ్య చేసిన త్యాగాలు ఎప్పటికీ మరిచిపోలేను. వారి సంతోషం కోసం నా శాయశక్తులా కృషిచేస్తాను'' ఐమా అఫ్రోజ్ చెబుతుంది.

వెనకబడిన వర్గాల పిల్లలకు విద్యాభ్యాసం అందించడానికి కుందర్కిలో ఒక కమ్యూనిటీని ఏర్పాటు చేసింది. ప్రతి విద్యార్థిలోనూ సామర్థ్యం ఉంటుంది. వారికి సరైన దిశలో ప్రోత్సాహాన్ని అందజేస్తే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకుని, మంచి స్థాయికి వెళ్లాక వారు దేశ ఉన్నతికి తనవంతు కృషి తప్పకుండా చేస్తారు. ఆదిశగా పిల్లలను తీర్చిదిద్దాలన్నదే ఐమా అఫ్రోజ్ ఆలోచన.

రితూ...ఇప్పుడో బ్రాండ్!

కట్టుబాట్లు, సాంప్రదాయాలు ఎక్కువగా పాటించే కుటుంబానికి చెందినదామె. ఆడవాళ్లు వంటకు పరిమితమనే ఆలోచనలు గల కుటుంబసభ్యుల మధ్య పెరిగింది. అలాంటి పరిస్థితుల్లో కూడా తనకంటూ ఒక గుర్తింపు రావాలనే తపన ఆమెలో ప్రారంభమైంది. దానికోసం నిరంతరం శ్రమించి ఆన్‌లైన్ వ్యాపారంలో లక్షలు సంపాదిస్తుంది. ఆన్‌లైన్ వ్యాపారాలలో నేడు మహిళలు చాలా మంది తమ అనుకున్న రంగాల్లో విజయాలను కైవసం చేసుకుంటున్నారు. ఆ కోవకి చెందినవారే రితు కౌశిక్. ఫ్లిప్ కార్ట్‌వేదిక చేసుకుని ఆమె తన వ్యాపారాన్ని దినాదినాభివృద్ధి చేసుకుంటోంది. అదెలాగో తెలుసుకుందాం.

రితు కౌశిక్ హర్యానాలోని సోనిపట్‌కి దగ్గరలో ఉన్న గ్రామానికి చెందినది. ఆడవాళ్లను ఆరుబయట కూడా కూర్చుని మాట్లాడుకోనివ్వని ప్రాంతానికి చెందినది. ఏ పనిచేయాలన్నా ఇంటి పెద్దవాళ్ల అనుమతి కావాలి. అది లేనిదే అడుగు కూడా బయటకు పెట్టలేని పరిస్థితులు. అలాంటి విషమపరిస్థితులకు భయపడి ఆమె మౌనంగా ఉండిపోలేదు. అలా అని వారి ఆచారాలకు వ్యతిరేకంగా నడవలేదు. ఇంట్లో ఉంటూనే ఆర్థికంగా రాణించాలనుకుంది. దానికోసం ఆలోచించి ఫ్లిప్ కార్ట్‌లో సెల్లర్‌గా తన వ్యాపారాన్ని మొదలుపెట్టింది.

దేశంలో ఒక మూల కూర్చుని కూడా మనకు కావలసిన ఆదాయాన్ని ఒక బటన్ నొక్కి సంపాదించుకోవచ్చునని రితు కౌశిక్ నిరూపించింది. ఈ కామర్స్ పరిశ్రమలో తనదంటూ ఒక ముద్రను వేసింది. భారతదేశంలో 2018సం.లో చాలామంది భారతీయులు తమకు కావలసిన వస్తువులను ఆన్‌లైన్‌లోనే కొనుగోలుచేస్తున్నారు. అమ్మేస్తున్నారు. అందులో ప్రధానమైనవి జెయింట్, ఫ్లిప్ కార్ట్. రీతు ఫ్లిప్‌కార్ట్‌లో విక్రేతగా మారింది. మహిళల అభిరుచిని అనుసరించి వారికి నచ్చే వస్తువులను ఆన్‌లైన్‌లో విక్రయించేది.



ఆదర్శం

ఆమె వయసు 31సంవత్సరాలు. ఆమెకు హ్యాండ్‌బ్యాగులు తయారుచేయడం అంటే చాలా ఇష్టం. 2016సం.లో ఆమె ఈ హ్యాండ్‌బ్యాగులను సొంతంగా డిజైన్ చేయడం మొదలుపెట్టి, మార్కెట్లోకి రితుపల్ కలెక్షన్స్ అనే పేరుతో ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. ఆమెకు ఎంతోఇష్టమైన పనినే వ్యాపారంగా మార్చుకుంది. ఎవరైతే రిస్క్ చేస్తారో వారిజీవితం ఆనందంగా ఉంటుందని రితు అంటోంది. పదహారేళ్ల వయసులోనే ఆమెకు వివాహం జరిగింది. భర్త ప్రభుత్వ ఉద్యోగి. ఆమెలోని చదువుమీద ఉన్న శ్రద్ధను గమనించి మంచి చదువులు చదువుకోమని ప్రోత్సహించేవారు. 2016లో ఆమె గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఈరోజు ఈ విధంగా వ్యాపారంలో వృద్ధి సాధిస్తున్నానంటే దానికి నా భర్త సహాయసహకారాలు కారణమని గర్వంగా రితు చెబుతుంది. ఆమె హ్యాండ్‌బ్యాగ్ వ్యాపారాన్ని ఫ్లిప్‌కార్ట్‌లో మొదలుపెట్టింది. తన చుట్టుపక్కల వారందరూ హ్యాండ్‌బ్యాగులను ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయడం గమనించిన ఆమె తన వస్తువులను కూడా ఆన్‌లైన్ పెట్టడం మొదలుపెట్టింది. ఆమె చేస్తున్న ప్రయత్నాన్ని చూసి ఎంతోమంది నీకు సంపాదించాల్సిన అవసరమేముంది. ఇంట్లో కూర్చుని పిల్లలను చూసుకోవాలని హితవచనాలు చెప్పేవారు.

ఇద్దరు పిల్లల తల్లివి నీకు ఇవన్నీ అవసరమా అని వారనే మాటలకు ఆమెకు చాలా కోపంరావడమే కాకుండా పంతం కూడా పెరిగింది. ఆ పంతంతోనే మరిన్ని డిజైన్లు చేసి ఆన్‌లైన్‌లో పెట్టింది. నా వ్యాపారానికి ఎంతోమంది తమ సహకారాన్ని అందించారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

''నాకు కావలసిన సహాయాన్ని, సహకారాన్ని సరైన సమయంలో ఫ్లిప్‌కార్ట్ అందించింది. ఆ సమయం నుంచి ఎక్కువ వస్తువులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌మీద ఎలా విక్రయించాలా అనేది ఆలోచించడం మొదలుపెట్టాను. వ్యాపారాభివృద్ధికి ఫ్లిప్‌కార్ట్ నాకు లోను మంజూరు చేస్తానని చెప్పింది. కాని అప్పటివరకు నేను పొదుపు చేసిన మొత్తంతోనే వ్యాపారాన్ని మొదలుపెట్టాను''అని రితు చెప్పింది.

కంప్యూటర్ ఎలా ఆపరేట్ చేయాలో నా భర్త దగ్గర నుంచి నేర్చుకున్నాను. పిల్లలు స్కూల్‌కి వెళ్లిపోయాక ఆయన చెప్పిన విధానాలను మళ్లీమళ్లీ ప్రయత్నించేదాన్ని. అలా మొదలైన ఆ వ్యాపారం రోజురోజుకీ అభివృద్ధిపథంలో సాగుతోంది.

వ్యాపారం ప్రారంభించిన మొదటి సంవత్సరంలో ఆమె సంపాదించినది నెలకు లక్షరూపాయలే. ఈమొత్తం సరిపోదని మిగతా షాపులతో కూడా మాట్లాడి అక్కడ కూడా తన కలెక్షన్స్ అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంది. తన వస్తువుల గురించి వారికి వివరించి వాటి నాణ్యత గురించి చెప్పి వాటిని న్యూ బ్రాండ్‌లో అవతార్ పేరుతో సేల్ చేసేది. ఇప్పటికి ఆమె ఈ వ్యాపారం మొదలుపెట్టి మూడు సంవత్సరాలు అవుతుంది. ఆమె తయారు చేస్తున్న హ్యాండ్‌బ్యాగులు ఆమె ఆదాయాన్ని సంవత్సరం సంవత్సరానికి పెంచుతుంది. ప్రస్తుతం ఆమె 7 లక్షల నుంచి 8 లక్షల వరకు నెలకు సంపాదిస్తుంది.

రితుపల్ కలెక్షన్స్ బ్యాగుల రేటు రూ200/-ల నుంచి రూ.1500/-ల వరకు ఉంటుంది. దక్షిణాది మహిళలకు ఎటువంటి మోడల్, కలర్స్ ఇష్టమో ఆవిధంగా ఆమె తయారుచేస్తుంది. తన వ్యాపారాన్ని తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో కూడా పెంచాలనే ఆలోచనలో ఉంది.

''నాలాంటి వారికి నా ఆదాయం చాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది. కాని నెలకు రూ.20లక్షలు అమ్మకాలు చేయాలన్నదే నేను లక్ష్యంగా పెట్టుకున్నాను. ఒంటరిగా చేసిన ప్రయత్నం ఇప్పుడు రితుపల్ కలెక్షన్ పేరుతో మంచి బ్రాండ్‌గా మార్కెట్లో అందరి నోళ్లలో వినబడుతుంది. నా పేరు చదవగానే నేను గుర్తు వచ్చేటట్లు ఉండాలన్నదే నా ఆశ'' అని అంటోంది రితు కౌశిక్.

వన్డే క్రికెట్‌లో 'స్మృతి' పథం

చిన్నతనంలో నాన్నతో పాటు అన్నయ్య క్రికెట్ ఆట చూడడానికి సరదాగా వెళ్లింది. అక్కడ వారు ఆడే ఆటను చూసాక అప్పటి వరకు క్రికెట్ అంటే ఏమిటో తెలియని ఆ చిన్న మనసులో తాను కూడా క్రికెట్ ఆడి మంచి పేరు తెచ్చుకోవాలనే పంతం పెరిగింది. ఆ పంతంతో అన్నయ్యతో పాటు క్రికెట్ ఆడడం మొదలుపెట్టింది. ఆవిధంగా మొదలైన ఆమె క్రికెట్ జీవితం కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈరోజు వన్డే టాప్‌ర్యాంకర్‌లో మొదటిస్థానాన్ని దక్కించుకుంది. ఆమే స్మృతి మంధానా.

స్ఫూర్తి



ఆమె పూర్తి పేరు స్మృతి శ్రీనివాస్ మంధానా. జులై 18, 1996లో మహారాష్ట్రలోని ముంబయి నగరంలో జన్మించింది. ఆమె భారతీయ మహిళా క్రికెట్ టీమ్‌లో ఒక క్రీడాకారిణి. ఎడమచేతి బ్యాట్స్‌ఉమెన్. బౌలింగ్‌ని కుడిచేత్తో మీడియం పేస్‌లో వేస్తుంది. ఎక్కువగా బ్యాట్స్‌ఉమెన్‌గా రంగంలోకి దిగుతుంది. భారత టీమ్‌లో చేరిన తక్కువ సమయంలోనే తన ఆటనైపుణ్యంతో వన్డే మ్యాచ్‌లలో మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. మిథాలీరాజ్ 5వ ర్యాంక్‌లో ఉంది. ఆమె ఆటతీరును పరిశీలించిన క్రికెట్‌బోర్డు అంతర్జాతీయ మహిళా క్రికెట్ క్రీడాకారిణులలో 'స్మృతి ఈజ్ ది బెస్ట్' అని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. 2018 సంవత్సరానికి ఉత్తమ క్రికెట్ క్రీడాకారిణిగా గుర్తించిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ డిసెంబర్‌లో 'రాచియెల్ హెయోహోయ్ ఫ్లింట్' అవార్డును అందజేసింది. క్రికెట్‌లోకి ప్రవేశించిన తక్కువ సమయంలోనే వన్డేక్రికెట్ మ్యాచ్‌లలో మొదటిర్యాంకు సాధించడం సాధారణవిషయం కాదు.

బాల్యం

ఆమె తల్లిదండ్రులు స్మిత, శ్రీనివాసన్ మంధానా. ఆమెకు రెండు సంవత్సరాల వయస్సున్నప్పుడే అనివార్య కారణాల వల్ల ముంబయి నుండి మహారాష్ట్రలోని సంగ్లీలోని మాధవనగర్‌కి వెళ్లిపోయారు. అక్కడే ఆమె స్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసింది. తండ్రి, అన్నయ్య ఇద్దరూ మంచి క్రికెట్ ప్లేయర్స్. అన్నయ్య శ్రవణ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో ఆడేవాడు. ఒకరోజు తన తండ్రితో మహారాష్ట్రలో జరిగిన అండర్ 16 టోర్నమెంట్స్‌లో అన్నయ్య ఆటను చూడడానికి వెళ్లింది. అక్కడ శ్రవణ్ ఆడిన తీరును చూసి ఆమెకు కూడా క్రికెట్ మీద ఆసక్తి పెరిగింది. అప్పటికి ఆమె వయసు తొమ్మిదిసంవత్సరాలు. ఆమె ఆసక్తిని చూసి తండ్రి, అన్నయ్య ప్రోత్సహించడంతో వారితో ఆడి ఆటను నేర్చుకుంది. ఆ వయసులోనే మహారాష్ట్ర అండర్-15 టీమ్‌కి కూడా ఎంపికైంది. పదకొండు సంవత్సరాల వయసులో ఆమె మహారాష్ట్ర అండర్-19 టీమ్‌లో స్థానం సంపాదించింది. ఆమెలోని ఆసక్తిని గమనించిన కుటుంబ సభ్యులు తమ పూర్తి సహాయసహకారాలను అందించేవారు. తండ్రి శ్రీనివాస్ కెమికల్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నారు. తన ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూనే స్మృతి క్రికెట్ ప్రోగ్రామ్స్ గురించి ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకుని ప్రోత్సహించేవారు. కూతురు గ్రౌండ్‌లో బాగా ఆడాలంటే కావలసిన పోషకాహారం గురించే కాకుండా దుస్తులు వంటి విషయాలన్నింటి మీద శ్రద్ధ తీసుకునేవారు తల్లి స్మిత. అన్నయ్య శ్రవణ్ ఆమెను తనతో పాటు ప్రాక్టీసుకి తీసుకెళ్లి బాల్ వేయడం ఎలాగో నెట్‌లోకి తీసుకెళ్లి చూపించేవాడు.

క్రీడారంగంలో ప్రతిభ

2013 సం.అక్టోబరులో మొట్టమొదటి సారిగా వన్డేగేమ్‌లో రెండు వందల పరుగులు సాధించిన మహిళగా రికార్డు సృష్టించడంతో ఆమె ప్రతిభ వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర గుజరాత్‌లకి మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లలో ఆమె ఈ రికార్డును సృష్టించింది. ఆ మ్యాచ్‌లో ఆమె 150 బాల్స్‌కు 224 పరుగులు సాధించింది. ఈ రికార్డును వడోదరలోని అలెంబిక్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన వెస్ట్‌జోన్ అండర్-19 టోర్నమెంట్‌లో సాధించింది. 2016లో ఉమెన్స్ ఛాలెంజర్ ట్రోఫీలో ఆమె మూడు ఆఫ్ సెంచరీలను చేసింది. ప్రతి మ్యాచ్‌లోనూ అత్యధిక స్కోరులతో టీమ్ విజయం సాధించడానికి కృషిచేసేది. ఒక మ్యాచ్‌లో 82 బాల్స్‌లో 62 పరుగులు చేయాల్సి ఉంటే ఆమె అతి సులువుగా పరుగులు చేసి విజయం సాధించింది. ఆ టోర్నమెంట్‌లో ఆమెదే టాప్ స్కోర్.

సెప్టెంబర్ 2016సం.లో బ్రిస్‌బేన్ హీట్ ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్‌తో ఒక సంవత్సరం కాంట్రాక్టును ఆమె చేసుకుంది. తనతో పాటు హర్మన్‌ప్రీత్ కౌర్‌ను కూడా తీసుకెళ్లింది. భారతజట్టులోని ఇద్దరు మంచి క్రీడాకారిణులు ఈ లీగ్‌కోసం సంతకాలు పెట్టారు.

జనవరి 2017సం.లో ఆమె మైదానంలో ఆడుతుండగా బాల్‌ను పట్టుకునే సందర్భంలో కిందపడిపోయి మోకాలికి బాగా గాయమైంది. అప్పటి వరకు జరిగిన 12 ఇన్నింగ్స్‌లో ఆమె 89 పరుగులు సాధించింది. ఈ గాయం వల్ల ఆ మ్యాచ్‌ను ఆపివేయాల్సి వచ్చింది. 2018సం.లో ఆమె కియా సూపర్ లీగ్‌లో ఆడడానికి సంతకం చేసింది. లీగ్‌మ్యాచ్‌లో ఆడిన మొట్టమొదటి భారతీయ క్రీడాకారిణిగా ఆమె పేరు మళ్లీ మారుమ్రోగింది.



అంతర్జాతీయంగా...

మంధానా తన మొదటి అంతర్జాతీయ పోటీని ఆగస్టు 2014సం.లో వోమ్స్లే పార్క్‌లో ఇంగ్లాండ్‌తో ఆడింది. ఆమె తన ఆటతీరుతో టీమ్ గెలిచేలా స్కోరును చేసింది. మొదటి, రెండవ ఇన్నింగ్స్‌లో 22, 51 స్కోరులను చేసి ఇండియాను గెలిపించింది. ఇంకో ఇన్నింగ్స్‌లో ఆమె మొదటి వికెట్ పార్ట్‌నర్‌షిప్‌గా వచ్చి 76 పరుగులను తిరుష్ కామినితో కలిసి మొత్తం 182 పరుగులు సాధించారు.

2016సం.లో రెండవ వన్డేమ్యాచ్ ఆస్ట్రేలియాలో బెల్లెరైవ్ ఓవల్ ఇన్ ఓబర్ట్‌లో జరిగింది. అందులో ఆమె అంతర్జాతీయ స్థాయిలో వంద పరుగులను (109 బంతులలో 102 పరుగులను) సాధించింది. భారత క్రీడాకారిణులలో ఐసిసి ఉమెన్స్ టీమ్ ఆఫ్ ది ఇయర్ 2016గా ఎంపికైంది కేవలం మంధానా మాత్రమే. ఆమె కాలికి అయిన గాయం తగ్గిన తరువాత 2017 వరల్డ్ కప్‌లో ఆడడం మొదలుపెట్టింది. ఇంగ్లాండ్‌లో జరిగిన వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆమె పాల్గొని టీమ్‌ని 35 పరుగుల తేడాతో గెలిపించింది. ఆ పోటీలో ఆమె పేరు మరోసారి మారుమ్రోగిపోయింది. ఆమె రెండవ సెంచరీని వెస్ట్ ఇండీస్‌తో ఆడిన మ్యాచ్‌లో చేసింది. భారతదేశ టీమ్ 2017 ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో స్థానం సంపాదించుకోవడానికి ఇంగ్లాండ్‌ను తొమ్మిది పరుగులతో ఓడించింది. అందులో ఆమె పాత్ర చాలా ఉంది. 2018సం.లో ఆమె మహిళల ట్వంటీ ఇంటర్నేషనల్ పోటీలో ముప్పై బంతుల్లో ఆఫ్ సెంచరీ చేసి రికార్డు సృష్టించింది. ఇదే కాకుండా మిగతా వన్డే మ్యాచ్‌లలో కూడా ఆమె మంచి ఆటతీరును ప్రదర్శించి అందరి ప్రశంసలను అందుకుంది. ఆగస్టు3, 2018లో ఆమె తన మొట్టమొదటి సెంచరీని 2018ఉమెన్స్ క్రికెట్ సూపర్‌లీగ్‌లో చేసింది. అక్టోబర్ 2018సం.లో వెస్ట్ ఇండీస్‌లో జరిగే ఉమెన్స్ వరల్డ్ ట్వంటీ ట్వంటీ టోర్నమెంట్‌కు కూడా ఆమెను ఎంపిక చేశారు. ఆ టోర్నమెంట్‌లో ఆమె టీ ట్వంటీ మ్యాచ్‌లలో వెయ్యి పరుగులు సాధించిన మూడవ మహిళగా రికార్డు సంపాదించింది. ఆమెను ఐసిసి ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసిసి ఉమెన్స్ ఓడిఐప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిర్ణయించారు. క్రీడారంగంలోకి ప్రవేశించిన తక్కువసమయంలోనే తన ఆటనైపుణ్యంతో ఉన్నతస్థాయికి ఎదిగిన స్మృతి మంధానా మిగతా క్రీడాకారిణులకు ఎంతో స్ఫూర్తిదాయకం.

ఆ మూడింటితో కీర్తి రెపరెపలు



కీర్తిసురేష్

అందానికి అందం...అభినయానికి అభినయం...విజయాలకు విజయాలు...ఈ మూడు ప్లస్ పాయింట్‌లు ఏ నటికైనా ఉంటే వారి కెరీర్ ఎంతగా ప్రకాశిస్తుందో ఊహించవచ్చు. కీర్తిసురేష్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. తెలుగు, తమిళ, మలయాళ భాషల చిత్రాలు చేస్తూ పేరుకు తగ్గట్టుగా తన కీర్తిని మరింతగా పెంచుకుంటోంది. నేను లోకల్, మహానటి చిత్రాల విజయంతో టాలీవుడ్‌లో ఆమె పేరు మారుమోగుతోంది. మరోవైపు గతేడాది తమిళంలో విజయ్ సరసన, విశాల్ సరసన ఆమె నటించిన సర్కార్, పందెంకోడి-2 చిత్రాలు తెలుగులో కూడా విడుదలై...రెండు భాషలలోనూ ప్రేక్షకాదరణ చూరగొన్నాయి. దాంతో కీర్తికి మరింత డిమాండ్ పెరిగింది. మొదట్నుంచి వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఒప్పుకోకుండా ఆచితూచి సినిమాలను చేస్తున్న ఆమె తెలుగులో మహానటి తర్వాత ఇప్పుడు ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని అంగీకరించిన సంగతి తెలిసిందే.ఆమె ప్రధాన పాత్రలో నరేంద్రనాథ్ దర్శకత్వంలో మహేష్ కోనేరు నిర్మించే ఈ చిత్రం సమకాలీన పరిస్థితులకు అద్దంపట్టే ఫ్యామిలీడ్రామా కథాంశంతో ఉంటుందని అంటున్నారు. ఈ నెల 10న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతారని వినిపిస్తోంది. కేరళ నేపథ్యంలో సాగే ఇతివృత్తమని, అందుకే అధికశాతం చిత్రీకరణను అక్కడ జరుపుతారని చెబుతున్నారు. తెలుగుతో పాటు కీర్తికి తమిళంలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని..తమిళనాట కూడా ఈ చిత్రాన్ని విడుదల చేస్తారట. ఇదిలావుండగా...నాని కథానాయకుడిగా విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. ఇందులో ఐదుగురు కథానాయికలు ఉంటారని, వారిలో ముగ్గురి ఎంపిక దాదాపుగా ఖరారైందన్న మాటలు వినిపిస్తున్నాయి. కీర్తిసురేష్‌తో పాటు మేఘాఆకాష్, ప్రియావారియర్‌లను ఎంపిక చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు మలయాళంలో మోహన్‌లాల్, సునీల్‌శెట్టి, అర్జున్, ప్రభుదేవా నటిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో కూడా కీర్తి సందడి చేయబోతోంది. దాదాపు వంద కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. మొత్తంమీద మూడు భాషల సినీరంగాల్లో కీర్తి హవా కొనసాగుతోంది.

కోనసీమలో కోలాహలం



వెంకటేష్

నాగచైతన్య

వెంకటేష్, నాగచైతన్య కలిసి నటించబోయే వెంకీమామ చిత్రంపై పరిశ్రమలోను...ప్రేక్షకలోకంలోను విపరీతమైన ఆసక్తి నెలకొంది. నిజజీవితంలో మామాఅల్లుళ్లు అయిన వీరిద్దరూ తొలిసారిగా వెండితెరను ఒకే సినిమా ద్వారా పంచుకోనుండటమే ఆ ఆసక్తికి కారణం. మరోవైపు ఈ చిత్రం ఎలాంటి నేపథ్యంతో ఉంటుందన్న అంశంపై కూడా ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. మొదట్నుంచి పల్లెటూరి నేపథ్య ఇతివృత్తంతో ఈ చిత్రం ఉంటుందని వినిపిస్తుండగా...తాజాగా అలాంటి అంశాన్ని ఉటంకిస్తూ...కోనసీమ నేపథ్యంలో సాగే కథాంశంతో సాగే చిత్రమిదని అంటున్నారు. ఈ నెల 22న రాజమండ్రి పరిసరాల్లో చిత్రీకరణను మొదలుపెట్టనున్నట్లు తెలిసింది. వెంకటేష్, నాగచైతన్య పాత్రల చిత్రణ చాలా సరదాగా ఉంటుందట. ఇటీవల సంక్రాంతికి విడుదలై..ఘన విజయం సాధించిన వెంకటేష్, వరుణ్‌తేజ్‌ల చిత్రం ఎఫ్-2 కూడా వినోదానికి పెద్దపీట వేసింది కావడం గమనార్హం. సర్దార్ గబ్బర్‌సింగ్, జై లవకుశ చిత్రాల దర్శకుడు కె.ఎస్.రవీంద్ర (బాబి) దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రియ, నాగచైతన్య సరసన రకుల్‌ప్రీత్‌సింగ్ నటించనున్నట్లు సమాచారం. సురేష్ ప్రొడక్షన్స్, కోన ఫిలిం కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

అంచనాలు అందుకోలేకపోయాం



రామ్ చరణ్

సంక్రాంతికి విడుదలైన భారీ చిత్రాల్లో 'వినయ విధేయ రామ' ఒకటి. రామ్‌చరణ్, బోయపాటి శ్రీను తొలి కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆశించిన విజయం దక్కలేదు. కమర్షియల్‌గా నిరాశపరిచింది. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంత ప్రతికూలత మధ్య 95 కోట్ల వ్యాపారం జరిగిన ఈ సినిమాకు సుమారు 60 కోట్లు వసులుకావడం విశేషం. 'వినయ విధేయ రామ' సినిమా విడుదలైన ఇరవై రోజుల తర్వాత చిత్ర కథానాయకుడు రామ్ చరణ్ స్పందించారు. పరాజయాన్ని అంగీకరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''మా వినయ విధేయ రామ సినిమా కోసం రేయింబవళ్ళు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. నిర్మాత దానయ్యగారు అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మి పంపిణీదారుల మరియు ప్రదర్శనదారులకి కృతజ్ఞుడనై ఉంటాను. మీ అందరికీ నచ్చి, మిమ్మల్ని వినోదింపజేసే సినిమా అందించేందుకు మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు మేము అనుకున్న విధంగా ఒక మంచి సినిమాని అందించలేక మీ అంచనాలని అందుకోలేకపోయాం. మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకునచ్చే, మీరు మెచ్చే సినిమా చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం'' అని రామ్ చరణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఒక స్టార్ హీరో తన సినిమా అంచనాలు అందుకోలేకపోయింది అంటూ బహిరంగంగా అంగీకరంచడం చాలా అరుదు. ఈ విషయంలో రామ్ చరణ్ స్పందించడం చాలా మందిని ఆశ్చర్యం కలిగించింది.

సైరాలో అనుష్క...!



అనుష్క

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'సై రా' గురించి తరచుగా ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, నయనతార, విజయ్ సేతుపతి వంటి తారలు నటిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో అనుష్క కూడా చేరిందనే మాట వినిపిస్తోంది. చిరంజీవి, అనుష్క గతంలో 'స్టాలిన్' అనే సినిమాలో ఓ పాటలో నటించారు. మధ్యలో చిరంజీవి సినిమాకు దూరంగా ఉండడం వల్ల ఈ కాంబినేషన్ రిపీట్ కాలేదు. తాజాగా సైరాలో అనుష్కను ముఖ్యపాత్రకి ఎంపికచేసినట్టు తెలిసింది. బాహుబలి, అరుంధతి, భాగమతి సినిమాలో హీరోయిన్లల్లో అగ్రస్థానంలో ఉన్న అనుష్క 'సైరా'లో నటిస్తుండడం ఆసక్తి కలిగించే విషయం. 'సైరా' చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ చరణ్ నిర్మాణబాధ్యతలు వహిస్తున్నారు. 'సైరా' సినిమా కోసం చిత్రయూనిట్ పాండిచ్చేరిలో ఉంది. అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. విడుదల తేదీని వెల్లడించనప్పటికీ, విజయదశమికి ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు.

బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో...



శ్రీనాథ్, సాన్వీ

మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘనా జంటగా గోరేటి వెంకన్న కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్'. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాత మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ ''పెద్ద నిర్మాణ సంస్థలకు తీసిపోకుండా మా చిత్రాన్ని నిర్మించాం. వినోదాత్మక కథనం ఉంటూనే ఆలోచింపజేసే సినిమా అవుతుంది. నేడు సమాజంలో ఎదుర్కొంటున్న ఒక సమస్యను ఇందులో చూపించాం. మార్చి రెండవ వారంలో సినిమాను విడుదల చేస్తాం'' అని చెప్పారు.

దర్శకుడు నాగసాయి మాకం మాట్లాడుతూ ''ఎలాంటి అసభ్యతకు తావులేని విధంగా ఉంటుంది. బిలాల్‌పూర్ అనే వూరిలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వింత వింత కేసులు కడుపుబ్బా నవ్విస్తాయి. సినిమా అద్యంతం సహజమైన పాత్రలతో, సన్నివేశాలతో సాగుతుంది'' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాబూ వర్గీస్, ఛాయాగ్రహణం: తోట వి. రమణ.

4 లెటర్స్‌కు వెంకటేష్ అభినందన



వెంకటేష్, ఈశ్వర్

'4 లెటర్స్' చిత్రం ట్రైలర్ వీక్షించిన విక్టరీ వెంకటేష్ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అనేది ఉప శీర్షిక. ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఏ సర్టిఫికెట్ లభించింది. ఫిబ్రవరి 22న సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు తెలిపారు. ''మా సంస్థ నిర్మిస్తున్న తొలి సినిమా ఇది. టీజర్‌ను ప్రముఖ దర్శకులు కె.రాఘవేంద్రరావుగారు విడుదల చేశారు. హీరోగా పరిచయం అవుతున్న ఈశ్వర్ నటనలో శిక్షణ తీసుకున్నారు. కమర్షియల్ హంగులతో అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా రూపొందించడం జరిగింది'' అని వారు చెప్పారు.

హీరో ఈశ్వర్ మాట్లాడుతూ ''విక్టరీ వెంకటేష్ గారి ఆశీస్సులు అందుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''కలుసుకోవాలని తర్వాత తెలుగులో నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇది నేటితరం ప్రేమకథా చిత్రం. అందుకే కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అని ఉప శీర్షిక చేర్చడం జరిగింది. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం ఆలోచనా విధానాన్ని ఇందులో చూపిస్తున్నాం. హైదరాబాద్‌లో టాకీ, బ్యాంకాక్‌లో పాటలనుచిత్రీకరించాం'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: చిట్టిబాబు.

నయనతార క్రైమ్ థ్రిల్లర్



నయనతార

లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించిన తాజా చిత్రం 'ఇమైక్క నోడిగల్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'అంజలి సిబిఐ' పేరుతో అనువదిస్తున్నారు. ఆర్. అజయ్ జ్ఞానముత్తు ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారు. టైటిల్ పాత్రలో నయనతార నటించింది. అధర్వ, రాశిఖన్నా ఇతర ముఖ్య పాత్రధారులు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకునిగా నటించారు. తెలుగులో విశ్వశాంతి క్రియేషన్స్ హక్కులను పొందించింది. సి.హెచ్.రాంబాబు, ఆచంట గోపీనాథ్ అనువదిస్తున్నారు. ఫిబ్రవరి 22న ఈ సినిమాను విడుదల చేస్తారు.

ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళన్, ఛాయాగ్రహణం: ఆర్.డి.రాజశేఖర్.

పోలీస్ ఉన్మాది



రమ్య

రక్షణ కల్పించాల్సిన పోలీసు ఉన్మాదిగా ఎందుకు మారాడు? అలా మారడానికి దారి తీసిన పరిస్థితులేమిటీ? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'ఉన్మాది'. ఎన్.ఆర్. రెడ్డి దర్శకత్వంలో ఎన్. కరణ్ రెడ్డి సమర్పణలో ఈ సినిమా తెరకెక్కింది. నిర్మాత ఎన్.ఆర్. రెడ్డి మాట్లాడుతూ ''గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ. కమర్షియల్ అంశాలు జోడిస్తూ, వినోదాత్మకంగా నిర్మించాం. డేవిడ్ సంగీతం అందించిన పాటలు, ట్రైలర్స్ ఇటీవలే విడుదలచేశాం. మిగతా కార్యక్రమాలు పూర్తిచేసి ఈ నెల 8న సినిమాను విడుదల చేస్తున్నాం'' అని చెప్పారు. టైటిల్ పాత్రలో ఎన్.ఆర్.రెడ్డి నటిస్తూ, దర్శకత్వం వహించారు. అల్లు రమేష్, శిరీష్, నాగిరెడ్డి, రమ్య, ప్రమీల, పుష్పలత, సోను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: డేవిడ్, ఛాయాగ్రహణం: దంటు వెంకట్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎన్.ఆర్.రెడ్డి.